హైదరాబాద్
శనివారం
24-2-2018
సంపుటి: 2, సంచిక: 86
పేజీలు: 12+16, వెల: రూ. 5
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

భావోద్వేగాలే రంగులు
'మైత్రి'లో..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

ఢిల్లీ సీఎం ఇంట్లో పోలీసుల సోదాలు

- ఇంట్లో అంగుళం అంగుళం గాలింపు
- సీఎస్‌పై దాడి కేసులో ఆధారాల సేకరణ
- ముఖ్యమంత్రి నివాసంలో దౌర్జన్యమా?
- కేజ్రీవాల్‌ను అవమానించే ప్రయత్నమే
- ఢిల్లీ ప్రభుత్వ అధికార ప్రతినిధి ఆరోపణ

7 లో..

ఇదీలోకం!



నీరవ్‌మోదీ బండారం ప్రపంచమంతా ప్రచారమయ్యాక తనతో ఇంకేం పని ఉంటుందని వెళ్లిపోయిందట..!

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో శనివారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో మార్పులేదు. చలిగాలుల తీవ్రత పెరుగుతుంది. గంటకు 18 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 34 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 17 డిగ్రీలు

గాలిలో తేమ: 42 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: నవమి రా.10.36 తదుపరి దశమి; నక్షత్రం: రోహిణి ఉ.11.26 తదుపరి మృగశిర; వర్జ్యం: సా.4.41 - 6.10; దుర్ముహూర్తం: ఉ.6.41 - 8.14; రాహుకాలం: ఉ.9.35 - 11.02; అమృతఘడియలు: ఉ.8.26 - 9.57; శుభసమయం : ఉ.11.03-1.00;

సూర్యోదయం: 6.41,

సూర్యాస్తమయం: 6.18



సమీక్షాసమావేశంలో ఉన్నతాధికారులతో చర్చిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

అసైన్డ్‌కు పట్టా

ఇతర పట్టాదారులతో పాటు కొత్తవి ఇవ్వాలి

- పాస్ పుస్తకాల్లో ఎలాంటి పొరపాట్లు ఉండొద్దు
- ఆధార్‌తో అనుసంధానం లేకుంటే బినామీగా గుర్తింపు
- వచ్చే నెలాఖరుకు అన్ని గ్రామాలకు మంచినీళ్లు: కేసీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (మనం ప్రతినిధి):

ఇతర పట్టాదారులతో పాటుగానే అసైన్డ్ భూములు కలిగిన వారికి కూడా కచ్చితంగా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను **మిగతా 6లో..**

కాళేశ్వరంపై ఊరట

పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం

- పిటిషన్‌దారుపై కోర్టు తీవ్ర ఆగ్రహం
- చెన్నై బెంచ్ నుంచి ఇక్కడికెందుకొచ్చారు?
- ఫోరం హంటింగ్ చేస్తున్నారా? అంటూ ప్రశ్న
- పిటిషనర్ ఆలోచన సరిగ్గా లేదు: ధర్మాసనం
- పర్యావరణ అనుమతులపై గతంలో పిటిషన్
- కోర్టు తీర్పుపై హరీశ్‌రావు హర్షం
- కాంగ్రెస్ నేతల క్షమాపణకు మంత్రి డిమాండ్



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (మనం ప్రతినిధి):

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వానికి ఊరట లభించింది. పర్యావరణ **మిగతా 6లో..**

త్వరలోనే పాక్‌కు బుద్ధి చెబుతాం



- సుంజవాన్ దాడికి మూల్యం తప్పదు
- ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్

7 లో..



హెచ్-1బిపై మరిన్ని ఆంక్షలు

వీసా జారీ మరింత కఠినం.. పని ఉన్నన్నాళ్లే వీసా అమలు

క్లయింట్ లొకేషన్‌లో చేస్తే కష్టం.. అక్కడ పని ఉంటేనే అనుమతి.. బెంచి మీద ఉండేవాళ్లకు నో వీసా

అమెరికన్ల ప్రయోజనాల కోసమే.. ఎంత తక్కువ కాలమైనా ఇవ్వచ్చు.. మూడేళ్ల కాలపరిమితి క్లాజు రద్దు

ఏడు పేజీలతో కొత్త ఉత్తర్వులు.. ప్రధానంగా భారతీయులపై ప్రభావం




9 లో..



సొంతింటి కల సాకారం

సింగరేణి కార్మికులకు బోర్డు వరం.. వడ్డీ లేకుండా 10 లక్షల రుణం

- గతంలో తీసుకున్నవారికీ వర్తింపు
- ఉద్యోగం వద్దనుకుంటే 25 లక్షలు
- తల్లిదండ్రులకూ సూపర్‌స్పెషాలిటీ వైద్యం
- కార్మికుల క్వార్టర్లలో ఏసీ సౌకర్యం
- సింగరేణి బోర్డు భేటీలో నిర్ణయం



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (మనం ప్రతినిధి):

దేశంలోనే ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేని విధంగా వినూత్న పథకానికి సింగరేణి కాలరీస్ కంపెనీ శ్రీకారం చుట్టింది. నల్లసూర్యుళ్లకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని సింగరేణి **మిగతా 6లో..**

సినిమాలు బంద్!

మార్చి 2 నుంచి ప్రదర్శనల నిలిపివేత

- దక్షిణాది రాష్ట్రాలన్నింటా ఇదే పరిస్థితి
- క్యూబ్.. యూఎఫ్‌ఓలవి అధిక ధరలు
- తగ్గించాలని కోరిన నిర్మాతల మండలి
- తిరస్కరించిన ఇరుసంస్థల ప్రతినిధులు



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (మనం సినిమా ప్రతినిధి):

ఒకవైపు సమ్మర్ సీజన్ ముంచుకొస్తోంది. ఈ సీజన్‌లో విద్యార్థులకు సెలవులు ఉంటాయి కాబట్టి బాగా వసూళ్లు వస్తాయని అగ్రహీరోలు సైతం ఎదురు చూస్తుంటారు. కానీ, సరిగ్గా ఈ వేసవి ప్రారంభం సమయానికే సినిమా ప్రదర్శనలు ఆగిపోతున్నాయి. మార్చి రెండో తేదీ నుంచి దక్షిణాది రాష్ట్రాలన్నింటిలో సినిమా ప్రదర్శనలు నిలిచిపోతున్నాయి. క్యూబ్, యూఎఫ్‌ఓ **మిగతా 6లో..**



మార్చి 23న రాజ్యసభ ఎన్నికలు

ఓటింగ్.. లెక్కింపు అదే రోజు

- షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ
- ఏప్రిల్‌లో ఖాళీ అవుతున్న 58 సీట్లు
- ఏపీలో 3.. తెలంగాణలో 3 స్థానాలు
- 5న నోటిఫికేషన్.. 12 వరకు నామినేషన్లు

6 లో..

నగరంలో బయోకాన్ పరిశోధన కేంద్రం



కిరణ్ మజుందార్ షాకు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి కేటీఆర్

జీనోమ్ వ్యాలీలో ఏర్పాటు

కిరణ్ మజుందార్ షాతో కేటీఆర్ భేటీ.. టాస్క్‌తో జట్టుకు జీఈ సిద్ధం

జీఈ, మెర్క్‌లైఫ్, డెలాయిట్.. ప్రతినిధులతో సమావేశం

లైఫ్‌సైన్సెస్‌లో కొత్త ఆవిష్కరణలు ప్రజలకు ఉపయోగపడాలి: మంత్రి

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (మనం ప్రతినిధి):

హైదరాబాద్‌లో జరుగుతున్న బయో ఏషియా సదస్సులో భాగంగా రెండో రోజు శుక్రవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పలువురు ఫార్మా దిగ్గజాలతో సమావేశం అయ్యారు. నోవార్టిస్, బయోకాన్, మెర్క్, డెలాయిట్, జీఈ కంపెనీల సీఈవోలు, సీనియర్ ప్రతినిధులతో సమావేశం అయ్యారు. దీంతోపాటు థాయ్‌ల్యాండ్ వాణిజ్య ఉపమంత్రి, ఇటాలియన్ కాన్సుల్ **మిగతా 6లో..**

టీఆర్టీ నిలిపివేత ఉత్తర్వులివ్వలేం: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 23(మనం లీగల్ ప్రతినిధి): టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్షలు(టీఆర్‌టి) నిలిపివేతకు ఉత్తర్వులు ఇవ్వలేమంటూ హైకోర్టు న్యాయమూర్తి ఎమ్మెస్ రామచంద్రరావు స్పష్టం చేశారు. శనివారం జరగబోయే పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారని, దీనివల్ల పరీక్షల్లో తప్పు ఒప్పులు గుర్తించలేమని, రాత పరీక్షలోనే టీఆర్‌టీ నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ నల్లగొండ జిల్లాకు చెందిన సతీష్‌రావు సహా మరో ముగ్గురు అభ్యర్థులు హైకోర్టులో రిట్ వేశారు. శుక్రవారం దీనిని విచారించిన హైకోర్టు.. ఒక రోజు వ్యవధిలో పరీక్ష జరగుతుందని, ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుందని ముందే ప్రకటించినప్పుడు చివరి సమయంలో కోర్టుకు రావడంలో ఔచిత్యం ఏమిటని పిటిషనర్‌ను ప్రశ్నించింది. రిట్‌ను కొట్టేయాలా లేక విత్‌డ్రా చేసుకుంటారా అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. విత్‌డ్రా చేసుకునేందుకు పిటిషనర్ సమ్మతి తెలపడంతో అందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది.



టీఆర్టీ హాల్‌టికెట్లలో తప్పులపై టీఎస్‌పీఎస్సీ ముందు అభ్యర్థుల ఆందోళన

ఉద్యోగాల భర్తీ చేపట్టండి

- రాష్ట్రంలో 2 లక్షల ఖాళీలు: ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 23(మనం ప్రతినిధి): వివిధ ప్రభుత్వ శాఖలలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను, కేంద్రంలో ఖాళీగా ఉన్న 14 లక్షల ఉద్యోగాలను ప్రభుత్వాలు వెంటనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వాలు నిరుద్యోగులను నిండా ముంచాయని ఆయన విరుచుకుపడ్డారు. శుక్రవారం ఏవీ కళాశాల ప్రాంగణంలో జరిగిన నిరుద్యోగుల సభకు కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర నిరుద్యోగులు జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ అధ్యక్షత వహించిన సభలో కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 15 లక్షల మంది నిరుద్యోగులు నోటిఫికేషన్లకోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. నాలుగేళ్లు కావొస్తున్నా ఏ ఒక్క గ్రూప్స్ నోటిఫికేషన్ సరిగా జారీ చేయలేదని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కొత్త జిల్లాలు ఏర్పడి సంవత్సరం దాటినా ఉద్యోగాల భర్తీ చేపట్టలేదని విమర్శించారు. రాష్ట్ర విభజన తర్వాత అన్ని ప్రభుత్వ ఆఫీసులలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయని కృష్ణయ్య పేర్కొన్నారు. నిరుద్యోగ జేఏసీ నాయకుడు నీల వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలో దాదాపు 54 శాఖలు ఉన్నాయని శాఖల వారీగా సమీక్షలు జరిపి ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

అంధులకు న్యాయం చేయండి

- టీఎస్‌పీఎస్సీకి ముత్తినేని విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 23(మనం ప్రతినిధి): గురుకుల పీజీటీ నియామకాల్లో అంధ విద్యార్థులకు న్యాయం చేయాలని టీపీసీసీ వికలాంగుల సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య టీఎస్‌పీఎస్సీకి విజ్ఞప్తి చేశారు. అంధులకు అన్యాయం చేయాలని ప్రయత్నిస్తే ఆందోళనలు తప్పవని ఆయన హెచ్చరించారు. గురుకుల పీజీటీ గణితంలో చోటుచేసుకున్న అక్రమాలపై టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌తో మాట్లాడేందుకు అంధ విద్యార్థులతో కలిసి వెళ్తే పోలీసులతో గెంటి వేయించటం అమానుషమని ఆయన మండిపడ్డారు. ఐదో జోన్‌కు చెందిన అంధ విద్యార్థులు గాదాసూ అన్నపూర్ణ, కె.సుజాత, మద్దూరి భవానిలతో కలిసి టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను కలిసేందుకు ప్రయత్నిస్తే కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని వాపోయారు. అంధ విద్యార్థుల గణిత ఫలితాలలో ఐదో జోన్‌కు చెందిన విద్యార్థులలో ఒక్క పోస్ట్ కూడా నింపకపోవటం శోచనీయమన్నారు. మూడు పోస్టులు నోటిఫికేషన్లో ప్రకటించి మెయిన్ పరీక్ష అనంతరం కంటి పరీక్షలు నిర్వహించి అర్హులైన అభ్యర్థులు ఐదుగురిలో ఒక్కరిని కూడా ఎంపిక చేయకపోవటం విచారకరమన్నారు. నియామకాల్లో అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆర్టీసీకి వెయ్యి కోట్లు కేటాయిస్తాం: మహేందర్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 23(మనం ప్రతినిధి): ఆర్టీసీ అభివృద్ధికి ఈ బడ్జెట్‌లో వెయ్యి రూపాయలు కేటాయించనున్నట్లు రవాణాశాఖ మంత్రి మహేందర్ రెడ్డి వెల్లడించారు. నల్లగొండ రీజియన్ డిపోల పనితీరు తదితరాలపై మంత్రి శుక్రవారం సమీక్షించారు. డిపోల పరిస్థితి, సాధక బాధకాలను మంత్రి తెలుసుకున్నారు. ఆర్టీసీకి కార్మికులే పట్టుగొమ్మలని, వారు విశ్రాంతి తీసుకునేందుకు అన్ని డిపోలలో మౌలిక సదుపాయలు కల్పిస్తామన్నారు. ఇందుకోసం రూ. 135కోట్లు వెచ్చించనున్నట్లు మంత్రి తెలిపారు. యాదాద్రి డిపోకు 15 ఎకరాల స్థలం, 25 కొత్త బస్సులు కేటాయించామని తెలిపారు. రాష్ట్రంలో రోడ్లు సౌకర్యంలేని 920 గ్రామాలకు త్వరలో రోడ్లు వేయించి బస్సు సదుపాయం కల్పిస్తామన్నారు.

ఆర్టీసీకి రూ. 2000 కోట్లు కేటాయించాలి: సీఐటీయూ


హైదరాబాద్, ఫిబ్రవరి 23(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్‌ఆర్టీసీ)కి రూ. 2000 కోట్లు కేటాయించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈమేరకు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం బస్‌భవన్‌ను ముట్టడించారు. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గత మూడేళ్లుగా బడ్జెట్‌లో ఆర్టీసీకి కేటాయించి, విడుదల చేయలేదని రూ.1216 కోట్లకు, మరో రూ.800 కోట్లు కలిపి ఈ బడ్జెట్‌లో మొత్తం రెండు వేల కోట్లు ఆర్టీసీకి విడుదల చేయాలన్నారు. ఏప్రిల్ 2017 నుంచి 75శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ అమలు చేయాలని వీరు డిమాండ్ చేశారు. 'సకల జనుల సమ్మె' కాలాన్ని 'ఆన్ డ్యూటీ'గా పరిగణించి జీతాలు చెల్లించాలన్నారు. కనీసం జీతం రూ. 23,000గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి వెయ్యి బస్ బాడీల నిర్మాణ సామర్థ్యంతో బస్ బాడీ బిల్డింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.10 లక్షలు వడ్డీ లేని రుణం ఇప్పించాలని కోరారు.

విద్యార్థి సమావేశానికి అనుమతివ్వండి

హైదరాబాద్, ఫిబ్రవరి 23(మనం లీగల్ ప్రతినిధి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ విద్యార్థి సంఘం సమావేశం నిర్వహించుకునేందుకు అనుమతివ్వాలంటూ హైకోర్టు న్యాయమూర్తి ఏవీ శేషసాయి శుక్రవారం పోలీసులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని డీసెంట్ ఫంక్షన్ హాల్లో సమావేశం నిర్వహించుకోవడానికి పోలీసులు అనుమతివ్వడంలేదంటూ సంఘం అధ్యక్షుడు కె.శ్రీనివాస్ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ తర్వాత శాంతిభద్రలకు విఘాతం కలగకుండా సమావేశం జరుపుకోవాలని విద్యార్థి సంఘానికి సూచిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది.

మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌కు బెయిలు

హైదరాబాద్, ఫిబ్రవరి 23(మనం లీగల్ ప్రతినిధి): ఆదివాసీల ఆందోళనకు తెరవెనుక నుంచి మద్దతిచ్చారనే ఆరోపణలు ఎదుర్కొంటూ, పలు పోలీస్ కేసుల్లో నిందితుడిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావుకు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరుచేసింది. రోజూ సంబంధిత పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలనే షరతుతో హైకోర్టు న్యాయమూర్తి టి.రజని శుక్రవారం బెయిల్ మంజూరు చేశారు. ఆయనపై 25 కేసులు నమోదు అయ్యాయి. ఆదివాసీల జాబితానుంచి లంబాడాలను తప్పించాలనే ఉద్యమం దారితప్పడానికి తెర వెనుక ఆయన భరోసా ఉందంటూ పోలీసులు కేసులు నమోదు చేశారు



సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన పోచారం

హైదరాబాద్, ఫిబ్రవరి 23(మనం ప్రతినిధి): విత్తనం వేసిన దగ్గరనుండి, పండించిన పంటను మార్కెట్ లో అమ్ముకునే వరకు రైతు సమన్వయ సమితులు రైతులకు అండగా ఉంటాయని మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతు సమన్వయ సమితి సభ్యుల బాధ్యతలు, విధివిధానాలు వివరించడానికి ఈ నెల 25న హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ మైదానంలో జరగనున్న సదస్సు ఏర్పాట్లను శుక్రవారం మంత్రి పరిశీలించారు. రేపు సాయంత్రానికి పనులు మొత్తం పూర్తి కావాలని సంబందిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పోచారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ సమావేశంలో 14 జిల్లాల, మండల రైతు సమన్వయ సమితుల సభ్యులు, 26న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జరిగే సమావేశంలో 16 జిల్లాల, మండల రైతు సమన్వయ సమితుల సభ్యులు పాల్గొంటారన్నారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు!

రికార్డులకు పరిమితమైన మూడెకరాల భూ పంపిణీ

- దళితులకు అందని ద్రాక్షలా మిగిలిన పథకం
- మూడున్నరేళ్లలో 4,621మందికి భూ కేటాయింపు
- అదిలాబాద్‌లో అత్యధికంగా 649 మందికి...
- రంగారెడ్డి జిల్లాలో అత్యల్పంగా 16 మందికి భూమి
- భూముల కొనుగోలుకు నిధుల కొరత సమస్య
- ప్రతిపక్షాలు, దళిత సంఘాల విమర్శలు



హైదరాబాద్, ఫిబ్రవరి 22(మనం ప్రతినిధి): దళితులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మూడెకరాల భూమి పంపిణీ కార్యక్రమం అరకొరగానే సాగుతుంది. నిధుల లేమి సమస్యతో పథకం రికార్డులకే పరిమితం అయ్యింది. దళితులకు మూడెకరాల భూమి పం పిణీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2014, ఆగస్టులో ప్రారంభించింది. మూడున్నరేళ్లు కావస్తున్నా ఈ పథకం నేటికి దళితులకు అందని ద్రాక్ష లానే ఉంది.

ఇప్పటివరకు 4,621 మందికి..

రాష్ట్రం ప్రభుత్వం ఈ పథకానికి మూడు లక్షల మంది లబ్ధిదారులను గుర్తించింది. మూడున్నరేళ్లలో ఇందులో కేవలం 4,621 మందికి మాత్రమే భూమిని అందజేసింది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఈ పథకం కింద 2014-15లో 774 మంది లబ్ధిదారులకు 2,043.41 ఎకరాలను పంపిణీ చేశారు. ఈ భూముల కొనుగోలుకు రూ.7,492 లక్షలు వెచ్చించారు. 2015-16లో 1,950 మంది అర్హులను ఎంపిక చేశారు. 5,008.19 ఎకరాలను పంపిణీ చేశారు. ఇందు కోసం దాదాపుగా రూ. 21,771లక్షలు ఖర్చు చేశారు. 2016-17లో 954 మందికి 2,559.08 ఎకరాలను పంపిణీ చేశారు. ఇందుకు 11,574లక్షలను ఖర్చు చేశారు. 2017-18లో 943 మందికి 2,298.18 ఎకరాల భూమిని పంపిణీ చేశారు. 10,653.65లక్షలను ప్రభుత్వం వెచ్చింది. పథకం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు కేవలం 4,621 మంది దళితులకు మాత్రమే భూ పంపిణీ జరిగింది. వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన దళితుల్లో ఒక్కరికి భూమి దక్కలేదు. 2016-17లో జగిత్యాల, జనగాం, జోగులాంబ, కరీంనగర్, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్క ఎకరం కూడా పంపిణీ కాలేదు. యాదాద్రి, జగిత్యాల, మహబూబ్‌నగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఒక్క దళితుడికి భూ పంపిణీ చేయలేదు. ఎస్సీల అభివృద్ధి శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సొంత జిల్లా సూర్యాపేటలో 2015-16, 16-17 ఆర్థిక సంవత్సరాల్లో దళితులకు భూ పంపిణీ జరిగిన దాఖలాలు కూడా లేకపోవటం గమనార్హం. 2014-15 నుంచి ఇప్పటి వరకు కరీంనగర్, రంగారెడ్డి, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో కేవలం 50 మందికి లోపు మాత్రమే దళితులకు మూడెకరాల భూ పంపిణీ సాగింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు అదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 649 మందికి భూ పంపిణీ చేయగా, రంగారెడ్డిలో అతి తక్కువగా 16 మందికి మాత్రమే పంపిణీ చేశారు.

భూమి కొనుగోలుకు నిధుల్లేవు..

దళితులకు మూడెకరాల భూపంపిణీకి నిధుల కొరత సమస్యగా మారింది. మిషన్ కాకతీయ, నీటి ప్రాజెక్టుల వల్ల రైతులు సాగుపై దృష్టి సారిస్తున్నారు. భూమిని అమ్మేందుకు ముందుకు రావడం లేదు. ఒక వేళ భూ విక్రయానికి ఎవరైనా ముందుకొచ్చినా ధర చాలా ఎక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం, రంగారెడ్డి వంటి ప్రాంతాల్లో ఎకరం భూమి పది నుంచి రూ.20లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. ఎకరం భూమి కొనుగోలుకు రూ.7లక్షలు వరకు ధర చెల్లించవచ్చని ప్రభుత్వం సూచించింది. భూముల ధరలకు రెక్కలు రావడంతో దళితులకు భూ పంపిణీపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం కనీసం ఎకరానికి రూ.10 లక్షలు వరకు మంజూరు చేస్తే కానీ చాలా జిల్లాల్లో భూమి దొరికే పరిస్థితి కనిపించడం లేదు. 2017-18లో దాదాపు పదివేల ఎకరాలను పంపిణీ చేయాలని ఎస్సీ కార్పొరేషన్ విభాగం లక్ష్యంగా పెట్టుకున్నా కేవలం 943 మందికే పంపిణీ చేయగలిగారు. అయితే భూ పంపిణీ విషయంలో ఎస్సీ కార్పొరేషన్ నత్తతో కూడా పోటీ పడలేక పోతుందని దళిత సంఘాలు విమర్శిస్తున్నాయి. అయితే పంపిణీకి కావాల్సిన భూమిని అధికారులు గుర్తించినప్పటికీ ధర పెరగటంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. సుమారు వెయ్యి ఎకరాల భూమి అధికారులకు ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఈ భూముల కొనుగోలుకు దాదాపు రూ.50 కోట్లు అవసరం అవుతాయి. ఆర్థికశాఖ నుంచి నిధుల విడుదలలో జాప్యం అవుతుండటంతో భూముల ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారులు వాపోతున్నారు.

ప్రతిపక్షాలకు అస్త్రంగా..

దళితులకు మూడెకరాల భూమి విషయం రాష్ట్రంలోని ప్రతిపక్షాలకు అస్త్రంగా మారింది. ఏ సమావేశంలోనైనా ప్రతిపక్ష నేతలు దళితులకు మూడెకరాలు భూ పంపిణీ విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. మరో పక్క దళిత సంఘాలకు కూడా ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పిస్తున్నాయి. కలెక్టరేట్‌ల నిర్మాణానికి అవసరమైన భూములు కొనుగోలుకు ఎంత కావాలంటే అంత ఖర్చు చేస్తున్న ప్రభుత్వం దళితులపై చిన్న చూపు చూస్తోందని ఆరోపిస్తున్నాయి. ఏది ఏమైనా ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రభు త్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ పథకానికి భారీగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

మందుల కంపెనీలో భారీ పేలుడు

జీడిమెట్లలో ఉవ్వెత్తున ఎగిసిపడ్డ మంటలు.. ఏడుగురికి గాయాలు

- నలుగురి పరిస్థితి విషమం: వైద్యులు

హైదరాబాద్/జీడిమెట్ల, ఫిబ్రవరి 23(మనం న్యూస్): జీడిమెట్ల పారిశ్రామిక వాడలో కెమికల్ పరిశ్రమలో శుక్రవారం ఉదయం భారీ శబ్దంతో రియాక్టర్ పేలింది. పేలుడు ధాటికి కంపెనీ ఆవరణలోని రసాయనాలకు నిప్పంటుకోవడంతో మంటలు రేగాయి. పరిశ్రమలో ఉవ్వెత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న కార్మికులు మంటల్లో చిక్కుకున్నారు. ఫ్యాక్టరీలో పేలుడుకు సంబంధించి సమాచారంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. ఐడీఏ జీడిమెట్ల ఎస్‌సి కో-ఆపరేటివ్ సొసైటీలో సెక్యూటిక్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ప్రకాష్‌రాజు పరిశ్రమ నిర్వహిస్తున్నా డు. శుక్రవారం ఉదయం రోజూలాగే కార్మికులు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. అందులో కొంతమంది నైట్ షిఫ్ట్ ముగించు కుని ఇంటికి వెళ్లే ప్రయత్నంలో ఉండగా.. ఒక్కసారిగా భారీ శబ్దంతో రియాక్టర్ పేలింది. ప్రక్కనే ఉన్న కెమికల్ డ్రమ్ములకు నిప్పంటుకుని గాల్లోకి ఎగిరాయి. దీంతో భారీగా మంటలు రేగాయి.



కంపెనీలో భారీగా ఎగిసిపడుతున్న పొగ, కాలిన గాయాలతో బాధితులు

కార్మికులు సింహచలం, కుమారస్వామి, శ్రీనివాస్, సంజీత్‌కుమార్, నరహరి, సత్య, శ్యామ్, హర్విన్ కటారిలు మంటల్లో చిక్కుకున్నారు. పోలీసులు వారిని కొంపల్లిలోని హర్ష ఆస్పత్రికి తరలించారు. బాధితులలో సింహచలం, శ్రీనివాసు, కుమార్‌స్వామి, హర్విన్ కటారిల శరీరాలు 80 శాతం కాలిపోయాయని, వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. గతంలోనూ పలుమార్లు ప్రమాదాలు జరిగినా తగిన భద్రతా ఏర్పాట్లు చేయడంలో యాజమాన్యం విఫలమైందని స్థానికులు విమర్శించారు.

కేయూలో విద్యార్థుల ఘర్షణ

- కొట్టుకున్న ఇంజనీరింగ్-పీహెచ్‌డీ స్టూడెంట్లు
- వర్సిటీని సందర్శించిన ఎమ్మెల్యేలు



విద్యార్థి నేతలతో ఎమ్మెల్యేలు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 23(మనంన్యూస్): పీహెచ్‌డీ ప్రవేశాలలో అవకతవకలు జరిగిన నేపథ్యంలో పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి వెంటనే కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని కాకతీయ యూనివర్సిటీలో పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ ఆందోళనలలో భాగంగా శుక్రవారం వర్సిటీ బంద్‌కు పిలుపునిచ్చాయి. వర్సిటీలో అన్ని విభాగాలను బంద్ చేయిస్తూ.. ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లిన విద్యార్థి నాయకులను అక్కడి విద్యార్థులు అడ్డుకున్నారు. రోజూ బంద్‌లు, ఆందోళనల పేరుతో తరగతులు జరగకుండా అడ్డుకోవడమేంటని నిలదీశారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్యా వాగ్యుద్ధం కొనసాగుతుండగా.. కొంతమంది విద్యార్థులు సంఘాల నేతలపై దాడికి పాల్పడ్డారు. దీంతో కాలేజి విద్యార్థులు, విద్యార్థి నాయకులు పరస్పరం కొట్టుకున్నారు. ఈ సంఘటనలో రాజగోపాల్, రాజు అనే విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన విద్యార్థులను వెంటనే దగ్గరలోని శరణ్య ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం విద్యార్థులు పెద్ద ఎత్తున విశ్వవిద్యాలయాల పరిపాలన భవనాల ముందు ధర్నా, ఆందోళన కార్యక్రమాలు చేయడానికి వీసీ భవనంలోకి చొచ్చుకు వెళ్లడానికి ప్రయత్నించగా అక్కడే ఉన్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, గాయపడిన విద్యార్థులు టీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలు కావడంతో స్థానిక ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, ఆరూరి రమేష్, వికలాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డిలు ఆస్పత్రికి వచ్చి పరామర్శించారు. అనంతరం కేయూ వీసీ, విద్యార్థి సంఘాల నేతలతో మాట్లాడి దాడి వివరాలను తెలుసుకున్నారు.



ఆత్మహత్యచేసుకున్న వృద్ధ దంపతులు

ఖమ్మంలో దంపతుల ఆత్మహత్య

మధిర, ఫిబ్రవరి 23(మనం న్యూస్): భార్యాభర్తల మధ్య చిన్నగా మొదలైన ఘర్షణ చివరకు వారి ప్రాణాలనే హరించింది. రాత్రి పూట ఘర్షణ పడిన దంపతులు తెల్లారి విగతజీవులుగా మారారు. ఖమ్మం జిల్లా మధిర మండల పరిధిలోని వంగవీడు గ్రామానికి ఓబుల వెంకటరామిరెడ్డి(55), పుల్లమ్మ(45) దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు తల్లిదండ్రులతోనే కలసి ఉంటుండగా.. చిన్న కుమారుడు హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం దంపతులు ఘర్షణ పడ్డారని స్థానికులు తెలిపారు. ఇరువురి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్యుద్ధం జరిగిందన్నారు. అయితే, దేని గురించనే విషయం తెలియరాలేదు. ఘర్షణ మరింత పెరగడంతో గురువారం అర్థరాత్రి ఇద్దరూ మందు గుళికలు మింగారు. తెల్లవారిన తరువాత ఎంతసేపటికి నిద్రలేవకపోవడంతో కుమారుడు వెళ్ళి లేపగా ఎంతసేపటికీ లేవకపోవడంతో పరీక్షించి చూడగా అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. స్థానికుల సాయంతో విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నాగంకు స్వాగతం: చిన్నారెడ్డి

- బలమైన నేతలు ఎవరు వచ్చినా స్వాగతించాల్సిందే
- ఆయన గెలిచే అవకాశంలేదన్న దామోదర్ రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 23(మనం ప్రతినిధి): మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్న వార్తను కాంగ్రెస్ ఎంఎల్‌ఏ చిన్నారెడ్డి స్వాగతించారు. శుక్రవారం సీఎల్పీలో విలేకరులతో ఇష్టాగోష్టిలో పాల్గొన్న చిన్నారెడ్డి .. మహబూబ్‌నగర్ జిల్లాలో నాగం చాలా బలమైన నేత అని, ఆయన చేరికతో కాంగ్రెస్ మరింత బలపడుతుందని చిన్నారెడ్డి విశ్వాసం వ్యక్తంచేశారు. రాష్ట్ర స్థాయిలో నాగం ప్రభావం ఉంటుందని, నాగం వంటి బలమైన నేతలు ఎవరు వచ్చినా స్వాగతించాల్సిందేన న్నారు. నాగం, జైపాల్ రెడ్డిలపై ఎంఎల్‌సీ దామోదర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను చిన్నారెడ్డి ఖండించారు. దామోదర్ గెలుపు కోసం నాగం పనిచేశారన్న విషయం ఆయన గుర్తుంచుకోవాలన్నారు. పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని చిన్నారెడ్డి అన్నారు.

రావులకోసం సీటు వదులుకుంటా !

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత రావుల చంద్రశేఖర్ రెడ్డిని కూడా తమ పార్టీలో చేరమని ఆహ్వానిస్తున్నట్టు చిన్నారెడ్డి చెప్ప డం విశేషం. రాజకీయంగా తనకు ప్రత్యర్థి అయినా.. తనకంటే రావుల బలమైన అభ్యర్థని పార్టీ భావిస్తే తన సీటు వదులుకోవడానికి కూడా సిద్ధమని చిన్నారెడ్డి ఆసక్తికరమైన ప్రకటన చేశారు.

వాళ్లే వ్యతిరేకిస్తున్నారు

చిన్నారెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడిన ఎంఎల్‌ఏ వంశీచందర్ రెడ్డి.. పార్టీలు మారి ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నవారే చేరికలను వ్యతిరేకిస్తున్నారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌లోనే పుట్టి పెరిగిన నాయకులు ఎవరూ కొత్తవారి చేరికలను వ్యతిరేకించరని వంశీ అన్నారు.

నాగం కోసం ఉత్తమ్‌పై జైపాల్ ఒత్తిడి?

మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డిపై మరోమారు ఎంఎల్‌సీ దామోదర్ రెడ్డి విరుచుకుపడ్డారు. మహబూబ్ నగర్ కాంగ్రెస్‌లో వివాదానికి కేంద్రబిందువు జైపాలేనని ఆయన ఆరోపించారు. జైపాల్‌కు నాగం శిష్యుడని, గతంలో నాగంను గెలిపించేందుకు జైపాల్ పనిచేశారన్నారు. ఎంఎల్‌ఏ డీకే అరుణను జైపాల్ రెడ్డి టార్గెట్ చేశారని, కానీ జిల్లాలో పార్టీని బతికించింది మాత్రం అరుణనే న ని ఆయన వాదించారు. పైపెచ్చు ప్రస్తుత పరిస్థితుల్లో నాగం కాంగ్రెస్‌లో చేరినా గెలిచే అవకాశాలులేవని, ఆయనను కార్యకర్తలు పట్టించుకోరన్నారు. మంత్రిగా పనిచేసిన సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలను ఆయన హింసించారన్న దామోదర్, వచ్చే ఎన్నికల్లో తన కొడుకును బరిలోకి దించనున్నట్టు వెల్లడించారు. నాగంను పార్టీలో చేర్చుకోవాలంటూ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డిపై జైపాల్ రెడ్డి ఒత్తిడి తెస్తున్నారన్న అనుమానాన్ని దామోదర్ వెలిబుచ్చారు.

మోదీజీ.. నల్లడబ్బు ఏమైంది?: వీహెచ్

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (మనం ప్రతినిధి) : విదేశాల్లో ఉన్న నల్లడబ్బును తీసుకొస్తాను, ఇండియాలో ఉన్న నల్లడబ్బును వెలికితీస్తానంటూ ప్రధాని మోడీ చెప్పిన గొప్పలు నీటిమీద రాతల్లాగే మారాయని కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు విమర్శించారు. గాంధీభవన్లో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. విదేశాల్లో ఉన్న నల్లడబ్బును వెనక్కి తీసుకువస్తానన్న మోదీ ఆ పని చేయలేదని, చివరకు దేశంలో బ్యాంకుల్లో పేదలు దాచుకున్న డబ్బును కొందరు దోచుకునేలా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. నీరవ్ మోదీ విదేశాలకు ఎలా వెళ్లారో చిన్నపిల్లాడిని అడిగిన తెలుస్తుందన్నారు. కేంద్రంలోని పెద్దల సాయం లేకుండానే ఆయన విదేశాలకు వెళ్లాడా? అని ప్రశ్నించారు.

కాళేశ్వరం అద్భుతం

● ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్సీల బృందం







కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో ఎమ్మెల్సీల బృందం

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (మనం ప్రతినిధి): తెలంగాణకే మణిహారంగా నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను మండలి సభ్యులు బృందం శుక్రవారం సందర్శించింది. మండలి చైర్మన్ కె.స్వామిగౌడ్ నేతృత్వంలో సభ్యులు కాళేశ్వరం పనులను సందర్శించారు. పనులు జరుగుతున్న తీరును చూసి వారు ఆశ్చర్య పోయారు. కాళేశ్వరం అద్భుతమని ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు కొనియాడారు. కాగా, కాళేశ్వరం పర్యటనకు వెళ్తున్న ఎమ్మెల్సీల బృందానికి భూపాలపల్లిలో స్పీకర్ మధుసూదనాచారి స్వాగతం పలికారు. అక్కడే ఉన్న అంబేద్కర్, జయశంకర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. అనంతరం వేశాలపల్లిలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను పరిశీలించిన బృందం.. ఇళ్ల నిర్మాణ సాంకేతికతపై సభ్యులు ఆరా తీసినట్లు తెలిపారు. అయితే, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలపై పలువురు ఎమ్మెల్సీలు సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, ఈ ఎమ్మెల్సీల బృందంలో డిప్యూటీ సీఎం మహమ్మద్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సీఎన్ రామచందర్‌రావు తదితరులు ఉన్నారు.



ఉర్దూ మీడియం పుస్తకాలను విడుదల చేస్తున్న మంత్రి కడియం

ఉర్దూకు అధిక ప్రాధాన్యం: కడియం

హైదరాబాద్, ఫిబ్రవరి 23(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ భాషకు అధిక ప్రాధాన్యమిస్తోందని డిప్యూటీ సీఎం, కడియం శ్రీహరి పేర్కొన్నారు. బీఏ రెండో సంవత్సరం హిస్టరీ సబ్జెక్టు ఉర్దూ మీడియం పుస్తకాలను డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి శుక్రవారం విడుదల చేశారు. నాంపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ సమీనా బషీర్ ఈ పుస్తకాన్ని రచించారు. గత ఏడాది బీఏ హిస్టరీ మొదటి సంవత్సరం పుస్తకాలను విడుదలచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాలని డిప్యూటీ సీఎం కడియం ఆకాంక్షించారు. పుస్తక రచయితను, ఆయన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.



అటవీశాఖ అధికారులతో ప్రియాంక వర్గీస్, పీకే ఝాల వీడియో కాన్ఫరెన్స్

అన్ని పట్టణాల్లో అర్బన్ పార్కులు


● అటవీ శాఖ ఉన్నతాధికారుల వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 23(మనం ప్రతినిధి): హైదరాబాద్ సహా రాష్ట్రంలోని 194 పట్టణ ప్రాంతాలకు సమీపంలోని అటవీ బ్లాకులలో తప్పని సరిగా అర్బన్ పార్కుల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని హరితహారం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, అటవీ శాఖ పీసీసీఎఫ్ పీకే ఝా తెలిపారు. సచివాలయంలో శుక్రవారం అన్ని జిల్లాల అటవీ అధికారులతో వారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హరితహారంలో నాటిన మొక్కలు, తీసుకున్న రక్షణ చర్యలు, బతికిన మొక్కల శాతంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వర్గీస్, ఝా మాట్లాడుతూ వేసవిలో మొక్కలకు తప్పనిసరిగా నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. స్కూల్స్, వివిధ సంస్థల ఆవరణలో నాటిన మొక్కలు వంద శాతం బతకాలని సీఎం సూచించారు. ఈ నెల 24, 25 తేదీల్లో అటవీ ప్రాంతంలో నీటి వసతులపై వలంటీర్ల సహకారంతో సర్వే చేపట్టాలని సూచించారు. వేసవిలో వన్యప్రాణులకు నీటి ఎద్దడిలేకుండా చర్యలు తీసుకోవాలని, వాటర్ పిట్‌లు, చెక్ డ్యామ్, వాచ్ టవర్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే హరితహారంకోసం నర్సరీల సంసిద్ధతపై చర్చించారు.

అనుకూలమే అయితే ఆలస్యమెందుకు?

● ఎస్సీ వర్గీకరణపై కేంద్రానికి సూటి ప్రశ్న

● ఎంఆర్పీఎస్ బంద్‌కు మద్దతిస్తాం: చాడ



హైదరాబాద్, ఫిబ్రవరి 23(మనం ప్రతినిధి): సామాజిక న్యాయం, సబ్‌ప్లాన్లు, హామీల అమలులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. శుక్రవారం ఇక్కడి పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ నేతలు నాగమల్లేష్, పల్లా వెంకటరెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం మార్చి 13న ఎంఆర్పీఎస్‌తలపెట్టిన బంద్‌లో సీపీఐ కూడా పాల్గొంటుందని తెలిపారు. 24 ఏండ్లుగా జరుగుతున్న వర్గీకరణ ఉద్యమంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయినా పాలకులు పట్టించుకోవడంలేదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ సహా అన్ని పార్టీలూ వర్గీకరణకు అనుకూలమని ప్రకటించిన విషయాన్ని చాడ గుర్తుచేశారు. అయినప్పటికీ బిల్లు తేవడంలో నిర్లక్ష్యమెందుకని ప్రశ్నించారు. అసెంబ్లీలో తీర్మానంచేసి కేసీఆర్ చేతులు దులుపుకున్నట్టు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. వర్గీకరణ బిల్లు కోసం తమ పార్టీ నేత డి రాజా జాతీయ స్థాయిలో పార్టీలను సమన్వయం చేస్తున్నారని వెల్లడించారు. రైతు సమన్వయ సమితులపై స్పందిస్తూ.. అవి టీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకుల సమితులని ఎద్దేవా చేశారు. సమితి పేరుతో క్యాబినెట్, ఇతరత్ర హోదాలు టీఆర్ఎస్ నేతలకు కట్టబెట్టి ప్రజాధనాన్ని వృథా చేయడం తప్ప అన్నదాతలకు ఒరిగేదేమీ ఉండదన్నారు. చిత్తశుద్ధి ఉంటే రుణమాఫీ పూర్తిచేయలన్నారు. మొత్తంగా కేసీఆర్ ప్రభుత్వ విధానం 'పనుల్లో మొద్దునిద్ర.. ప్రచారంలో ముందుంట' అన్న చందంగా తయారైందన్నారు. వర్గీకరణ బంద్‌కు మద్దతు ఇవ్వాల్సిందిగాకోరుతూ మంద కృష్ణమాదిగ శుక్రవారం చాడను కలిశారు.

సింగరేణి ప్రైవేటీకరణకు కుట్ర: టీఎన్‌టీయూసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 23(మనం ప్రతినిధి): బొగ్గు గనుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం విరమించుకోవాలని టీడీపీ అనుబంధ తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్(టీఎన్‌టీయూసీ) అధ్యక్షుడు బి.ఎన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 130 ఏండ్ల చరిత్ర కలిగిన సింగరేణి ఇప్పటి వరకూ 1310 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయగా, మరో 10,846 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు సంస్థ పరిధిలో ఉన్నాయన్నారు. అలాంటి సంస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికే తాడిచర్ల-1,2 బొగ్గు గనులను కేసీఆర్ ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారని విమర్శించారు. ఓపెన్ కాస్ట్ గనులతో ఉత్తర తెలంగాణ జిల్లాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయన్నారు. అధికారంలోకి రాగానే ఓపెన్ కాస్ట్‌లను బంద్‌జేసి భూగర్భ గనులను ప్రారంభిస్తామని హామీనిచ్చిన కేసీఆర్, అధికారంలోకొచ్చి నాలుగేండ్లవుతున్నా ఆ ఊసెత్తడంలేదని విమర్శించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మంది ఆధారపడ్డ సంస్థను, తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రైవేటీకరించే యోచనను ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలన్నారు.


పేపర్ మిల్లును తెరిపించరూ!

పాలేరులో పరిశ్రమ ప్రారంభమైతే నిరుద్యోగులకు మేలు.. సీఎం కేసీఆర్ దృష్టి సారించాలని స్థానికుల వినతి

ఖమ్మం/కూసుమంచి, ఫిబ్రవరి 23 (మనం బ్యూరో): ఎన్నో పోరాటాల తర్వాత ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఎన్నో పరిశ్రమలకు ఊతమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం 1998లో మూతపడిన పాలేరు పేపర్ బోర్డు పరిశ్రమపై దృష్టి సారించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. ఈ పరిశ్రమ పునః ప్రారంభమైనా, ఈ స్థలంలో కొత్త పరిశ్రమ ఏర్పాటు చేసినా పెద్ద సంఖ్యలో ప్రజలకు ఉపాధి దొరుకుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. 1979లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పలువురు ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్ గూడెంలోని ఆర్ అండ్ బీ విశ్రాంతి గృహానికి వెనుకపేపర్ పరిశ్రమ ఏర్పాటుకు సంకల్పించింది. పరిశ్రమ కోసం స్థానికుల నుంచి సుమారు 69 ఎకరాల భూమిని సేకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని డెల్టా పేపర్ మిల్లుకు చెందిన డైరెక్టర్లు విజయరామరాజు, సాగి రామకృష్ణంరాజు, నరసింహారాజు, వి.కృష్ణమోహన్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన శర్మ కూడిన బోర్డు డైరెక్టర్ల వాటా ధనం రూ.49 లక్షలు, ఏపీఐడీసీ వాటా ధనం 5 కోట్ల 51 లక్షల రూపాయలతో తెలంగాణ పేపరు మిల్లు నిర్మాణానికి నాటి ఐడీసీ చైర్మన్ యడ్లపాటి వెంకట్రావు శంకుస్థాపన చేశారు. మేనేజింగ్ డైరెక్టర్ వీ.కృష్ణమోహన్ నేతృత్వంలో పనులు మొదలుపెట్టారు. కొన్ని యంత్రాలను అమెరికా నుంచి దిగుమతి చేసుకోగా, కొన్నింటిని స్థానికంగా కొనుగోలు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి సూచనల మేరకు ఎఫ్లూయెంట్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. రోజుకు 30 టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో 1982లో కర్మాగారం ప్రారంభమయ్యింది. కొంతకాలం సజావుగా నడిచిన కర్మాగారానికి 1985లో లాకౌట్ ప్రకటించారు. ఏడాది అనంతరం ఓ సిమెంట్ సంస్థ యాజమాన్యం కర్మాగారాన్ని కొనుగోలు చేసింది. రాశీ గ్రూప్‌కు చెందిన వ్యక్తులు అధికారులుగా నియమించబడ్డారు. ఓ బ్యాంకు నుంచి రూ.2 కోట్ల రుణం తీసుకుని కొద్ది మార్పులతో 50 టన్ను లక్ష్యంగా ఉత్పత్తిని ప్రారంభించారు. నెలకు 1500 టన్నుల ఉత్పత్తి లక్ష్యం కాగా సరాసరి 1200 నుండి 1350 టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి సంస్థ చేరుకుంది. అయితే 1988లో తిరిగి లాకౌట్ ప్రకటించింది. కార్మికుల ఆందోళన ఫలితంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఇండస్ట్రియల్ ఫైనాన్షియల్ రీకన్‌స్ట్రక్షన్ బోర్డు రంగంలోకి దిగింది. బీఐఎఫ్ఆర్ సిఫార్సుల మేరకు తిరిగి ఐడీబీ 2 కోట్ల రుణాలు మంజూరు చేయడంతో సరిగ్గా ఏడాది అనంతరం 1989 మార్చి 11 న పరిశ్రమ పునఃప్రారంభమయ్యింది. 1992లో మరోమారు లాకౌట్ అయింది. 1995లో కర్మాగారం తిరిగి ప్రారంభమయ్యింది. యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలు వికటించడంతో పరిశ్రమ నష్టాల బాట పట్టింది. ఈ క్రమంలో ఇండియా సిమెంట్స్ సంస్థ రాశీ సంస్థలను టేకోవర్ చేయడంతో పేపర్ పరిశ్రమ వారి ఆధీనంలోకి వెళ్ళింది. కొంతకాలానికి సంస్థను విక్రయించాలని యజమాని నిర్ణయించారు. కొందరు పై స్థాయి ఉద్యోగులు తమ స్వలాభం కోసం చేసిన పనులే ఇందుకు కారణమని ఆరోపణలు ఉన్నాయి.

రాజమండ్రి సమీపంలోని ఓ మినీ పేపరు మిల్లు యజమానులకు సుమారు 10 కోట్ల రూపాయల విలువ చేసే కర్మాగారాన్ని రూ.3 కోట్ల 25 లక్షలకు విక్రయించారు. అనంతరం 1998లో పేపర్ మిల్లు శాశ్వతంగా మూతపడింది. ఆ సమయంలో దాదాపు 400 మంది కార్మికులు రోడ్డున పడ్డారు. సంస్థలో ఇంత జరుగుతున్నా రుణాలు ఇచ్చిన బ్యాంకులు కానీ, ఏపీఐడీసీ గానీ ఏ విషయంలోని అభ్యంతరం చెప్పలేదు. పరిశ్రమను కొనుగోలు చేసిన సంస్థ లోపలి యంత్రాలను రాజమండ్రికి తరలించేందుకు యత్నించగా అప్పట్లో కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. తెలంగాణా రాష్ట్ర సమితి నాయకుడు కొవ్వూరి వెంకటరెడ్డి నాయకత్వంలో ఈ ఆందోళన జరిగింది. అయితే పోలీసు బందోబస్తు మధ్య యాజమాన్యం యంత్రాలను తరలించేసింది. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నాడు ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఉన్న కేసీఆర్‌కు కార్మికులు సమాచారం ఇచ్చారు. కొన్నాళ్లకు ఓ ప్రజాప్రతినిధి పేపరు మిల్లును కొనుగోలు చేశారు. మళ్లీ పరిశ్రమ ఏర్పాటవుతుందని అందరూ భావించారు. అయితే ఆయన ఆ భవనాలను కూల్చి పాత ఇనుమును, విడి భాగాలను విక్రయించి, ఆ ప్రాంతాన్ని వేరే వారికి విక్రయించారు. ప్రస్తుతం ఉమ్మడి రాష్ట్రం నుంచి విడిపోయి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. ప్రభుత్వం మారింది. పరిశ్రమల స్థాపనకు పెద్ద పీట వేస్తున్న ప్రస్తుత ప్రభుత్వం ఈ కాగితం పరిశ్రమపై దృష్టి సారిస్తే ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కూసుమంచి మండలంలో పరిశ్రమ లేని లోటు తీర్చేందుకు రాష్ట్ర మంత్రి, స్థానిక శాసనసభ్యుడు తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని స్థానికులు కోరుతున్నారు.







భారీగా ఐపీఎస్‌ల బదిలీలు?

● 45 మందికి స్థానచలనం తప్పదు

● ఎన్నికల సంసిద్ధతలో భాగమే

● ముందుగానే పక్కాగా స్కెచ్

● విధేయులపై ప్రభుత్వం ఆరా

● తాజా, మాజీ డీజీపీల జాబితాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 23(మనం ప్రతినిధి): రాష్ట్రంలో ఐపీఎస్‌ల బదిలీలకు రంగం సిద్ధమైందా.. అంటే అవుననే విశ్వసనీయ వర్గాలు వెల్లడిస్తున్నాయి. త్వరలో భారీ స్థాయిలో అధికారులకు స్థానచలనం తప్పదని పేర్కొంటున్నాయి. వచ్చేది ఎన్నికల సంవత్సరం కావడంతో ఈ మార్పులు చోటుచేసుకోనున్నట్లు సమాచారం. ఎన్నికల సంసిద్ధతలో భాగంగా అధికార పార్టీకి అనుకూలంగా ఉండే ఐపీఎస్ అధికారులకు సంబంధించి ప్రభుత్వం ఆరా తీసినట్లు సమాచారం. ముందస్తుకు వెళ్లడమా.. మానడమా అన్న యోచనలో ఉన్న ప్రభుత్వం ఎన్నికల కోసం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఐపీఎస్ అధికారుల బదిలీ ప్రక్రియ చేపట్టనుంది. సుమారు 45 మంది ఐపీఎస్‌లకు స్థానచలనం తప్పదని అధికార వర్గాల్లో వినిపిస్తోంది. పోలీస్ శాఖలో డీజీపీ మహేందర్ రెడ్డితో పాటు రిటైర్డ్ డీజీపీ, ప్రభుత్వ సలహాదారులు అనురాగ్ శర్మ సలహాలను సీఎం పరిగణలోకి తీసుకుంటున్నారని తెల్సింది. బదీలుచేసే అధికారులకు సంబంధించి ఈ ఇద్దరు చెరో జాబితా ఇచ్చినట్లు సమాచారం. నెలరోజుల ముందే బదిలీలు కావాల్సి ఉండగా ప్రమోషన్స్, సెంట్రల్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లాల్సిన అధికారుల వివరాలతో అలస్యం అయింది. తాజాగా ఇంటిలిజెన్స్ విభాగం నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి అందజేసింది.

రాష్ట్ర కేడర్‌కు చెందిన ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులు కేంద్ర సర్వీసుల నుంచి తిరిగి రిపోర్టు చేశారు. వీరికి కీలక బాధ్యతలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం పోలీస్ శాఖలో శాంతి భద్రతల ఐజీ పోస్టు ఖాళీగా ఉంది. సైబరాబాద్ కమిషనర్ సందీప్ శాండిల్యా సైతం బదిలీ కాబోతున్నట్టు తెలుస్తోంది. ఈ స్థానంలో మహిళా ఐపీఎస్ అధికారి ఒకరికి అవకాశం కల్పించే యోచన ఉన్నట్టు వినికిడి. వరంగల్ కమిషనర్ సుధీర్ బాబు రెండేళ్లు పూర్తి చేయడంతో అక్కడ మరో డీఐజీ స్థాయి అధికారిని నియమించే అవకాశం ఉంది. అదిలాబాద్ అదివాసుల ఘర్షనతో డిఐజీ రవివర్మ, ఎస్పీ శ్రీనివాస్‌లకు పోస్టింగ్ ఇవ్వలేదు. వీరితో పాటు డిప్యూటేషన్‌పై వెళ్లిన సివి అనంద్, చారుసిన్హా పోస్ట్‌ను భర్తీ చేయాల్సి ఉంది. ఫైర్ విభాగం డైరెక్టర్ జనరల్ రాజీవ్ రతన్, జైళ్ల శాఖ డీజీ వీకే సింగ్లకు స్థాన చలనం ఉండనున్నట్టు తెలుస్తోంది. సంతోశ్ మెహ్రాను జైళ్ల శాఖ డీజీగా, వీకేసింగ్‌ను ఫైర్ విభాగం, రాజీవ్ రతన్‌ను ఆపరేషన్స్ లేదా ఆర్గనైజేషన్‌కు మార్చే అవకాశాలున్నట్టు సమాచారం.

వర్మ కేసు విచారణ వాయిదా



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (మనం ప్రతినిధి): 'జీఎస్టీ' దర్శకుడు రాం గోపాల్ వర్మపై సామాజిక కార్యకర్త దేవి దాఖలు చేసిన కేసు విచారణ వాయిదా పడింది. ఈ కేసులో గత శనివారం సీసీఎస్ పోలీసులు సుమారు 3 గంటలపైగా రాంగోపాల్‌వర్మను విచారించిన విషయం విదితమే. తదుపరి విచారణ శుక్రవారం జరగాల్సి ఉంది. అయితే..వర్మకు సంబంధించిన ల్యాప్‌ట్యాప్, సెల్‌ఫోన్లకు సంబంధించి ఫోరెన్సిక్ నివేదిక ఇంకా రావాల్సి ఉంది. దాంతో శుక్రవారం నాటి విచారణను సీసీఎస్ పోలీసులు వాయిదా వేశారు. కాగా, వచ్చే నెల 10 లోపు వర్మను ఈ కేసులో విచారణకు పిలింపించే అవకాశముందని అధికారులు తెలిపారు.

కిడ్నీ విభాగంలో 'గాంధీ' ప్రత్యేక చరిత్ర

● సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (మనం ప్రతినిధి): హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో కిడ్నీ విభాగం ఆవర్భవించి 25 ఏళ్లు పూర్తైన సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో 40 సింగల్ యూజ్ డయాలసిస్ కేంద్రాలను నెలకొల్పినట్టు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైద్య ఆరోగ్య శాఖామంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా గాంధీ ఆసుపత్రిలో కూడా 20 డయాలసిస్ యంత్రాలు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. కిడ్నీ మార్పిడులను విజయవంతంగా చేసిన ఘనత కూడా గాంధీ ఆసుపత్రి వైద్యులకే దక్కుతుందన్న లక్ష్మా రెడ్డి, ఇక్కడి కిడ్నీ విభాగం అధిపతి డాక్టర్ మంజూష, ఆమె బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

మోడల్ ఆసుపత్రిగా..

గాంధీ ఆసుపత్రిని ఓ మోడల్ ఆసుపత్రిలా రూపొందించేందుకు గుండె, కాలేయం, లివర్ వంటి అవయవ మార్పిడి కోసం ప్రత్యేక ఆపరేషన్ థియేటర్లు అభివృద్ధి చేస్తున్నట్టు లక్ష్మారెడ్డి వెల్లడించారు. అన్ని వ్యాధుల నిర్ధారణ సదుపాయాలున్న ఈ ఆసుపత్రిలో ఫర్టిలిటీ సెంటర్ కూడా ఉందని గుర్తు చేసిన లక్ష్మారెడ్డి, కిడ్నీ విభాగం రూపొందించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ వెబ్‌సైట్లో తమ వద్దకు వచ్చే రోగుల వివరాలు, వారికి అందిస్తున్న చికిత్సలకు సంబంధించిన వివరాలు పొందుపరుస్తున్నారు. దీంతో పాటు కిడ్నీ విభాగం ప్రారంభమైన 1993, ఫిబ్రవరి 23వ తేదీ నుంచి నేటి వరకూ 25 ఏళ్ల ఫోటోలతో కూడిన ఫోటో సావనీర్‌ను కూడా లక్ష్మా రెడ్డి ఆవిష్కరించారు. మూత్రపిండాల వ్యాధులపై విశేష కృషి చేసిన వారిని ప్రత్యేక అవార్డులతో సన్మానించారు. కిడ్నీ వ్యాధుల నివారణకు విశేష కృషి చేసిన వారికి ప్రోత్సాహక అవార్డులు అందచేసే లక్ష్యంతో గాంధీ పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన మూలనిధి రూ.1.5 లక్షలని మంత్రి చేతుల మీదుగా గాంధీ సూపరింటెండెంట్‌కి అందచేశారు. ఈ కార్యక్రమానికి లండన్ నుంచి వచ్చిన ప్రత్యేక నిపుణుల బృందం, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కిడ్నీ నిపుణులు, గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మంజుల హాజరయ్యారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
శనివారం, ఫిబ్రవరి 24

చైతన్యమే పరిష్కారం

అవినీతిని దేశం నుంచి తరిమేస్తామంటూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భీషణ ప్రతిజ్ఞలు చేస్తున్నప్పటికీ అవినీతిని తరిమేయడం కాదుకదా, కనీసం తగ్గించడంలో కూడా నరేంద్ర మోదీ ప్రభుత్వం విజయం సాధించలేకపోయింది. గత ఆరేళ్లుగా ప్రపంచదేశాల్లో అవినీతిని గణించి ర్యాంకులిస్తున్న ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ ఈ ఏడాది భారత్‌కు 81వ ర్యాంకు ఇచ్చింది. మొత్తం 180 దేశాలకు అవినీతిపై ఈ సంస్థ సున్నా నుంచి నూరు మార్కులు ఇస్తుంది. ఇలా 87 మార్కులతో న్యూజిలాండ్ స్వచ్ఛమైన దేశంగా నిలవగా రెండోస్థానాన్ని సింగపూర్ 84 మార్కులతో ఆక్రమించింది. 2016తో పోల్చితే భారత్ 2017లో రెండు స్థానాలు దిగజారింది. 176 దేశాల గణనలో 2016లో 79వ స్థానం నుంచి భారత్ ఈసారి 2017లో 81వ స్థానంలో నిలిచి రెండుస్థానాలకు ఎగబాకింది. అవినీతిలో సోమాలియా కేవలం 9 మార్కులు సాధించి అక్రమాల నియంత్రణలో చిట్టచివరి స్థానాన్ని పొందింది. ఈ సంస్థ ప్రకటించిన జాబితాలో పాకిస్థాన్ 32 మార్కులతో 117వ స్థానంలో నిలిచింది. బంగ్లాదేశ్ 28 మార్కులతో 143వ స్థానం పొందింది. మనదేశం సహా అనేక ప్రపంచదేశాల్లో అవినీతి, పత్రికాస్వేచ్ఛ నేతి బీరకాయ చందంగా ఉందని, గత ఆరేళ్లలో ఆసియా దేశాల్లో అవినీతి కార్యకలాపాలను వెలికితీసేందుకు ప్రయత్నించిన 15 మంది జర్నలిస్టులు హత్యకు గురవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. అమెరికాలో కూడా తనను వ్యతిరేకించే పత్రికలను అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దాదాపు బ్లాక్‌లిస్టులో పెట్టారు. తాను నిర్వహించే పత్రికా సమావేశాలకు వాషింగ్టన్ పోస్టు, సీఎన్ఎన్‌లను ఆహ్వానించవద్దని, వచ్చినా ఆయా ప్రతినిధులను నిరోధించాలని ట్రంప్ బహిరంగంగా ఆదేశించారు. ప్రభుత్వోద్యోగుల్లో అవినీతి పెరిగిపోయిందనడానికి సాక్ష్యంగా దేశంలో ఏదో ఒకచోట ప్రభుత్వాధికారులపై ఏసీబీ, సీబీఐ దాడుల్లో వందల కోట్ల రూపాయల అవినీతి సొమ్ము బయటపడుతోంది. ఒక్కొక్క అధికారి బంధువులు, బినామీల ఇళ్లపై ఏసీబీ చేసే దాడుల్లో బయటపడుతున్న అక్రమాస్తుల చిట్టాచూస్తుంటే కళ్లు తిరుగుతున్నాయి. అడిగినంత వాటా ఇస్తే పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలు సంతకం పెట్టమన్నచోటల్లా సంతకాలు పెట్టే ప్రబుద్ధులు ఉన్నారని ఇటీవల జరిగిన బ్యాంకు స్కాంలు రుజువుచేస్తున్నాయి. నగల వ్యాపారి నీరవ్ మోదీ, లిక్కర్ కింగ్ విజయ మాల్యా ఉదంతాలు చూస్తుంటే అవినీతిని అంతం చేయడం అంత తేలిక కాదని స్పష్టమవుతోంది.

అవినీతిని అంతం చేయడం ఎన్నికల సమయంలో వాగ్దానం చేసినంత సులువు కాదు. దశాబ్దాల తరబడి సమాజంలో పేరుకుపోయిన ఈ జాడ్యం దుమ్ముదులపాలంటే ప్రజల్లో చైతన్యం తీసుకురావడమొక్కటే మార్గం. లంచం అడిగిన వ్యక్తిని నిలదీసేరోజు వచ్చినప్పుడే ఈ మురికిని సమాజం నుంచి ఉతికి పారేయగలం. అంతేగానీ, ఎన్నిచట్టాలు చేసినా చట్టం చట్టమే, అవినీతి, అక్రమాలు అక్రమాలే అన్నట్టు ఉంటుంది పరిస్థితి. స్వాతంత్రోద్యమ స్ఫూర్తి కొనసాగినంత కాలం సమాజంలో అవినీతిపరులంటే చిన్నచూపు కొనసాగేది. అయితే సమాజంలో విద్వత్తు, త్యాగ సంప్రదాయాల ఆధారిత విలువల వ్యవస్థ స్థానంలో డబ్బు ఆధారిత విలువల వ్యవస్థ ఏర్పడుతున్న క్రమంలో అవినీతిపరులు డబ్బు సంపాదనలో సమర్థులుగా పరిగణించే స్థితి ఏర్పడింది. 1990ల తర్వాత ప్రపంచీకరణ ప్రారంభమైన నాటి నుంచి దేశంలో ఉనికిలోకి వచ్చిన సక్రమ, అక్రమంగా సాగిన భారీ ద్రవ్య లావాదేవీల నేపథ్యంలో డబ్బు సంస్కృతికి ఉపఫలంగా వ్యవస్థీకృతమైన అవినీతి సంస్కృతి సమాజంలో విశ్వరూపం దాల్చి మరింతగా ఘనీభవించింది. సామాజిక అవినీతి తొలుత అలవాటు నుంచి వ్యసనంగా మారి, నేడు ఉన్మాదస్థాయికి చేరింది.

చట్టం బాహువులు దీర్ఘమైనవని చెప్పుకోవడానికి బాగానే ఉంటుంది కానీ, ఆచరణలో సామాజిక- ఆర్థిక విధాన స్వభావానికి అనుగుణంగానే ఆ బాహువులు రూపొందుతాయి. అవినీతి ఉనికిలో ఉన్న వ్యవస్థ తాలూకు లక్షణమే గానీ, దానికదే వ్యక్తుల్లో తలెత్తిన చెడు సంస్కృతిగా అర్థం చేసుకుంటే త(ప)ప్పులో కాలేసినట్లే. నగల వ్యాపారి నీరవ్ మోదీ స్కాం గత ఏడేళ్లుగా నిరాటంకంగా కొనసాగడానికి కారణం బ్యాంకింగ్ రంగంలో అమలులోని ద్రవ్య విధానంలోని లొసుగులు కాక మరేమిటి? నీరవ్ మోదీ, విజయమాల్యా పైకి కనిపించే మొనలు మాత్రమే. పైకి కనపడని అవినీతి మహాపర్వతాలు ఎన్నో ఆర్థిక విధాన చట్టబద్ధత పరిధిలో సజావుగా కొనసాగుతూనే ఉన్నాయి. అవినీతిని అరికట్టడమన్నది ప్రత్యేక ప్రక్షాళన కార్యక్రమం కాదు. అది ద్రవ్య కేంద్రిత ఆర్థిక విధానం ప్రజల కేంద్రిత ఆర్థికవిధానం ఏర్పడే క్రమంలోనే అవినీతి క్రమంగా ఉపశమిస్తుంది. ఆర్థిక వ్యవహారాల కొనసాగింపే రాజకీయాలైనపుడు రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు చెట్టపట్టాలేసుకుని తిరుగుతూ కార్పొరేట్ అనుకూల నిర్ణయాలతో విధానాలు రూపొందుతుండడం బహిరంగ రహస్యమే. ఈ క్రమంలో పారిశ్రామికవేత్తలు రాజకీయవేత్తలుగాను, రాజకీయ నాయకులు పారిశ్రామికాధిపతులుగా మారిన ఉదంతాలెన్నో ఉన్నాయి. ఈ ఉదంతాలన్నిటికీ రాజకీయార్థిక అవినీతి పునాదిగానే సాగుతాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రభుత్వంలో పెద్దల అండదండలున్నాయని పారిశ్రామికవేత్తలు స్వలాభం కోసం ప్రజలను ఇక్కట్ల పాలుచేసేందుకు దొరికిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుని అందలానికి చేరుకోవడం సర్వసాధారణమైంది. అభివృద్ధి పేరుతో అమలవుతున్న పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తి కార్యక్రమాలన్నిటిలోను కార్పొరేట్ దిగ్గజాలకు కట్టబెడుతున్న భూమి, నిధులు, సదుపాయాలు, రాయితీలు, సబ్సిడీ, మినహాయింపులు ఇవ్వడంలో అధికారిక, విధానపరమైన అవినీతి ప్రజావ్యతిరేకమైన చర్యగా గుర్తించలేక పోతున్నాం. ప్రజాస్వామ్యంలో అమలులో వున్న రాజకీయార్థిక విధానాన్ని నిలదీయడం, ప్రశ్నించడం కనిపించనంత వరకు అవినీతి పెరిగిపోతూనే ఉంటుంది.



మంచిమాట



'నిన్ను చూసి చప్పట్లు కొట్టే పది వేళ్ల కన్నా... కన్నీరు తుడిచే ఒక్క వేలు మిన్న'

- రామకృష్ణ పరమహంస

రాజకీయంగా కమల్ వికసిస్తారా?

ఇల్లు అలకగానే పండుగ కాదు. సభ విజయవంతమైనంత మాత్రాన రాజకీయంగా విజయం సాధిస్తారనే గ్యారంటీ ఏమీ లేదు.



జి. రాజశుక

సచేతన

మదురై సభ ఓ రాజకీయ వేదికే కావచ్చు. కానీ, కమల్ హాసన్ ఓ షోమాన్‌గా ఓ వెలుగు వెలిగారు. ఆయన మొదటి షో బాగా హిట్టయింది. హాస్యం, వ్యంగ్యం మేళవించి ఏకవాక్య డైలాగులతో ఆయన చేసిన ప్రసంగం లక్షలాది మంది అభిమానులను, ప్రేక్షకులను, వీక్షకులను ఆకట్టుకుంది. నిజానికి ఆయన ఆ సభలో మాట్లాడినవన్నీ వాస్తవాలే. తమిళనాడు రాజకీయ వేదిక మీద ఒక కొత్త నాయకుడు అవతరించాడన్న అభిప్రాయాన్ని ఆయన విజయవంతంగా కలిగించారు. ఆయన తమిళనాడు అవినీతిని క్షాళన చేస్తారో లేదో ఇప్పుడే చెప్పలేం కానీ, ఆయన ప్రసంగించిన తీరు మాత్రం బాగుంది. ఆయనలో ఓ అసలు సిసలు నాయకుడు ఉన్నాడనిపించింది. ఆయన మీదా, ఆయన పార్టీ మక్కల్ నీతి మయ్యం మీదా దేశవ్యాప్తంగా ఆసక్తి రేగడానికి ఆయన స్టార్ హోదాయే కారణమనడంలో సందేహం లేదు. అటు దేశ, విదేశీ పత్రికలు, ఇటు స్థానిక పత్రికలు సైతం రజనీకాంత్ కంటే కమల్ హాసనే నయం అన్న రీతిలో వార్తలు గుప్పించాయి. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ కూడా రాజకీయ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న విషయం విదితమే. కమల్ హాసన్ గురించి ప్రస్తుతం ఆసక్తి కనబరుస్తున్నవారంతా, ప్రతి గ్రామంలోనూ కార్యకర్తలు ఉన్న పెద్ద పార్టీలు డీఎంకే, అన్నాడీఎంకేలను సైతం చిన్నవి చేసి చూపించడం విశేషం. కమల్ హాసన్ పార్టీ రావడంతో ఇక ఆ పార్టీల గురించి పెద్దగా చెప్పుకోవాల్సిందేమీ లేదన్నట్టు రాష్ట్రంలో పరిస్థితి మారిపోయింది.


ఢిల్లీకి, తమిళనాడుకు ఎంతో భేదం

నిజానికి తమిళనాడు రాజకీయాల గురించి తెలిసిన వ్యక్తులందరికీ, ఇటువంటి అభిప్రాయంలో వాస్తవం లేదని ఇట్టే అర్థమైపోతుంది. ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీతో ఈ పార్టీని పోల్చడం కూడా వాస్తవదూరం. ఓ రాష్ట్రమన్న పేరే గానీ ఢిల్లీ ఓ పెద్ద నగరపాలక సంస్థ. అనేక కులాలు, కులతత్వాలు, పట్టణాలు, నగరాలతో ఉన్న తమిళనాడు వంటి రాష్ట్రం ఢిల్లీకే కాక, ఇతర రాష్ట్రాలకు సైతం భిన్నమైంది. కమల్ హాసన్, రజనీకాంత్‌లు రాజకీయంగా సాగించబోయే పోరాటాలు ప్రస్తుత రాజకీయ వ్యవస్థకు, రాజకీయ సంస్కృతికి పూర్తిగా విరుద్ధం. అయితే, కమల్ హాసన్ అరంగేట్రం బాగుందని మాత్రమే ఇక్కడ పెద్దగా చెప్పుకోవచ్చు.

ఓ పార్టీని నిర్మించడం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకున్న పని. రాజకీయాలు ఆషామాషీ వ్యవహారం కాదు. ఇక్కడ రాజకీయాల్లో బతికి బట్టకట్టాలన్నా, ఎన్నికల్లో పోటీ చేయాలన్నా ప్రసంగాలతో సరిపోదు. భారీగా నిధులు అవసరం. ఇక బూత్ స్థాయి నిర్వహణ సామర్థ్యం అత్యవసరం. కమల్ హాసన్ తన పార్టీ నిర్మాణానికి, ఎన్నికల్లో పోటీ చేయడానికి నిష్కళంకమైన నిధులు తీసుకు వస్తానంటున్నారు. భారతదేశంలో రాజకీయ పార్టీల తీరుతెన్నులు చూసినవారికి ఇదెంత పెద్ద సవాలో తేలికగా అర్థమవుతుంది. నాలుగున్నర దశాబ్దాలుగా చలనచిత్ర జీవితంలో మునిగి తేలుతున్న కమల్ హాసన్‌కు ఇది కొత్త వ్యవహారం. రాజకీయ వ్యాపారంలో వృత్తి నిపుణులు ఎందరో ఉన్నారు. వీరితో తలపడడం సినిమాల్లో విలన్లతో తలపడడం అంత తేలిక కాదు.

ఇంకా మొగ్గ దశలోనే....

అనేక రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల మీద ఆయన ఆలోచనలన్నీ ఇంకా పూర్తిగా రూపుదిద్దుకోలేదు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా అవి ఓ స్థిరమైన భావాలుగా మారాలంటే కొంతకాలం పడుతుంది. అంతేకాదు, అనేక అంశాల మీద ఆయన ధోరణి ఇంకా చలనచిత్ర నిర్మాణానికి దగ్గరగానే ఉంది. ఏ దర్శకుడో పక్కనే ఉండి యాక్షన్, కట్ వంటి మాటలతో ఆయనను నియంత్రించాల్సి ఉందేమోనని కూడా అనిపించింది. వాస్తవ జీవితానికి, సినిమా జీవితానికి హస్తిమశకాంతరం తేడా ఉందనే సంగతి ఆయన గ్రహించుకోవడానికి మరి కొంతకాలం పడుతుంది.



కమల్ రాజకీయాలలో నిలదొక్కుకోవడానికి దోహదపడే సానుకూల అంశాలేమిటి అన్నది ఆలోచించాలి. తమిళనాడులో ప్రస్తుతం చక్రం తిప్పుతున్న కీలక రాజకీయ నాయకులంతా ప్రజల నమ్మకానికి దూరం అవుతున్న సమయంలో కమల్ హాసన్ రాజకీయ అరంగేట్రమ్ చేశారు. తాను ప్రజలకు సరైన నాయకుడినని, వారి ఆకాంక్షలను తీర్చే విషయంలో తనపై పూర్తి నమ్మకం పెట్టుకోవచ్చని ఆయన ముందు నిరూపించుకోవాల్సి ఉంటుంది. ఆయన, రజనీకాంత్ తమ రాజకీయ ప్రవేశంతో వివిధ పార్టీల అధ్యక్షులు, అధినేతలలో పోటీ దిగుతున్నారన్న విషయాన్ని గమనించాలి. కమల్ హాసన్ కన్నా ముందే ఎం.కె. స్టాలిన్, టి.టి.వి. దినకరన్, అంబుమణి రామదాస్ వంటి నాయకులు ఇక్కడి రాజకీయాలలో పాతుకుపోయి ఉన్నారు. వారిని కాదని ప్రజలు కమల్ హాసన్‌ను ఆదరించాలన్నా, వారితో కమల్ ఢీకొనాలన్నా అంత తేలికైన విషయం కాదు. కేవలం సినిమా హీరో అనుభవంతో వీరిని నెగ్గుకు రావడం కష్టం. ప్రజల భావోద్వేగాలు కొంత కాలమైన తర్వాత చల్లబడే అవకాశం ఉంది. ఈలోగా కమల్ తనను తాను నిరూపించుకోవాలి.

తమిళ భాషాభిమానం గురించి కమల్ హాసన్ తన ప్రసంగంలో ఎక్కువ సేపు మాట్లాడారు. దేశమంతా ఒకే భాష ఉండాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్న సమయంలో ఆయన తమిళ ప్రాధాన్యం గురించి మరీమరీ నొక్కి చెప్పడం ఆలోచించాల్సిన విషయం. దేశంలో బహుళ భాషలుండడం సహజమైన విషయమనీ, రాష్ట్రంలో తమిళాన్ని కాపాడుకోవడానికి చేయగలిగిందంతా చేయాలని ఆయన చెప్పడం ఓ పెద్ద సవాలుగానే పరిగణించాలి. భాష విషయంలో తమిళ ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తానని ఆయన చెబితే చెప్పి ఉండవచ్చు. కానీ, ఈ భాషను కాపాడడానికి ప్రస్తుత పరిస్థితుల్లో ఎంత చేసినా సరిపోదు.

దక్షిణాదితో మమేకం

ఆయన తన పార్టీ లోగోలో దక్షిణ భారతావనికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. తన రాజకీయాలు, తన ఆకాంక్షలు కేవలం తమిళనాడుకే పరిమితం కాదని, ఇవి తమిళనాడు ఎల్లలు దాటుతున్నాయని ఆయన చెప్పకనే చెప్పారు. ద్రవిడ దృక్పథం, ద్రవిడ ఆలోచనా ధోరణి అనేవి దక్షిణాది రాష్ట్రాలకన్నిటికీ ఒకే విధంగా ఉంటాయనేది ఆయన అభిప్రాయం కావచ్చు. విధానాల విషయంలోనూ, నిధుల పంపిణీ, హిందీ అమలు తదితర రాజకీయ నిర్ణయాలలోనూ కేంద్రం దక్షిణ భారతదేశాన్ని వేరుగా చూస్తోందన్న అభిప్రాయం కూడా ఆయన ప్రసంగంలో వ్యక్తమైంది. బహుశా అందుకనేనేమో, ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావు, కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్, కర్ణాటకకు చెందిన నటుడు ప్రకాశ్‌రాజ్ వంటి వారితో మాటామంతీ జరిపారు. ఆయన రాజకీయ ప్రవేశంపై ఈ నాయకులంతా ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. అంటే, దక్షిణాదిలో క్రమంగా ఓ ఒత్తిడి వర్గం రూపుదిద్దుకుంటోందని అర్థం చేసుకోవాలి.

ఆయన ఆలోచనలన్నీ గందరగోళంగా ఉంటాయని ఆయన విమర్శకులు చెబుతుంటారు. అయితే, ఆయన అస్తవ్యస్త భావాల వెనుక ఓ ఆదర్శం కూడా ఉందని గమనించాలి. ఆయన వాస్తవవాది కాదని కూడా కొంతమంది విమర్శకులు వాదిస్తుంటారు. ఆరువేల రూపాయల చొప్పున తీసుకుని ఓటు వేయడమన్నది దీర్ఘకాలంలో ప్రజాస్వామ్యానికి శ్రేయస్కరం కాదని, మద్యానికి, ఉచిత కానుకలకు లొంగిపోవద్దని ఆయన చెప్పడం అందుకు కారణం. నిజానికి ఇటువంటి మాటలు ఎన్నికల ముందు ప్రతి రాజకీయ నాయకుడి నోటి నుంచి వచ్చేవే. అయితే, ఆయన ప్రజలకు ఇటువంటి మంచి సలహా ఇవ్వడం తప్పేమీ అనిపించుకోదు. రాజకీయ అవినీతిని ఆయన సీరియస్ అంశంగా పరిగణిస్తున్న విషయం ఇది చెప్పకనే చెబుతోంది.

కమల్ హాసన్ ప్రసంగాన్ని లక్షలాది మంది విన్నారంటే అందుకు ఆయన నటుడు కావడం ఒక్కటే కారణం కాదు. కొంత కాలంగా తమిళనాడు రాజకీయాలు బురదమయం అయిపోయాయి. వీటి నుంచి ఓ సరైన నాయకుడు అవతరించకపోతాడా అని ప్రజలు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. అందులోనూ జయలలిత మరణానంతరం అన్నాడీఎంకే వ్యవహారాలు మరీ అధ్వాన్నంగా మారిపోయాయని జనం భావిస్తున్నారు. మిగిలిన పార్టీల నాయకుల పట్ల జనంలో అభిమానం అడుగంటుతోంది. ఉత్తర భారతదేశం నుంచి వచ్చే పార్టీలను తమిళ ప్రజలు ఏనాడో తిరస్కరించారు. తమిళనాట, తమిళ అభిమానం కలిగి ఉండి, సరైన నాయకత్వాన్ని అందించగలిగిన అవినీతి రహిత నాయకుడైతే నెత్తి మీద పెట్టుకుందామని జనం ఆశిస్తున్నారు. ఇటువంటి సమయంలో రజనీకాంత్ ముందు వచ్చినా ఆయనను ఇదే విధంగా జనం ఆదరించేవారు. ముందుగా కమల్ హాసన్ రంగ ప్రవేశం చేయడంతో జనం దృష్టి ఆయన మీద కేంద్రీకృతమైంది.

ఇల్లు అలకగానే పండుగ కాదు. కమల్ హాసన్ మదురై సభ విజయవంతమైనంత మాత్రాన ఆయన రాజకీయంగా విజయం సాధిస్తారనే గ్యారంటీ ఏమీ లేదు. సినిమా నటులను విపరీతంగా అభిమానించే తమిళనాడులో ఓ 20 వేల మంది ప్రేక్షకులను కూడగట్టడం పెద్ద కష్టమేమీ కాదు. తిరుపతిలో నటుడు చిరంజీవి బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రజారాజ్యం పార్టీని ప్రకటించినప్పుడు లక్షలాది మంది హాజరయ్యారు. కమల్ హాసన్ పార్టీ పేరు కూడా ప్రజా అనే మాటతోనే ప్రారంభం కావడం కాకతాళీయమే. అయితే, చివరికి ప్రజారాజ్యం పార్టీ నిలవలేకపోయింది. చిరంజీవి కూడా కాంగ్రెస్‌లో చేరిపోవడం గుర్తుండే ఉంటుంది. కమల్ హాసన్ ఏం చేయబోతున్నారన్నది కాలమే చెప్పాలి. తమిళనాడులో సినిమా రంగం నుంచి వచ్చినవారిలో ఎం.జి. రామచంద్రన్, జయలలిత, కరుణానిధి తమిళనాడు రాజకీయాలను అనేక దశాబ్దాలపాటు శాసించారు. కమల్ హాసన్ కూడా వారిలా రాజకీయాలను చక్కని మలుపు తిప్పాలని ఆయన అభిమానులు కోరుకుంటున్నారు.

ఆజాద్ ఎన్‌కౌంటర్ - న్యాయ పర్యవసానాలు

మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, అధికార ప్రతినిధి ఆజాద్, జర్నలిస్టు హేమచంద్ర పాండేల ఎన్‌కౌంటర్ కేసులో 15 ఫిబ్రవరి 2018న అదిలాబాద్ జిల్లా అదనపు సెషన్ జడ్జి ఇచ్చిన తీర్పు పలు విధాలా ప్రాధాన్యమైనది. ఆరువేలకు పైగా ఎన్‌కౌంటర్ హత్యలు జరిగిన తెలుగు రాష్ట్రాల్లో కోర్టు విచారణ స్థాయికి చేరుకున్న మొదటికేసు ఇదే. జులై 2010 అర్ధరాత్రి ఆదిలాబాద్, వాంఖిడి పోలీసు స్టేషన్ పరిధిలోని సర్కేపల్లి-వెల్గి అడవుల్లో జరిగినట్లుగా క్రైమ్ నంబరు 40/10గా స్థానిక పోలీసులు నమోదు చేసిన ఈ కేసులో మావోయిస్టు నేత ఆజాద్ అలియాస్ చెరుకూరి రాజ్‌కుమార్‌తో పాటు ఫ్రీలాన్స్ జర్నలిస్టు హేమచంద్రపాండే ఈ ఎన్‌కౌంటర్లో చనిపోయారు. ఈ సంఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు, చివరకు పార్లమెంట్‌లో కూడా పెద్దచర్చ జరిగింది. అప్పటి హోమ్ మంత్రి చిదంబరం ఈ ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరపడాన్ని తిరస్కరించడంతో హేమ చంద్ర భార్య బబిత, చర్చల మధ్యవర్తి స్వామి అగ్నివేశ్‌లు సుప్రీంకోర్టులో కేసువేసి సీబీఐ విచారణకు ఆదేశాలు పొందారు. 2011లోనే కుట్ర, హత్యానేరం నమోదు చేసి దర్యాప్తు చేసిన సీబీఐ తుదకు పోలీసు ఎన్‌కౌంటర్‌లోనే వారు చనిపోయారని బాధితులు ఆరోపించినట్లుగా కాదని, కాబట్టి కేసును విచారణకు సాక్ష్యాధారాలు లేని కేసుగా మూసివేయాలని తుది నివేదికను సమర్పించడంతో ఈ కేసు విచారణపై అభ్యంతరాలు, సాక్ష్యాధారాలు ఉంటే ఆదిలాబాద్ స్థానిక కోర్టులో తేల్చుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ విధంగా కేసు 2010లోనే ఆదిలాబాద్ మేజిస్ట్రేట్ కోర్టుకు చేరుకున్నా జైలులో ఉండి విడుదలైన ఆజాద్ సహచరి కె.పద్మ, హేమచంద్ర భార్య బబిత మే 2013లో సీబీఐ తుది నివేదికను ఆక్షేపిస్తూ ప్రొటెస్ట్ పిటిషన్ వేసి కోర్టు విచారణ కోరగా 202 సీఆర్ పీసీ కింద కోర్టు విచారణకు స్వీకరించింది. బబిత, పద్మలతో పాటుగా స్వామి అగ్నివేశ్ సాక్ష్యాలు, అలాగే ఈ కేసులో కీలకమైన ఆజాద్ పోస్ట్‌మార్టం జరిపిన డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు సాక్ష్యాలను నమోదు చేసుకున్నారు. ఐతే డాక్టర్ నీలకంఠేశ్వర్ రావు సాక్ష్యం చెప్పడాన్ని సీబీఐ వ్యతిరేకించింది. నిజానికి ఆ సాక్ష్యమే కేసులో చాలా కీలకమైనది. ఎందుకంటే పోలీసులు చెప్పిన విధంగా దూరం నుంచే ఎదురు కాల్పులు జరిగాయని మిగతా డాక్టర్లు ని వేదికను ఇవ్వగా, ఆజాద్‌కు శవపరీక్ష చేసిన డాక్టర్ నీల కంఠేశ్వర్‌రావు వారితో విభేదించి అతిదగ్గరగా కాల్పులు జరిగాయని నివేదిక ఇచ్చారు.


> ఇకపై సాక్ష్యాధారాలున్న కేసులు హైకోర్టును రిట్ కోసం ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా నేరుగా ఫిర్యాదుల రూపంలో ఎన్‌కౌంటర్ హత్యా కేసులను నిరూపించుకోగలిగే అవకాశం కింది కోర్టుల్లోనే ఆయా స్థానిక కోర్టులలోనే ఉన్నదని ఈ కేసు విజయం సూచిస్తోంది.

అయితే తదనంతరం జరిగిన వాదనలలో మిగతా సాక్షులు చేసిన ఆరోపణలుగానీ డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు సాక్ష్యాన్ని కానీ, ఎన్‌కౌంటర్ తీరుపై న్యాయవాదులు లేవనెత్తిన ప్రశ్నలను పరిగణనలోకి తీసుకోకుండా 2015 మార్చి 24న అదిలాబాదు మేజిస్ట్రేట్ కేసు విచారణకు అర్హమైన కేసు కాదని కొట్టివేశారు. దానిని వ్యతిరేకిస్తూ పునర్విచారణ కోరుతూ పద్మ ఆజాద్, బబితలు అదిలాబాదు జిల్లా కోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్లు 2015లో వేయగా, నిజానికి 2016 జనవరిలో వాదనలు, మేలో రాతపూర్వక వాదనలు విన్న అప్పటి జిల్లా ఫ్యామిలీ కోర్టు 2018 మే 31న తీర్పు తేదీని ఖరారుచేసి కూడా తీర్పు ప్రకటించక మళ్ళీ వాదనల కోసం పెండింగ్ పెట్టారు. ఆ తరువాత 2016 జనవరి నుంచి 2018 జనవరి వరకు ఇద్దరు జడ్జీల ఎదుటకు కేసు వచ్చినా అటు వాదనలు వినలేదు, ఇటు తీర్పూ చెప్పలేదు. సరిగ్గా ఈ స్థితిలో ఫ్యామిలీ కోర్టు సెలవు కారణంగా ఇన్‌ఛార్జీ బాధ్యతలో ఉన్న ఎస్సీ ఎస్టీ స్పెషల్ కోర్టు అదిలాబాదు 5వ జిల్లా అదనపు జడ్జి దగ్గర 2018 జనవరి 11న ఈ కేసును సత్వరమే చేపట్టాలని, ఇప్పటికే కాలయాపన జరిగిందని విన్నవించగా వెనువెంటనే స్పందించిన జిల్లా జడ్జి భారతలక్ష్మి వాదనలు వినడం కోసం 2018 జనవరి 24ను ఖరారు చేయగా ఆ రోజున వాదనలు ముగించారు. ఫిబ్రవరి 15ని తీర్పు కోసం తేదీ నిఖరారు చేయడమే కాకుండా మూడేళ్ళుగా మిగతా జడ్జిల దగ్గర నానుతూ వచ్చిన కేసులో కీలకమైన తీర్పును కేవలం మూడవ వాయిదాలో ప్రకటిస్తూ, కింది కోర్టు తీర్పును తిరస్కరిస్తూ 29 మంది పోలీసులపై న్యాయ విచారణ ప్రక్రియను చేపట్టాల్సిందిగా జిల్లా కోర్టు ఆదేశాలు ఇచ్చింది. సంచలనాత్మకమైన ఈ తీర్పుతో అదిలాబాద్ కోర్టులో ఆజాద్ ఎన్‌కౌంటర్ కేసులో తొలి న్యాయ విచారణ ప్రారంభం కానుంది.

అసాధారణమైన తీర్పు సాధారణమైన కృషితో రాలేదు. సీబీఐ విచారణకు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల కారణంగా 169 పేజీల తుది నివేదికతో పాటు 87 మంది సాక్షుల వాంగ్మూలాలు, 78 డాక్యుమెంట్లు మొత్తం 4 వాల్యూమ్‌లలో దాఖలుచేశారు. ఆదిలాబాద్ మేజిస్ట్రేట్ జరిపిన 202 విచారణలో పద్మ, బబిత, స్వామి అగ్నివేశ్, డాక్టర్ నీలకంఠేశ్వర రావుల సాక్ష్యాలను, అలాగే కేసుకు సంబంధించి 16 కీలక ప్రశ్నలను, శవపరీక్ష నివేదికలోని పలు అంశాలతో పాటు చట్ట ప్రకారంగా ఆత్మరక్షణలో భాగంగా జరిగే అసహజ మరణాలను హత్యానేరం కిందకోర్టు న్యాయవిచారణలో మాత్రమే నిరూపించబడి, నిందితులు దోష రహితులుగా సేషన్స్ కోర్ట్ తీర్పుతో మాత్రమే సీబీఐ చేసే దర్యాప్తు నివేదికలతో కాదని బాధితుల తరపున చేసిన వాదనలను కోర్టు పూర్తిగా సమర్థించింది. దీని పర్యవసానంగా రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ హత్యలకు వ్యతిరేకంగా జరుగుతున్న న్యాయపోరాటానికి, ప్రజా పోరాటాలకు నైతిక, న్యాయపరమైన విజయం లభించినట్లయింది. ఇకపై సాక్ష్యాధారాలున్న కేసులు హైకోర్టును రిట్ కోసం ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా నేరుగా ఫిర్యాదుల రూపంలో ఎన్‌కౌంటర్ హత్యా కేసులను నిరూపించుకోగలిగే అవకాశం కింది కోర్టుల్లోనే ఆయా స్థానిక కోర్టులలోనే ఉన్నదని ఈ కేసు విజయం సూచిస్తోంది.

◆ డి సురేష్ కుమార్
అడ్వకేట్, ఐఏపీఎల్

చైతన్య ఉద్యమ స్వరూపిణి



తొలిదశ 1969 తెలంగాణ ఉద్యమంలో సదాలక్ష్మీ, ఈశ్వరీ బాయి, సంగెం లక్ష్మీబాయి లాంటివారు చురుకైన పాత్ర పోషించారు. ఈ స్ఫూర్తి మలిదశ ఉద్యమంలో మహిళలను కొనసాగించారు. ఆనాటి ఉద్యమంలో స్ఫూర్తి నిలిచిన వ్యక్తి అణగారిన ప్రజల ఆత్మబంధువు ఈశ్వరిబాయి. డిసెంబర్ 1, 1918 లో సికింద్రాబాద్, చిలకలగూడలో ఒక సామాన్య దళిత కుటుంబానికి చెందిన బల్లెపు బలరామస్వామి రాములమ్మ దంపతులకు ఈశ్వరీబాయి జన్మించారు. బల్లెపు బలరామస్వామి నిజాం స్టేట్ రైల్వేస్‌లో పని చేశారు. ఆయనకు ఆరుగురు సంతానం. అందులో నలుగురు అబ్బాయిలు బాబురావు, పాండురంగం, కిషన్, రవీందర్. ఇద్దరు అమ్మాయిలు ఈశ్వరీబాయి, మాణిక్యమ్మ. బలరామస్వామి కొద్ది సంపాదనతోనే తన పిల్లలందరికీ చదువులు చెప్పించారు. 13వ ఏటనే పూణెలోని సంపన్న కుటుంబానికి చెందిన దంత వైద్యుడు జెట్టి నారాయణతో వివాహం జరిగింది. లోకజ్ఞానం వచ్చేలోపు కూతురు జన్మించింది. అనంతరం భర్తతో విభేదాల వల్ల హైదరాబాద్ చేరుకున్నారు. ఒక పాఠశాలలో పనిచేస్తూనే కొందరు సంపన్న కుటుంబాల పిల్లలకు బోధన ప్రైవేట్లు చెప్పేవారు. తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్, మరాఠీ భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం చేస్తూనే సాంఘిక సేవలో పాల్గొనేవారు. ఈ నేపథ్యంలో అంబేద్కర్ పట్ల ఆకర్షితురాలైంది. 1842 జూన్‌లో నాగపూర్‌లో జరిగిన అఖిల భారత ఎస్సీ కులాల సభకు హైదరాబాద్ రాష్ట్ర ప్రతినిధిగా ఈశ్వరిబాయి హాజరయ్యారు. ఆ సందర్భంగానే ఆమె ప్రప్రథమంగా అంబేద్కర్‌ను కలుసుకున్నారు. అదే సదస్సులో అఖిల భారత ఎస్సీ ఫెడరేషన్ అనే రాజకీయ సంస్థను స్థాపించారు. ఎస్సీ ఫెడరేషన్ స్థానంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అనే రాజకీయ పార్టీని స్థాపించాలని డాక్టర్ అంబేద్కర్ తలపెట్టారు. అంబేద్కర్ స్ఫూర్తితో ఆయన అనుయాయులు ఆ పార్టీని ముందుకు నడిపించారు. ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖకు ఆమె ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అంచెలంచెలుగా ఎదిగి జాతీయ స్థాయిలో ఆ పార్టీకీ, ఆమె అధ్యక్షురాలుయ్యారు. తుదిశ్వాస విడిచే వరకు అదే పార్టీలో కొనసాగారు.

◆ డాక్టర్ సోమేశ్వర్ బోనకుర్తి
పునాది సెంటర్ ఫర్ రిసర్చ్

(నేడు ఈశ్వరీబాయి వర్ధంతి)

జీవితోత్సవం

చుట్టూ ఎన్నెన్నో రంగులు..., తెల్లని నవ్వులు, నీలి కన్నీళ్లు, ఎర్రటి కోపాలు, నల్లటి దిగులు, గులాబీల సంతోషాలు, నారింజ వేడుకలు, ఆకుపచ్చటి ఆశలు,..., అంతటా రంగులే! జీవితాన్ని బొమ్మకట్టాలంటూ నీకెవరైనా కాన్వాస్‌ని ఇస్తే ఏ రంగును ఎంచుకుంటావు... గుర్తుంచుకో, నువ్వు చిత్రకారుడివి, కాన్వాస్‌వి కావు. జీవితమనే కాన్వాస్ మీద ఏ రంగును విరజల్లాలో నిర్ణయించుకునే హక్కు చిత్రకారుడిదే! అంతటా తెల్లవారితే తెల్లగా, చీకటి వేళకు నల్లగా... బ్లాక్ అండ్ వైట్ అంతస్సూత్రం ఆడే వాసంత నాటకమే జీవితం. తెలుపు, నలుపుల మధ్య జీవితోత్సవపు రంగుల వేడుక... ఆ 'హోలీ' హరివిల్లును ఇవాళ 'మైత్రి' మీ చేతికందిస్తోంది.

- మీ 'మైత్రి'

అనాది రంగులు

ఇవాళ మనం ధరించే బట్టల నుంచి చుట్టూ కనిపించే అనేకానేక రంగులకు మాతృకలైన ప్రాథమిక రంగులకు ఒక చరిత్ర ఉంది. ఆ చరిత్రేమిటో తెలుసుకుందాం.



నలుపు: మానవ జాతి చరిత్రలో నలుపు నానారకాల అశుభాలకు నిలయమై పోయింది. అయితే నలుపు అన్నది ఎంత కీలకమో తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగక మానదు. నలుపన్నది నిజంగా ఒక రంగేనా, కాదనే శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వర్ణ చక్రంలో తెలుపు అన్నిరంగుల్ని వెలుపలికి వెదజల్లుతుంది, నలుపు ఆ రంగుల్ని తనలోకి ఇముడ్చుకుంటుంది. అన్ని రంగుల్నీ తనలో లీనం చేసుకుంటుంది. అంటే రంగులు లేకపోవడమే నలుపు. నిజానికి మనకంటికి కనబడుతున్నదంతా కారునలుపేనా, కాదు. కారునలుపును చూడాలంటే ఖగోళాంతరాల్లోని బ్లాక్‌హోల్స్‌ని చూడాల్సిందే. నలుపు రంగులో మనకు కనిపిస్తున్న దాంట్లో ఎంతో కొంత వెలుగు ఉండనే ఉంటుంది. ప్రాచీన రోమన్, గ్రీకు సంస్కృతుల్లో నలుపు రంగు పట్ల ఎంత ప్రతికూలత కనిపించినప్పటికీ, నల్లరేగడి నేలల సారవంతపు జీవలక్షణాన్ని నైలు నది ప్రపంచానికి చాటుతూనే ఉంది. బ్లాక్‌ఇంక్‌ను ప్రాచీన చైనీయులు, భారతీయులు కనిపెట్టారు. తెల్లని కాగితం మీద నల్లటి ఇంకు రాత, లేదా తెల్లటి పేజీల మీద నల్లటి అక్షరాల ముద్రణ లేనిదే 'చదువు' ముందుకు వెళ్ళే ప్రసక్తే లేదు కదా. ఇక ఫ్యాషన్ ప్రపంచంలో నలుపే ప్రధాన ఆకర్షణ అంటే అతిశయోక్తి కాదు.



తెలుపు: తెలుపును శాంతికి చిహ్నంగా భావిస్తారు. తెలుపును స్వచ్ఛతకు సంకేతంగా ఉపయోగిస్తారు. ప్రాచీన ఈజిప్టు, రోమ్‌లలో ప్రార్థనా స్థలాల్ని తెల్లటి పాలరాయితో నిర్మించే వారు. క్రైస్తవ పోప్ 1566 నుంచి తెల్లటి దుస్తుల్ని ధరించడం మొదలుపెట్టారు. ఇస్లాం, జపాన్‌కు చెందిన షింటో మతంలో పవిత్రస్థలాల్ని సందర్శించే భక్తులు తెల్లని దుస్తుల్ని ధరిస్తారు. అయితే తెలుపు అనే రంగు లేనే లేదని శాస్త్రవేత్తలు చెబుతారు. వాననీటి బిందువుల ద్వారా కాంతి పరావర్తనం చెందడం వల్ల ఇంద్రధనుస్సులోని రంగులు కనిపిస్తాయని, ఈ రంగులన్నీ కలిస్తేనే తెలుపు రంగు అవుతుందని మనకు తెలుసు కదా. చరిత్రలో మొట్టమొదట తెల్లని రంగును సీసం నుంచి తయారు చేయడం మొదలు పెట్టారు. సుద్దరాయితో చిత్రాల్ని చిత్రించినప్పటికీ, ఇలా సీసంతో తయారు చేసిన తెలుపు రంగును ముఖానికి మేకప్‌గా వాడడం మొదలైంది. అయితే సీసం విషకారకం. అందువల్ల అతి త్వరలోనే సీసం నుంచి తెలుపు రంగును తయారు చేయడాన్ని నిషేధించారు. ఏది ఏమైనా తెలుపు స్థానం తెలుపుదే. సంప్రదాయికంగా వైద్యులు, నర్సులు, శాస్త్రవేత్తలు, తదితరులు తెల్లని దుస్తుల్నే ధరిస్తున్నారు. తెలుపు రంగు ధనికవర్గానికి సంబంధించింది కూడా.

చరిత్ర



ఎరుపు: రంగుల్లోకెల్లా ప్రాచీనమైనది ఎరుపు రంగు. దీనికి 17,000 ఏళ్ళ చరిత్ర ఉంది. మన రక్తం రంగు కూడా ఎరుపేగా. ఆదిమానవుల కాలం నుంచీ ఎరుపు రంగు గురించి మనిషికి తెలుసు. ఫ్రాన్స్, దక్షిణాఫ్రికాల్లోని ప్రాచీన గుహల్లో ఎరుపు రంగుతో చిత్రించిన అత్యంత ప్రాచీన పెయింటింగ్స్ కనిపిస్తాయి. ఇవి పదిహేనువేల సంవత్సరాల క్రితం నాటివి. ఎరుపును మట్టి నుంచి తయారు చేస్తారు. ప్రాచీన రోమను పురాణాల్లో యుద్ధదేవత మార్స్ రంగు ఎరుపు. ఎరుపు రంగు వీరత్వానికి, ధీరత్వానికి ప్రతీకగా భావిస్తారు. మధ్యయుగాల నాటికి ఎరుపు ప్రతిష్ఠకు చిహ్నమై పోయింది. క్రైస్తవ విశ్వాసం ప్రకారం ఎరుపు ఏసుప్రభువు రక్తానికి సంకేతం. పాశ్చాత్య దేశాల్లోను, చైనాలోను పెళ్ళి వేడుకల్లో వధువులు ఎర్రటి దుస్తుల్ని ధరిస్తారు. ఎరుపు పునరుత్పత్తికి చిహ్నం. ఇక 'రెడ్‌కార్పెట్' విషయానికి వస్తే, గౌరవసత్కారాల్లో భాగంగా ఎర్రతివాచీని పరవడం అన్నది క్రీస్తుపూర్వం 458 కాలం నుంచి ప్రారంభమైంది. అగామెమ్నన్ అనే పురాణపురుషుడు ట్రాయ్ మీద విజయం సాధించి తిరిగి వచ్చినపుడు ఆయన భార్య క్లైటమ్‌నెస్ట్రా ఎర్రతివాచీ పరచి ఆహ్వానించిందట. ఇప్పుడు హాలీవుడ్, ఆస్కార్ వేడుకల్లో ఎర్రతివాచీ ఒక తప్పనిసరి సంప్రదాయంగా మారింది. చరిత్రలో ఫ్రెంచి విప్లవానికి ఎరుపు సంకేతం. ఆ కాలంలో తిరుగుబాటుదారుల ఎర్రని దుస్తుల్ని, ఎర్రటి టోపీల్ని ధరించే వారు. ఎరుపు కార్మికశక్తికి ప్రతీకగా మారింది.



ఆకుపచ్చ: ప్రకృతికి మారుపేరైన ఆకుపచ్చకు ఒక చరిత్ర ఉంది. నిజానికి ఊసరవెల్లిలాంటి జీవుల రంగు కూడా ఆకుపచ్చ కాబట్టి, ఈ రంగును మోసానికి చిహ్నంగా కొందరు భావిస్తుంటారు. కొన్నిరకాల ఆకుల నుంచి ఆకు పచ్చ రంగును తయారు చేయ డానికి ప్రాచీన గ్రీకులు ప్రయత్నించినప్పటికీ వారు విజయం సాధించలేక పోయారు. దాంతో పెయింటింగ్ చేసేటపుడు నాటి కళా కారులు ఆకుపచ్చరంగుకు బదులుగా నీలిరంగునే వాడే వారు. తరువాత కొంత కాలానికి రాగిరేకుల్ని వైన్‌లో నానబెట్టడం ద్వారా ఆకుపచ్చరంగును తయారు చేయడం నేర్చుకున్నారు. ఆకుపచ్చ రంగు ఆరోగ్యానికి చిహ్నంగా భావిస్తున్న ప్పటికీ, ఇందులో విషపూరిత ఆర్సెనిక్ ఉంటుంది. తరువాత ఆకుపచ్చను ట్రాఫిక్ సిగ్నల్‌గా ఉపయోగించడం మొదలైంది. లండన్ పార్లమెంట్ ఆవరణలో 1868లో గ్యాస్‌తో వెలిగే దీపాల్ని కనిపెట్టిన తరువాతే ఆకుపచ్చ ట్రాఫిక్ సిగ్నల్‌గా మారింది. అయితే 1970ల నుంచి ఆకుపచ్చ పర్యావరణ ఉద్యమానికి ప్రతీక అయింది.



నీలం: రంగుల్లో అత్యంత ఆధునికమైంది నీలం. ప్రాచీన చిత్రకారులకు నీలం రంగు పరిచయం లేదంటే ఆశ్చర్యకరంగా ఉంటుంది. ఇప్పుడు మనకు తెలిసిన నీలం రంగు అన్నది నాటి ప్రాచీన ప్రపంచానికి తెలియదు. అయితే ప్రాచీన ఈజిప్షియన్లు మాత్రమే నీలంరంగును తయారు చేసే సాంకేతికతను వృద్ధి చేశారు. ఆరువేల ఏళ్ళ నాడు ఈజిప్షియన్లు అఫ్ఘానిస్తాన్‌లో మైనింగ్ చేసి లాపిస్ లజులీ అనే వజ్రాన్ని కనుగొన్నారు. తరువాతి కాలంలో సున్నపురాయిని, రాగిని, ఇసుకను కలిపి నీలం రంగును తయారు చేసే పద్ధతిని కనిపెట్టారు వారు. ఏది ఏమైనా నీలం రంగును తయారు చేయడమన్నది ఖర్చుతో కూడుకున్న పని. అందుకే క్రీస్తుశకం 431నాటికి మేరీ మాత చిత్తరువును మాత్రమే నీలం రంగులో చిత్రించడమన్నది వాడుకలోకి వచ్చింది. పారిశ్రామిక విప్లవం వచ్చేంత వరకు నీలం అన్నది కులీనవర్గాల రంగుగా చెలామణీ అయింది. తదనంతర కాలంలో సాంకేతిక అభివృద్ధి పెరగడంతో నీలం రంగును తయారు చేయడం కూడా సులభమైంది. తరువాత బ్లూజీన్స్ మన నిత్య జీవితాన్ని ఎంతగా ఆక్రమించిందో మీకు తెలుసుగా!

గుండ్రంగా తిరిగీ, తిరిగీ...

సరదా





మనిషికి వినోదాన్ని అందించే ఆట వస్తువుల్లో రంగులరాట్నం కూడా ఒకటి. గుర్రాలు, పులులు, జింకలు, ఇంకా రకరకాల జంతువుల బొమ్మల మీద కూర్చుని గిరగిరా తిరగడమంటే పిల్లలకే కాదు పెద్దలకు పెద్ద సరదానే! రంగులరాట్నాన్ని మొట్టమొదట ఉపయోగించింది బైజాంటియన్ సంస్కృతికి చెందిన వారట. ఒక దూలానికి మూటల్ని కట్టి, వాటిని పట్టుకుని గుండ్రంగా తిరిగే వారట. అయితే మనకు తెలిసిన రంగుల రాట్నానికి మూలం 12 వ శతాబ్దానికి చెందిన యూరోపు, ఆసియాల్లోని యుద్ధక్రీడల్లో ఉంది. ఆ కాలంలో రాజవంశీకులు గుర్రాల మీద గుండ్రంగా తిరుగుతూ ఒకరి మీద మరొకరు గాజుబంతుల్ని విసురుకునే వారు. ఆ గాజు బంతుల్లో సుగంధ పరిమళాలు నిక్షిప్తమై ఉండేవి. గాజు బంతులు విరగకుండా విసరగలగాలి. ఒకవేళ కిందపడి గాజు బంతి విరిగి పోగానే సుగంధ పరిమళం చుట్టూ వ్యాపించేది. అలా గాజుబంతిని పగలగొట్టుకున్న వ్యక్తి ఓడిపోయినట్టుగా భావించే వారు. ఇలా ఓడిపోవడమన్నది అవమానకరం. ఈ క్రీడనే బొమ్మగుర్రాలతో తిరిగే యంత్రాన్ని రూపొందించి ఆడడం మొదలు పెట్టారు. పిల్లల కోసం మొట్టమొదటి సారిగా రంగుల రాట్నాన్ని 17 వ శతాబ్దంలో ప్రదర్శించారు. చిన్నచిన్న కొయ్యగుర్రాల బొమ్మల్ని దీనికి అమర్చారు. జర్మనీలో హీన్, ఫ్రాన్స్‌లో బేయల్ కంపెనీలు ఆకాలంలో విరివిగా రంగులరాట్నాల్ని తయారు చేసేవి. అయితే ఆవిరితో నడిచే యంత్రాన్ని రంగుల రాట్నానికి జత చేసిన పుణ్యం మాత్రం 18 వ శతాబ్దానికి చెందిన థామస్ బ్రాడ్‌షా అనే వ్యక్తికి చెందుతుంది. తదనంతర కాలంలో ఫెడరిక్ శావేజ్ అనే వ్యక్తి సైకిల్ పరిజ్ఞానంతో నడిచే రంగులరాట్నాన్ని రూపొందించాడు. రంగుల రాట్నానికి అమర్చిన గుర్రం బొమ్మలు పైకి, కిందికి కదిలేలా కూడా ఆయనే కొత్తరకం సాంకేతికతను అభివృద్ధి చేశాడు. ఇరవయ్యో శతాబ్దానికి రంగులరాట్నాలు ప్రపంచమంతటా విస్తరించాయి. తరువాతి కాలంలో చోటుచేసుకున్న ఆర్థిక మాంద్యంతో పాశ్చాత్య దేశాల్లో రంగులరాట్నాల తయారీ ఇంచు మించు ఆగిపోయిందనే చెప్పాలి.

భావోద్వేగాలే రంగులు

స్త్రీ భావోద్వేగాల్ని తన కాన్వాస్‌ల మీద రంగుల వర్ణంగా చిత్రించే స్రవంతి జూలూరి తన చిత్రకళా ప్రస్థానం వెనుక ఒక తాత్త్విక ప్రయాణం ఉందని చెబుతారు. భావోద్వేగాల్లే తాను పెయింటింగ్‌లుగా మలుస్తానంటారామె. ప్రసిద్ధ నటి జమున గారి కుమార్తె స్రవంతి జూలూరి ఒక మహిళగా తాను ఎదుర్కొన్న సమస్యల్ని అధిగమించారు. మహిళల ఉన్నతి కోసం పనిచేయడంలోనే తన కళకు సార్థకత లభిస్తుందని చెబుతారు. 'నల్లని' చీకటిలోను 'తెల్లని' వెలుగు రేఖ కనిపిస్తుందంటున్న స్రవంతి తన వర్ణవిహారం గురించి ఇవాళ 'మైత్రి'తో రానున్న 'హోలీ'ని పురస్కరించుకుని మాట కలిపారు. ఆ సంభాషణ ఇలా సాగింది.

మైత్రి: స్రవంతి గారూ, మీ పెయింటింగ్ టెక్నిక్ గురించి చెబుతారా?

స్రవంతి జూలూరి: చాలా మంది కళాకారులు బ్రష్, నైఫ్, రంగులు, ఇంకా ఇతర సంప్రదాయ వస్తువుల్ని ఉపయోగించి పెయింటింగ్‌లు వేస్తుంటారు. అయితే నేను పెయింటింగ్ అనే దాన్ని స్త్రీగా, కళాకారిణిగా నాకు నేనే ఇచ్చుకునే ఒక కొనసాగింపుగా భావిస్తాను. అందుకే సంప్రదాయ శైలిలో పెయింటింగ్ చేయడమన్నది నా భావోద్వేగాల్ని వ్యక్తీకరించడానికి సరిపోదన్నది నా అభిప్రాయం. అది నైరూప్య చిత్రకళ (అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్)లోనే సాధ్యమవుతుంది. ఒక పెయింటింగ్ కోసం కాన్వాస్‌ను తీసుకుంటే లీటర్ల కొద్దీ పెయింట్‌ను నేను వెచ్చిస్తాను. నా పెయింటింగ్ పలుదశల్లో పూర్తవుతుంది. రంగును కాన్వాస్ మీద ఒలికించినపుడు అది ఏ రూపాన్ని తీసుకుంటుందో చెప్పడం కష్టం. అదే రెండు రంగుల్ని ఒలికించినపుడు అవి కలిసిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి. సాధారణంగా పెయింట్ ద్రవ రూపంలో ఉంటుంది. దానికొక ప్రవాహ గుణం ఉంటుంది. అలాంటి ప్రవాహగుణం కలిగిన పెయింట్‌ను నేను ఒక మానసిక ఉద్వేగంగా భావిస్తాను. కాన్వాస్ మీద రంగులు ప్రవహించేటపుడు అవి నా భావోద్వేగాలకు ప్రతీకలవుతాయి. అయితే వాటిని అర్థవంతంగా ప్రవహింపజేయడమన్నది చాలా కష్టంతో కూడుకున్న పని. మొదట్లో ఈ పనిలో నియంత్రణ సాధించేందుకు నేను ఎన్నో కాన్వాసుల్ని, ఎన్నో లీటర్ల రంగుల్ని వృథా చేయాల్సి వచ్చింది. ఎన్నో నెలలు శ్రమకోర్చి రంగుల్ని ఒక క్రమపద్ధతిలో ప్రవహింపజేయడంలో నేను పట్టు సాధించాను.

కాన్వాస్

స్రవంతి జూలూరి



మైత్రి: రంగును మీరు ఎలా నిర్వచిస్తారు?

స్రవంతి జూలూరి: ఇందాక చెప్పినట్టు నేను రంగులతో భావోద్వేగాల్ని పెయింట్ చేస్తాను. రంగులకు ఒక భాష ఉంటుంది. అయితే రంగుల్ని ఎవరికి వారు తమకు నచ్చినట్టు అర్థం చేసుకుంటారు. ఎవరికి వారు రంగులకు తమదైన భాష్యం చెప్పుకుంటారు. ఉదాహరణకు నలుపు అంటే చాలామందికి ఇష్టం ఉండదు. దాన్ని ప్రతికూల దృష్టితోనే చూస్తారు. అయితే నన్నడిగితే నలుపు కన్నా అందమైన రంగు మరొకటి లేదంటాను. ఆ చీకటి రంగులో ఎక్కడో సన్నని వెలుగురేఖ కనిపిస్తుంటుంది.

మైత్రి: మీ పెయింటింగ్స్‌ను చూస్తున్నపుడు అదొక అంతర్యానంలా అనిపిస్తుంది. జీవితానికి, మీ పెయింటింగ్స్‌కి మధ్య అనుబంధాన్ని వివరిస్తారా?

స్రవంతి జూలూరి: ఆర్టిస్టుగా నేను నా ప్రయాణాన్ని 2001లో ప్రారంభించాను. నేను మొదట్లో గాజుతో కళాఖండాల్ని రూపొందించే దాన్ని. దీన్ని స్టెయిన్ గ్లాస్ ఆర్ట్ అంటారు. అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, బెర్క్‌లీలో నేను ఆర్ట్‌ను అభ్యసించాను. గాజుతో పనిచేయడంలో నేను ఒక తత్త్వ సంబంధితమైన అనుభూతిని పొందేదాన్ని. గాజు అనేది మట్టి నుంచి వచ్చింది. దాన్ని కట్ చేసి, గ్రైండ్ చేసి ఒక రూపాన్ని కల్పిస్తాం. అయినప్పటికీ అది పెళుసుగానే ఉంటుంది. సులభంగా పగిలి పోతుంది. మనుషులు కూడా అంతే కదా! మట్టిలోంచి వస్తాం, తిరిగి మట్టిలోనే కలిసి పోతాం. అయితే నేను స్టెయిన్ గ్లాస్ వర్క్ చేసేటపుడు అంటే కళాకారిణిగా నా ప్రస్థానాన్ని మొదలు పెట్టిన తొలినాళ్ళలోనే నా వివాహం నన్ను కష్టాల్లోకి నెట్టివేసింది. గృహహింసకు గురయ్యాను. ఆ బంధం నుంచి బయటపడేందుకు కోర్టుల చుట్టూ తిరిగాను. ఆ సమయంలో నేను నాలాగా బాధపడే చాలామంది మహిళల్ని కలిశాను. కొంతమంది ఆ బాధల్ని భరించలేక చనిపోవడాన్ని కూడా చూశాను. వాళ్ళ వ్యక్తిగత అనుభవాల్ని తెలుసుకున్నాను. కళాకారులు తమ భావోద్వేగాల్ని, సందేశాల్ని శక్తివంతంగా చెప్పగలరు. నా పోరాటం నుంచి, మహిళలందరి కష్టనష్టాల గురించి తెలుసుకున్నాను. మహిళల విముక్తి పోరాటం కోసం వెచ్చించడానికే నేను జీవించి ఉన్నానని నాకు అనిపించింది. ఒక గృహహింస బాధితురాలైన కళాకారిణి నేను. ఇతరులకు ఆదర్శంగా నన్ను నేను తీర్చి దిద్దుకోవాలనుకున్నాను. నా పెయింటింగ్స్, ఇతర కళా ప్రయోగాల ద్వారా మహిళల సమస్యల్ని చాటి చెప్పేందుకు యత్నిస్తున్నాను. కొందరికైనా ఇది ప్రయోజనాన్ని చేకూర్చితే నేను నా లక్ష్యాన్ని సాధించినట్టే.




తల్లి జమున, కుమారుడు అవిష్‌తో స్రవంతి

మైత్రి: ఒక మహిళా చిత్రకారిణిగా మీ అనుభవాన్ని చెప్పండి.

స్రవంతి జూలూరి: ఆర్ట్ రంగం కూడా పురుషాధిక్య ప్రపంచానికి సంబంధించిందే! ఇక్కడ ఉమెన్ ఆర్టిస్టులకు అంత సులభంగా గుర్తింపు లభించదు. ప్రోత్సాహం కూడా తక్కువే.

మైత్రి: మీరు ఇటీవల ప్రదర్శించిన నృత్యరూపకం 'త్వమేవాహం' గురించి చెప్పండి.

స్రవంతి జూలూరి: నేను భావోద్వేగాల్ని పెయింట్ చేస్తాను అని చెప్పాను కదా, భావోద్వేగాలు అంటే నవరసాలు. నా ప్రతి కాన్వాస్ నవరసాలతోనే నిండి ఉంటుంది. ఈ నవరసాల్ని ఒక ఆర్టిస్టు అనుభవంగా, మరో నృత్యకారిణి అనువాదంగా వెరసి నృత్యరూపకంగా ప్రదర్శించాం. మన రాష్ట్రంలో ఇలాంటి ప్రయోగాలు ఇంకా విస్తరించలేదు. నా పెయింటింగ్స్‌ని పూర్తిస్థాయిలో వ్యక్తీకరించేందుకే నేను గత మేనెలలో 'త్వమేవాహం' నృత్యరూపకం చేశాను. ఈ ప్రదర్శనలో నాతో పాటు, వైష్ణవీలంక అనే సంప్రదాయ కూచిపూడి కళాకారిణి కూడా పాల్గొన్నారు. మరో ఆర్టిస్టు కోయిలీ ముఖర్జీ ఈ షోని క్యూరేట్ చేశారు. ఒక ఆర్టిస్టుగా నేనేం చేస్తున్నాను చెప్పడానికి ఈ నృత్యరూపకాన్ని ప్రదర్శించాను.

మైత్రి: మీ అబ్బాయి అవిష్ కూడా ఆర్టిస్టే కదా, తల్లిగా అవిష్ ద్వారా పిల్లల ఆర్ట్ ప్రపంచంలో మీ ప్రయాణాన్ని వివరిస్తారా?

స్రవంతి జూలూరి: తల్లిగా అదొక అందమైన అనుభవం. నా కొడుకు దగ్గర ఆర్టిస్టుగా నేను చాలా నేర్చుకున్నాను.మా అవిష్ చాక్లెట్ తింటూ పెయింటింగ్ చేస్తుంటే అప్పుడు పెయింటింగ్‌లోని నిజమైన సంతోషం నా కళ్ళకు కడుతుంది. నిజానికి పెయింటింగ్ చేయడానికి అదే సరైన పద్ధతి.

- ఇంటర్వ్యూ: పసుపులేటి గీత

కాళేశ్వరంపై ఊరట

(మొదటిపేజీ తరువాయి)



అనుమతులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను భారత అత్యున్నత న్యాయస్థానం కొట్టేసింది. పిటిషన్‌ను దాఖలు చేసిన హయత్‌ఉద్దీన్‌ను కోర్టు తీవ్రంగా మందలించింది. ముంపు గ్రామాల్లో సరైన చర్యలు చేపట్టకుండా పనులు చేస్తున్నారని ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సుప్రీం శుక్రవారం విచారణ చేపట్టింది. చెన్నై బెంచ్ నుంచి ఢిల్లీకి ఎందుకు వచ్చారని పిటిషనర్‌ను కోర్టు ప్రశ్నించింది. ఫోరం హంటింగ్ చేస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసు దాఖలులోనే ఆలస్యం చేశారని కోర్టు పేర్కొంది. ఒక చోట కాకపోతే మరో చోటికి వస్తారా అంటూ చురక లంటించింది. కేసు విచారణకు అర్హం కాదంటూ, పిటిషనర్ ఆలోచన సరిగా లేదంటూ.. పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది.

రైతులకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి:హరీశ్

కాళేశ్వరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. కేసు వాదనలను స్వయంగా మంత్రి పరిశీలించారు. పిటిషన్ కొట్టివేసిన విషయాన్ని సీఎం కేసీఆర్‌కు హరీశ్‌రావు ఫోన్ చేసి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు ఎన్నో పిటిషన్లు వేశారని ఈ సందర్భంగా మంత్రి ఆరోపించారు. కానీ ఆ పిటిషన్లను కోర్టులు కొట్టివేస్తున్నాయని గుర్తు చేశారు. వందకు పైగా కేసులు వేసినా రైతులు గెలిచారు.. న్యాయం, ధర్మం గెలిచిందని అభిప్రాయపడ్డారు. రైతులకు కాంగ్రెస్ నేతలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులపై కేసులు వేయించింది ఏ కాంగ్రెస్ నేతనో త్వరలో బయటపెడుతామని చెప్పారు. కాంగ్రెస్ నేతల కుట్రలను.. సాక్ష్యాధారాలతో శాసనసభ వేదికగా వెల్లడిస్తామన్నారు. ప్రాజెక్టులను అడ్డుకోవడమంటే.. రాష్ట్ర ప్రగతిని, రైతుల అభివృద్ధిని అడ్డుకోవడమేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. ప్రజల కలలను నిజం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆత్మహత్యలు లేని తెలంగాణ, ఆకుపచ్చ తెలంగాణ తయారు కావడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని మంత్రి ఉద్ఘాటించారు. బ కాళేశ్వరం ప్రాజెక్టు పనులను యుద్ధప్రతిపాదికన వేగవంతంగా పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. 2018 చివరి నాటికి రైతులకు నీరందిస్తామని తేల్చిచెప్పారు. కోదండరాం, కాంగ్రెస్ నేతలది రాజకీయ ఎజెండా అని పేర్కొన్నారు. కోదండరామైనా.. కాంగ్రెస్ నేతలైనా ప్రాజెక్టులను అడ్డుకోవాలనుకునే వారు వారి మైండ్‌సెట్‌ను మార్చుకోవాలని సూచించారు. రాష్ట్రప్రయోజనాల కంటే.. రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నేతలు పాకులాడుతున్నారని మండిపడ్డారు. చట్టం ప్రకారమే ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు. వేగవంతంగా ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజలకు నీళ్లు ఇవ్వాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఉద్ఘాటించారు. సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకుంటున్నది ఎవరో రైతులు, ప్రజలు గమనిస్తున్నారని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ నేతలకు రైతులు, ప్రజలే సరియైన సమాధానం చెబుతారని చెప్పారు. రైతులు కష్టాల్లో ఉండాలని కాంగ్రెస్ నాయకులు కోరుకోవడం దురదష్టకరమని మంత్రి అన్నారు.



అసైన్డ్‌కు పట్టా

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. అసలు లబ్ధిదారుల స్వాధీనంలో ఉన్న భూములను గుర్తించి, వాటి యాజమాన్యంపై స్పష్టతనివ్వాలని, వారి పేరు మీద పాస్ పుస్తకాలు తయారు చేయాలని ఆదేశించారు. పాస్ పుస్తకాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రతీ ఎంట్రీని ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి తొందరపాటు అవసరం లేదని సీఎం చెప్పారు. వ్యవసాయ భూమి కలిగిన రైతుకు అదేగ్రామంలో వ్యవసాయేతర భూమి ఉంటే, ఆ వివరాలు కూడా పాస్ పుస్తకంలో నమోదు చేయాలని, అందుకోసం అదనపు కాలమ్ పెట్టాలని సూచించారు. పాస్ పుస్తకానికి ఆధార్ కార్డు నంబరు కూడా కచ్చితంగా అనుసంధానం చేయాలని చెప్పారు. మార్చి 11 రోజునే పట్టాదారు పాస్ పుస్తకాలన్నీ పంపిణీ చేసి తీరాలనే తొందరలో పొరపాట్లు జరగడానికి ఏమాత్రం ఆస్కారం ఇవ్వవద్దని, అసైన్డ్‌దారులకు సంబంధించిన పాస్ పుస్తకాల ముద్రణ కూడా పూర్తి కావడంతో పాటు, పాస్ పుస్తకంలో నమోదయ్యే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించడానికి కొంత సమయం తీసుకున్నా అభ్యంతరం లేదని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. భూ రికార్డులకు ఆధార్ కార్డు లింక్ చేయడానికి కొంతమంది ముందుకు రావడం లేదని, ఇప్పటికైనా వారు ఆధార్ కార్డు నంబర్ నమోదు చేయించుకోవాలని, లేనట్లయితే అట్టి భూములను బినామీ ఆస్తులుగా గుర్తించాల్సి వస్తుందని సీఎం పేర్కొన్నారు. కొత్త పాస్ పుస్తకాల పంపిణీపై ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి, ప్రభుత్వ సలహాదారు అనురాగ్ శర్మ, ముఖ్య కార్యదర్శులు నర్సింగ్ రావు, రాజేశ్వర్ తివారి, భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమం ప్రత్యేక అధికారి వాకాటి కరుణ, సీఎం కార్యదర్శి స్మితా సభర్వాల్ తదితరులు పాల్గొన్నారు. ''దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళన జరిగింది. ఈ అనేక పీటముడులున్న ఈ క్లిష్టమైన పనిని రెవెన్యూ అధికార యంత్రాంగం రేయింబవళ్లు ఎంతో శ్రమకోడ్చి విజయవంతం చేశారు. వారికి ప్రత్యేక అభినందనలు. రికార్డుల ప్రక్షాళన తర్వాత వచ్చిన వివరాలన్నీ ధరణి వెబ్ సైట్ లో నమోదు చేసే పని జరుగుతున్నది. ఆ వివరాల ఆధారంగా కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. సొంత భూమి కలిగిన రైతులతో పాటు ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూమిని సాగు చేసుకుంటున్న రైతుల వివరాలు కూడా సేకరించాలి. వారికి కూడా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలి. ఇందుకోసం కొంత సమయం పడుతుంది. అయినా ఫర్వాలేదు. కలెక్టర్లతో మాట్లాడి కచ్చితమైన వివరాలు తెప్పించాలి. అసైన్డ్ దారులకు కూడా భూమి యాజమాన్య హక్కులపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. పాస్ పుస్తకాల్లో నమోదయ్యే వివరాలను ఒకటి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీలించాలి. తొందరపాటులో పొరపాట్లు దొర్లే అవకాశం ఉంది. మార్చి 11నే పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించిన మాట నిజం. అయితే అసైన్డ్ భూముల యజమానులను గుర్తించడం, వివరాలను పరిశీలించడం, వ్యవసాయేతర భూముల వివరాలు కూడా నమోదు చేయడం లాంటి పనులన్నీ చేయడానికి కొంత సమయం పడుతుంది. పాస్ పుస్తకాల తయారీ పక్కాగా జరిగిన తర్వాతే పంపిణీ కార్యక్రమం చేపట్టాలి'' అని ముఖ్యమంత్రి చెప్పారు. ''భూ రికార్డులను పక్కాగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఆధార్ నెంబరును అనుసంధానం చేయాలని నిర్ణయించాం. మేడ్చల్, రంగారెడ్డితో పాటు కొన్ని జిల్లాల్లో కొందరు తమ ఆధార్ నంబరును అనుసంధానం చేయించుకోలేదు. అలాంటి వారు ఇప్పటికైనా అధికారులకు ఆధార్ నంబర్ ఇవ్వాలి. ఆధార్ నంబరు ఇవ్వని వారి భూములను బినామీలుగా గుర్తించే అవకాశం ఉంది'' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

మార్చి నెలాఖరు నాటికి అన్ని గ్రామాలకు మంచినీళ్లు..

ఈ ఏడాది మార్చి 31 నాటికి అన్ని గ్రామాలకు మంచినీళ్లు చేరాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. గ్రామాలకు పైపులైన్లు వేసుకుంటూనే సమాంతరంగా గ్రామాల్లో అంతర్గత పైపులైన్ల నిర్మాణ పనులు కూడా చేపట్టాలని సీఎం చెప్పారు. గ్రామాల్లో అంతర్గత పైపులైన్లు నిర్మించి, ఇంటింటికీ నల్లాలు బిగించి మంచినీళ్లు సరఫరా చేసే విషయంలో ఎమ్మెల్యేలు చొరవ చూపాలని సీఎం కోరారు. మార్చి చివరి నాటికి ఔటర్ రింగురోడ్డు లోపలి గ్రామాలన్నింటిలో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేయాలని అన్నారు. మిషన్ భగీరథపై ప్రగతి భవన్ లో శుక్రవారం సీఎం సమీక్ష నిర్వహించారు. మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, స్మితా సభర్వాల్, మిషన్ భగీరథ అధికారులు, వర్కింగ్ ఏజన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.



పట్టుబడిన ఇసుక లారీలు

కొండాపురం ర్యాంపులో కొండంత అవినీతి

- ఒక్కో లారీలో అదనపు ఇసుక రవాణా
- తనిఖీల్లో 13 ఇసుక లారీల పట్టివేత

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 23(మనం న్యూస్): గోదావరీ తీరంలో ఇసుక అక్రమ రవాణా యధేచ్ఛగా కొనసాగుతోంది. వెంకటాపురం మండలంలోని కొండాపురం ఇసుక రీచ్ కేంద్రంగా పది రోజులుగా సాగుతున్న ఇసుక రవాణాలో అనేక అక్రమాలు జరుగుతున్నాయి. గోదావరి సాక్షిగా ఈ ర్యాంపు నుంచి నిత్యం రవాణా అవుతున్న ఇసుక లారీల్లో పరిమితికి మించి ప్రతి లారీలో రెండు నుంచి మూడు టన్నుల ఇసుక అదనంగా రవాణా సాగుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా మారింది. దీంతో ర్యాంపులో ఒక్కో లారీకి అదనంగా రెండు నుండి మూడు టన్నులు అదనంగా నింపి ఇసుకను జారవేస్తున్నారు. అధికార టీఆర్ఎస్ పార్టీ ముసుగులో కొందరు నాయకులు ఈ ర్యాంపు నిర్వాహకులకు సహకరిస్తూ అధికారులను, రాజకీయ నాయకులను తాము చూసుకుంటామని చెప్పి సదరు కాంట్రాక్టరు నుంచి భారీ మొత్తంలో నగదు తీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొండాపురం ఇసుక ర్యాంపులో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా వ్యవహారంపై స్థానికులు ఇచ్చిన సమాచారంతో రెవిన్యూ అధికారులు తనిఖీలు చేపట్టగా.. అదనపు ఇసుక రవాణా వ్యవహారం వెలుగు చూసింది. వెంకటాపురం సమీపంలోని నూగూరు వే బ్రిడ్జి వద్ద మరో మారు అధికారులు కాటా వేయగా ఇసుక అక్రమ తరలింపు వ్యవహారం బయటపడింది. దీంతో 13 ఇసుక లారీలను రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని రెవిన్యూ కార్యాలయానికి తరలించారు. దీనిపై విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ రాములు పేర్కొన్నారు.

మార్చి 23న రాజ్యసభ ఎన్నికలు

- ఓటింగ్.. లెక్కింపు అదే రోజు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ నాటికి ఖాళీ అవుతున్న 58 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం షెడ్యూల్ ప్రకటించింది. ఈ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ మార్చి 5న నోటిఫికేషన్ విడుదల కానుంది. మార్చి 12 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. మార్చి 13న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. ఉపసంహరణకు మార్చి 15వరకూ గడువుగా ఎన్నికల సంఘం తెలిపింది. మార్చి 23న రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా అదే రోజున జరుగుతుంది. దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాలకు సంబంధించిన 58 మంది రాజ్యసభల పదవీ కాలం ఏప్రిల్‌తో ముగియనుంది. ఉత్తర ప్రదేశ్-10, బిహార్-6, మహారాష్ట్ర-6, మధ్యప్రదేశ్-5, పశ్చిమ బెంగాల్-5, కర్ణాటక-4, గుజరాత్-4, ఏపీ, తెలంగాణ, ఒడిశా, రాజస్థాన్‌లలో మూడు చొప్పున, జార్ఖండ్-2, ఛత్తీస్‌గఢ్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో ఒక్కొ స్థానం చొప్పున ఖాళీ అవుతున్నాయి. ఏపీ నుంచి చిరంజీవి, రేణుకా చౌదరి, దేవేందర్ గౌడ్‌లు, తెలంగాణ నుంచి సీఎం రమేశ్, రాపోలు ఆనంద భాస్కర్, పాల్వాయి గోవర్దన్ రెడ్డి(ఇది వరకే చనిపోయారు)ల పదవీ కాలం ఏప్రిల్‌లో ముగుస్తోంది. అలాగే కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, రవి శంకర్ ప్రసాద్, ధర్మేంద్ర ప్రధాన్, థావర్ చంద్ గెహ్లాట్, రామ్‌దాస్ అతవాలే కూడా రాజ్యసభ సభ్యత్వం కోల్పోతున్నారు. రాజ్యసభ నుంచి విరమణ పొందుతున్న వారిలో మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కూడా ఉన్నారు. షెడ్యూల్ విడుదల కావడంతో ఆయా పార్టీలు ఎన్నికలకు సమాయత్తం అవుతున్నాయి.

సొంతింటి కల సాకారం

(మొదటిపేజీ తరువాయి)

బోర్డు డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం బోర్డు డైరెక్టర్ల సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు బోర్డు కార్మికుని సొంతింటికల నెరవేర్చేలా ఉత్తర్వులను జారీ చేస్తున్నట్టు కంపెనీ చైర్మన్, ఎండీ ఎన్.శ్రీధర్ వెల్లడించారు.



వడ్డీ లేకుండా 10 లక్షల రుణం..

సొంతింటి పథకం ద్వారా సింగరేణిలో పనిచేస్తున్న (ఎన్‌సీడబ్ల్యుఏ) కార్మికులు ఎవరైనా సొంత ఇంటి నిర్మాణం కోసం బ్యాంకు ద్వారా రూ. 10 లక్షలు బ్యాంకు ద్వారా రుణం తీసుకుంటే, వడ్డీ సొమ్మును యాజమాన్యమే చెల్లిస్తుంది. ఇప్పటికే గృహ నిర్మాణం కోసం రుణం పొందిన వారికి కూడా ఈ సౌకర్యాన్ని వర్తింపచేయనున్నారు. ఎవరైనా ఉద్యోగి ఇప్పటికే కొంత రుణం తీసుకుని నెలవారీగా వడ్డీని, వాయిదా సొమ్మును చెల్లిస్తున్నట్లయితే ఇక నుంచి వారికి రూ. 10 లక్షలు రుణం వరకూ చెల్లించే వడ్డీ మొత్తాన్ని సింగరేణి తిరిగి కార్మికుడికి చెల్లిస్తుంది. ప్రభుత్వ బ్యాంకులైన ఎస్బీఐ వంటివి నిర్దేశించే వడ్డీరేటుతో, గరిష్ఠంగా రూ. 10 లక్షలు రుణానికి సంబంధించిన వడ్డీని కార్మికుడికి తిరిగి చెల్లిస్తుంది. సింగరేణి బోర్డు తీసుకున్న నిర్ణయంతో కంపెనీపై దాదాపు రూ. 120 కోట్ల నుంచి రూ. 130 కోట్ల మేర భారం పడనుంది.

క్వార్టర్లలో ఏసీ సౌకర్యం..

కార్మికుల కాలనీల్లోని క్వార్టర్లకు ఏసీ సౌకర్యం కల్పించే విధంగా యాజమాన్యం తొలి దశగా రూ. 15 కోట్లు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభించింది.

ఉద్యోగం వద్దనుకుంటే 25 లక్షలు..

మెడికల్ అన్‌ఫిట్ కేసులలో ఉద్యోగం ఉద్దనుకునే కార్మికులకు ఏక మొత్తంగా రూ. 25 లక్షలు సింగరేణి చెల్లించనుంది. ఏక మొత్తం వద్దనుకుంటే నెలనెలా రూ. 25 వేల చొప్పున చెల్లించే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఇప్పటికే దాదాపుగా 100 మందికి పైగా ఈ అవకాశాన్ని వినియోగించడానికి ముందుకు రాగా, ఈ ప్రక్రియను వేగం చేస్తున్నట్టు యాజమాన్యం పేర్కొంది.

సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు..

సింగరేణి ఉద్యోగుల తల్లిదండ్రులకు ఇక నుంచి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే సీఎం ఆదేశంపై యాజమాన్యం ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటి వరకు కార్మికుల తల్లిదండ్రులకు ఏరియాల్లోని ఆస్పత్రుల్లో మాత్రమే వైద్యసేవలందుతున్నాయి. ఇక నుంచి హైదరాబాద్ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తుంది.

అంబేద్కర్ జయంతికి సెలవు..

డాక్టర్ బీఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న జీతంతో కూడిన సెలవు దినంగా కంపెనీ ప్రకటించింది. అంతేకాకుండా రంజాన్, క్రిస్టమస్ పండుగలకు సెలవు దినాలుగా ప్రకటించి అమలు చేస్తుంది.

ఆరు కొత్త భూగర్భగనులు..

సింగరేణిలో ఆరు కొత్త భూగర్భగనులు ప్రారంభిస్తామని సీఎం చెప్పిన ప్రకటనపై యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి రంగం సిద్ధం చేస్తుంది. కొండాపురం, రాంపురం షాఫ్ట్‌బ్లాక్, మందమర్రి ఏరియాలోని కెకె-6గని, కాసిపేట-2గని, జయశంకర్ భూపల్లిపల్లి జిల్లాలో కేటీకే-5, కేటీకే-3 గనులను సీఎంచే ప్రారంభించేలా యాజమాన్యం ప్రణాళికలను రూపొందించనుంది. ఇవేకాకుండా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని సీఎండీ వివరించారు. బోర్డు డైరెక్టర్ల సమావేశంలో బొగ్గు మంత్రిత్వశాఖ డైరెక్టర్లు జెఎస్. బింద్ర, సయీద్ అస్రఫ్, రాష్ట్ర ప్రభుత్వ ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, రాష్ట్ర ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె. రామక్రిష్ణారావు,సింగరేణి డైరెక్టర్లు జె. పవిత్రన్ కుమార్, బి. భాస్కర్‌రావ్, చంద్రశేఖర్, ఎస్.శంకర్ పాల్గొన్నారు.



27న కోల్‌బెల్ట్‌లో సీఎం కేసీఆర్ పర్యటన!

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (మనం ప్రతినిధి) : రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 27న కోల్‌బెల్ట్‌లో పర్యటించనున్నట్టు తెలిసింది. సింగరేణి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో కార్మికుల సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్న క్రమంలో సీఎం పర్యటన దాదాపుగా ఖరారైనట్టేనని టీబీజీకేఎస్ నాయకులు పేర్కొంటున్నారు. సీఎం పర్యటనకు సింగరేణి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఆరు గనులను సీఎం చేత ప్రారంభించేలా అధికారులు ప్రణాళికలను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. సింగరేణిలో గుర్తింపుసంఘం ఎన్నికల అనంతరం తొలిసారిగా సీఎం పర్యటనకు రానుండటంతో కార్మికులు ఆయన ప్రకటించే వరాలపై ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. శుక్రవారం జరిగిన సింగరేణి డైరెక్టర్ల బోర్డు మీటింగ్‌లో కార్మికుల సొంతింటి కలను నెరవేర్చే విధంగా యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. శ్రీరాంపూర్, మంచిర్యాల ప్రాంతాల్లో ఈ నెల 27,28 తేదీల్లో సీఎం పర్యటించే అవకాశం ఉందని సింగరేణి అధికారులు పేర్కొంటున్నారు. కారుణ్య నియామకాలపై సీఎం ఆశాజనకమైన నిర్ణయం ప్రకటిస్తారని కార్మికులు ఎదురుచూస్తున్నారు.

నగరంలో బయోకాన్ పరిశోధన కేంద్రం


(మొదటిపేజీ తరువాయి)



జనరల్లతో సమావేశం అయ్యారు. బయోటెక్నాలజీ దిగ్గజం బయోకాన్ సంస్థ 'బయోటెక్ నగరంలో' తన పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేసింది. బయోకాన్ ఎండీ కిరణ్ మజుందార్ షాతో సమావేశం అయ్యారు. జినోమ్ వ్యాలీలో బయోకాన్ నూతన పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ) సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు అమె మంత్రికి తెలిపారు. తమ అనుబంధ కంపెనీ అయిన సింజెన్ ద్వారా ఈ యూనిట్ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ యూనిట్ ద్వారా 1000 హైస్కిల్డ్ ఉద్యోగాలు వస్తాయన్నారు. దీంతోపాటు బయోకాన్లోని సిబ్బందిని రెట్టింపు చేస్తామని తెలిపారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో అందిస్తామని అమె మంత్రికి తెలిపారు. బయోకాన్ నూతన యూనిట్ ఏర్పాటును స్వాగతించిన మంత్రి కేటీఆర్ కిరణ్ మజుందార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం తరపున టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగంలో మంత్రి చేస్తున్న కార్యక్రమాలకు అభినందనలు తెలిపారు. ఫార్మసిటీ ఏర్పాటు గురించి మంత్రి వివరించారు. భవిష్యత్తు విస్తరణకు ఫార్మాసిటీని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. హైదరాబాద్ స్టార్టప్ ఈకో సిస్టమ్ గురించి ప్రస్తావించిన మంత్రి రానున్న కిరణ్ మజుందార్ హైదరాబాద్ ఎర్యటనలో నగరంలోని 20 టాప్ స్టార్టప్స్ తో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. హైదరాబాద్ నగరం భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరింత పురోగతి సాధించేందుకు అయారంగాల్లోని నిపుణులు, పరిశ్రామిక వేత్తులు, ప్రభుత్వాధికారులతో కూడిన ఒక కమీటీని ఏర్పాటు చేయాలని కిరణ్ మజుందార్ సూచించారు. కాగా, జీఈ (సస్టెయినబుల్ హెల్త్ కేర్ సొల్యూషన్స్) ప్రెసిడెండ్, సియివో టెర్రీ బ్రెసెన్హమ్ తో మంత్రి సమావేశం అయ్యారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న టివర్క్స లో జీఈ భాగస్వాములవుతున్నదని ఈ సందర్భంగా మంత్రి ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వ జీనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేయనున్న ఇంక్యుబేటర్ లో జీఈ భాగస్వాములవ్వాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ టాస్కతో కలిసి హెల్త్ కేర్ స్కిల్లింగ్ కార్యక్రమాలను చేపట్టేందుకు జీఈ సిద్ధంగా ఉన్నదని టెర్రీ వెల్లడించారు. అనంతరం థాయ్ లాండ్ ఉప వాణిజ్య శాఖ మంత్రి చుటిమా బున్యాప్రఫసారా, భారతదేశంలో ఇటాలియన్ కాన్సుల్ జెనరల్ ఇన్ ముంబాయి స్టేఫానియా కస్టాన్జా తో మంత్రి సమావేశం అయ్యారు. భాద్యతలు చేపట్టిన తర్వతా హైదరాబాద్ నగరంలో తొలిసారి పర్యటిస్తున్న తనకు ఇక్కడి టెక్స్ టైల్ రంగం, ఫార్మా, సినిమా పరిశ్రమ అనుబంధ రంగాలలో పెట్టుబడులు అవకాశాలపైన అలోచిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా బయోటెక్ రంగంలో ఇటలీ దేశ ఇకో సిస్టమ్ తో ఇక్కడ కంపెనీలతో కలిసి పనిచేసే అవకాశాలపై అనేక కంపెనీలు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. మెర్క్ లైఫ్ సైన్సెస్ సీఈవో ఉదిత్ భాత్రా, నోవార్టిస్, డెలాయిట్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి సమావేశం అయ్యారు.

లైఫ్ సైన్సెస్‌లో ఆవిష్కరణలు జరగాలి: కేటీఆర్

లెఫ్ సైన్సెస్‌లో ప్రజలకు ఉపయోగపడే కొత్త కొత్త ఆవిష్కరణలు జరగాలని, తక్కువ ధరల్లో వారికి అందుబాటులోకి రావాలని మంత్రి కేటీఆర్ అన్నారు. దేశంలోనే అతిపెద్ద ఫార్మా క్లస్టర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోతున్నామని, జీనోమ్ వ్యాలీని మరింత విస్తరిస్తామని అన్నారు. దీని ద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తుందని, ఫార్మా, లైఫ్ సైన్సెస్, బయోటిక్ రంగాల్లో పరిశోధనలు పెరుగుతాయన్నారు. నగరంలో నెలకొల్పే ఫార్మా కంపెనీలకు కావాల్సిన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు. సదస్సు రెండో రోజు ''ద ప్రిస్కిప్షన్ ఫర్ ప్రోగ్రెస్- ఇండియన్ లైఫ్ సైన్సెస్ గ్రోత్'' అనే అంశంపై జరిగిన చర్చలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కోసం బడ్జెట్‌లో భారత ప్రభుత్వం 0.83 శాతాన్ని కేటాయిస్తుందని, రిస్క్‌తో కూడుకున్న వాటిలో ప్రభుత్వం పెట్టుబడులు పెట్టడానికి అంతగా ఆసక్తి చూపదన్నారు. భారత్ వంటి ఎదుగుతున్న దేశానికి కొత్త ఆవిష్కరణలు జరిగితే భారతీయ ప్రజలకు, దేశానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంతేకాదు కొత్తతరానికి అవకాశాలు ఇవ్వాలని, స్టార్టప్‌లను ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలతో జతకట్టి పరిశోధనలకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డీస్ ల్యాబ్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, నోవార్టిస్ కంట్రీ ప్రెసిడెంట్ జావెద్ జియా, హెడ్ ఆఫ్ టీఏ డయాబెటిస్ రీసెర్చ్ అండ్ జర్మన్ హబ్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ ఫిలిప్ లార్సెన్, యూఎస్ అండ్ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ సెక్టార్ లీడర్, వైస్‌చైర్మన్ గ్రెగోరి రె పాల్గొన్నారు. ఎక్తా భట్రా ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



సినిమాలు బంద్!

(మొదటిపేజీ తరువాయి)

సంస్థలు సినిమా నిర్మాతల నుంచి సినిమా ప్రదర్శనలకు అధిక ధరలు వసూలు చేస్తున్నాయని నిర్మాతలు, ప్రదర్శకులు ఆరోపిస్తున్నారు. దీనికి ఓ పరిష్కారం కావాలని దక్షిణాది రాష్ట్రాల సినీ నిర్మాతల ఐక్య కార్యాచరణ సమితి నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయి. దాంతో.. మార్చి 2 నుంచి దక్షిణాది రాష్ట్రాల్లో సినిమాల ప్రదర్శనలను నిలిపివేయాలని నిర్మాతలు, పంపిణీదారులు నిర్ణయించారు. బెంగళూరులోని ఫిలిం చాంబర్‌లో సినీ నిర్మాతల, పంపిణీదారుల ఐక్య కార్యాచరణ సమితి శుక్రవారం సమావేశమైంది. క్యూబ్, యూఎఫ్‌ఓల వాళ్లు అధిక ధరలు వసూలు చేస్తున్నారనే అంశాన్ని చర్చించారు. థియేటర్లలో సినిమాల ప్రదర్శనకు ఆ సంస్థలు వసూలుచేస్తున్న ధరలు తగ్గించాలని నిర్మాతల మండలి కోరింది. దానికి క్యూబ్, యూఎఫ్ఓ ప్రతినిధులు అంగీకరించకపోవడంతో మార్చి 2 నుంచి సినిమాల ప్రదర్శన నిలిపివేయాలని నిర్ణయించారు.

త్వరలోనే పాక్‌కు బుద్ధి చెబుతాం

- సుంజవా దాడికి మూల్యం తప్పదు
- ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్



న్యూఢిల్లీ/జమ్ము, ఫిబ్రవరి 23: జమ్ములోని సుంజవా ఆర్మీ శిబిరంపై దాడికి పాకిస్థాన్ మూల్యం చెల్లించక తప్పదని భారత ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ హెచ్చరించారు. ఆ దేశం చేసిన దురాగతానికి త్వరలోనే భారత ఆర్మీ బుద్ధి చెబుతుందని చెప్పారు. ఈ నెల 10న పాక్ ప్రేరేపిత జైషే మహ్మద్ ఉగ్రవాదులు సుంజవా ఆర్మీ క్యాంపుపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఆరుగురు జవాన్లు, ఓ సైనికుడి తండ్రి ప్రాణాలు కోల్పోయారు. ఈ తరహా దాడులను పాకిస్థాన్ ఓ యుద్ధంలా భావిస్తోం దని, వీటిని తిప్పికొట్టేందుకు సర్జికల్ స్ట్రైక్స్ సహా పలు ప్రత్యామ్నాయాలు ఉన్నాయని బిపిన్ రావత్ హెచ్చరించారు. భారత్ కాల్పుల విరమ ణను ఎల్లప్పుడూ గౌరవిస్తుందని, అయితే నియంత్రణ రేఖ గుండా పాక్ ఉగ్ర చొరబాట్లకు కళ్లెం వేసినప్పుడే శాంతియుత వాతావరణం నెల కొంటుందని ఆయన చెప్పారు. గత ఏడాది కాల్పుల విరమణ ఒప్పందానికి పాక్ రికార్డు స్థాయిలో తూట్లు పొడించిందన్నారు. 2016లో 271 సార్లు సరిహద్దుల్లో కాల్పులకు తెగబడిన పాక్... 2017లో 860 సార్లు ఈ దుశ్చర్యకు పాల్పడిందని పేర్కొన్నారు. కాగా, సోపియన్‌లో రాళ్ల దాడులు చేసి అల్లరి మూకల పై కాల్పుల ఘటనపై స్పందిస్తూ ఆర్మీ సిబ్బంది తప్పనిసరి పరిస్థితుల్లోనే కాల్పుల వరకూ వెళ్లారని చెప్పారు. ముందుగా వారు గాలిలోకి కాల్పులు జరిపారని స్పష్టం చేశారు. కాగా, ఉగ్రదాడుల్లో అమరులైన సైనికుల కుటుంబసభ్యుల వేదనను మీడియాలో చూపించొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ''పత్రికలు, చానళ్లు కేవలం ఉగ్రదాడుల్లో అమరులైన వారిపైనే దృష్టి పెడుతున్నాయి. మాకు సైనికులంతా సమానమే. పాక్ ఉగ్రవాదులను ఎదుర్కొన్న తీరునే గొప్పగా చూపుతున్నారు. కానీ, సియాచిన్‌లో మంచు చరియలు విరిగిపడి అమరులైన సైనికుల త్యాగాలనూ గుర్తించాలి'' అని సూచించారు.

సరిహద్దులో పాక్ బంకర్ ధ్వంసం



జమ్ము, ఫిబ్రవరి 23: జమ్ము కశ్మీర్‌లోని సరిహద్దు వెంబడి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన పాక్‌కు భారత్ తగిన గుణపాఠం నేర్పింది. పూంచ్ జిల్లాలోని మెంధర్ సెక్టార్‌లో నియంత్రణ రేఖను ఆనుకుని ఉన్న పాక్ ఆర్మీ బంకర్‌ను భారత బలగాలు ధ్వంసం చేశాయి. ఈ శిబిరం వద్ద నుంచి పదేపదే పాక్ కాల్పులకు తెగబడుతుండడంతో మన ఆర్మీ సమర్థవంతంగా తిప్పికొట్టింది. అయితే ఈ ఘటనలో ఇరువైపులా ప్రాణ నష్టం జరగలేదని తెలుస్తోంది.

కమల్ సమర్థుడు

- ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తారు
- మా దారులు వేరేనా లక్ష్యం ఒక్కటే
- 'ఎంఎన్ఎం'పై రజనీకాంత్ వ్యాఖ్యలు



చెన్నై, ఫిబ్రవరి 23: మక్కళ్ నీతి మయ్యమ్ (ఎంఎన్ఎం) పార్టీని స్థాపించిన ప్రముఖ నటుడు కమల్ హాసన్‌ను తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రశంసించారు. కమల్ సమర్థుడని, ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తారని అన్నారు. గురువారం మధురై జరిగిన బహిరంగ సభలో కమల్ తన పార్టీ పేరును మక్కళ్ నీతి మయ్యమ్‌గా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై రజనీ స్పందిస్తూ.. తమ ఇద్దరి దారులు వేరేనా, అంతిమ లక్ష్యం ప్రజాసంక్షేమం మాత్రమేనని అన్నారు. రాజకీయ అరంగేట్రం చేసిన కమల్‌కు ఇదివరకే శుభాకాంక్షలు చెప్పానని, ఎంఎన్ఎం స్థాపన సందర్భంగా మరోసారి తెలిపానని వెల్లడించారు. కాగా నిరుడు డిసెంబరులో రజనీ కూడా రాజకీయాల్లోకి వస్తున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇటీవల రజనీతో రహస్యంగా సమావేశమై తన రాజకీయ ప్రవేశం గురించి చర్చించినట్టు ఓ తమిళ వీక్లీకి రాసిన వ్యాసంలో కమల్ పేర్కొన్నారు. తమిళనాడులో ఇద్దరు సమకాలీన సుప్రసిద్ధ నటులు ఒకేసారి రాజకీయాల్లోకి రావడం హాట్ టాపిక్‌గా మారింది. ఇద్దరూ కలసి పనిచేస్తారని, పొత్తు పెట్టుకుంటారని కూడా వార్తలు వెలువడ్డాయి. అయితే రజనీ రాజకీయాలు కాషాయంతో (హిందుత్వం) ముడిపడకుండా ఉంటే పొత్తుకు సిద్ధమని కమల్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇద్దరి రాజకీయ ప్రయాణం ఎలా ఉంటుంది, ఏ నిర్ణయం తీసుకుంటారన్న దానిపై తమిళనాట ఆసక్తి నెలకొంది.

'ఉగ్ర నిధుల' జాబితాలో పాక్!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. చివరి నిమిషంలో చైనా తన అభ్యంతరాలను వెనక్కి తీసుకోవడంతో పాక్‌ను 'టెర్రర్ ఫైనాన్సింగ్ వాచ్‌లిస్ట్'లో చేరింది. అంతర్జాతీయ మనీ లాండరింగ్ వాచ్‌డాగ్ సంస్థగా పేరొందిన 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్-ఫేట్) సంస్థ పాక్ నుంచి భారీగా ఉగ్రవాద సంస్థలకు నిధులు వెళ్తున్నాయని అనుమానిస్తోంది. ఇందుకు తగిన ఆధారాలను సేకరించింది. అదే విధంగా తాము పాక్‌కు ఇస్తున్న నిధుల్లో చాలా వరకు పక్కదారి పడుతున్నాయని అమెరికా భావిస్తోంది. ఇదే విషయమై భారత్ కూడా కొంతకాలంగా వాదనలు చేస్తోంది. అయితే.. 35 దేశాలతో కూడిన ఫేట్ సంస్థ 'ఉగ్ర నిధుల సరఫరా జాబితా'లో పాక్‌ను చేర్చాలని భావించగా.. చైనా, సౌదీ అరేబియా, టర్కీలు అడ్డుగా నిలిచాయి. చైనా అనేక అభ్యంతరాలు లేవనెత్తింది. అయితే.. అంతర్జాతీయ ఒత్తిడికి తలొగ్గి చైనా తన అభ్యంతరాలను వెనక్కి తీసుకోవడంతో పాక్‌ను జాబితాలో చేర్చడం సులువైంది. ఈ పరిణామం పాక్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుందని నిపుణులు పేర్కొంటున్నారు.

సీఎం ఇంట్లో పోలీసుల సోదాలు

- ఇంట్లో అంగుళం అంగుళం గాలింపు
- సీఎస్ అన్షు ప్రకాశ్‌పై దాడి కేసులో.. సీసీపుటేజ్ సహా ఆధారాల సేకరణ
- ముఖ్యమంత్రి నివాసంలో దౌర్జన్యమా?
- కేజ్రీవాల్‌ను అవమానించే ప్రయత్నమే
- ఢిల్లీ ప్రభుత్వ అధికార ప్రతినిధి ఆరోపణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ఢిల్లీ సీఎస్ అన్షు ప్రకాశ్‌పై దాడి కేసు తాజాగా మరో మలుపు తిరిగింది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలను అదుపులోకి తీసుకున్న పోలీసులు శుక్రవారం ఏకంగా సీఎం కేజ్రీవాల్ ఇంట్లో సోదాలు జరిపారు. దాడి ఘటనకు సంబంధించి ఆధారాల సేకరణకు సివిల్ లైన్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సోదాలు జరిపి సీసీటీవీ ఫుటేజ్ ఉన్న హార్డ్ డిస్క్ సహా ఇతరత్రా సాక్ష్యాలను సేకరించినట్లు తూర్పు ఢిల్లీ అదనపు డీసీపీ హరీందర్ సింగ్ తెలిపారు. సీఎం నివాసంలో మొత్తం 21 సీసీటీవీ కెమెరాలు ఉండగా.. అందులో 14 కెమెరాలు పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ కెమెరాల పుటేజిలను పరిశీలించేందుకు హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అయితే, సీఎస్‌పై దాడి జరిగిందని భావిస్తున్న గదిలో సీసీ కెమెరా లేదని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై సీఎం కేజ్రీవాల్ స్పందిస్తూ.. పెద్ద సంఖ్యలో నా ఇంటికి వచ్చిన పోలీసులు మొత్తం భవనాన్ని క్షుణ్ణంగా శోధించారు. రెండు చెంప దెబ్బలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపైన ఏకంగా ఓ ముఖ్యమంత్రి భవనం మొత్తాన్ని పరిశీలించారు. కానీ జస్టిస్ లోయా మరణానికి అమిత్ షాకు మధ్య ఉన్న సంబంధాన్ని ఎన్నడు ప్రశ్నిస్తారంటూ ట్వీట్ చేశారు. ఈ విషయంపై తమ మంత్రుల బృందం లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌ను కలవనుందని సీఎం వివరించారు. అదే సమయంలో బ్యూరోక్రాట్లందరూ ఆప్ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలంటూ ఎల్జీ బైజాల్‌ను మంత్రుల బృందం విజ్ఞప్తి చేయనుందని ఓ అధికారి తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు..

సుమారు అరవై నుంచి డెబ్బై మంది పోలీసులు సీఎం ఇంటిని చుట్టుముట్టి ఎలాంటి సమాచారం లేకుండానే ఇంట్లోకి ప్రవేశించారని ఢిల్లీ ప్రభుత్వ అధికార ప్రతినిధి అరుణోదయ ప్రకాశ్ పేర్కొన్నారు. సీఎం కేజ్రీవాల్ ఇంటిని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకొని, సోదాలు జరిపారని ఆరోపించారు. ఇంట్లో నలుమూలలకూ జబర్దస్తీగా వెళ్లి తనిఖీలు చేశారని విమర్శించారు. ఢిల్లీ పోలీసులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆయన మండి పడ్డా రు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజ లు ఓట్లేసి గెలిపించుకున్న సీఎం నివాసంలోనే పోలీసులు ఇంత దౌర్జన్యంగా వ్యవహరిస్తే.. ఇక సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతీ పౌరుడికీ కొన్ని హక్కులు ఉంటాయని, రాజ్యాంగం ప్రసాదించిన ఈ హక్కులను ఉల్లంఘించడమేంటని ఆయన నిలదీశారు. ఈ మొత్తం ప్రక్రియ వెనక సీఎం కేజ్రీవాల్‌ను అవమానించలన్నదే ముఖ్య ఉద్దేశమని మండిపడ్డారు. సామాన్యుల సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేస్తున్న ముఖ్యమం త్రిని అవమానంపాలు చేయాలన్న ప్రయత్నమేనని అరుణోదయ ప్రకాశ్ వివరించారు. కాగా, సీఎం అరవింద్ కేజ్రీవాల్ సలహాదారు వీకే జైన్‌పై ఢిల్లీ పోలీసులు పెద్ద ఎత్తున ఒత్తిడి తెచ్చారని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఆరోపిం చింది. ఆప్ నేతలు అశుతోష్, సంజయ్ సింగ్ శుక్రవారం మాట్లాడుతూ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు జిత్తులమారి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ కేంద్రం చేతిలో బొమ్మలా మారారని అశుతోష్ ఆరోపించారు. ఢిల్లీ రాష్ట్ర మంత్రి ఇమ్రాన్ హుస్సేన్, ఢిల్లీ డైలాగ్ కమిషన్ వైస్ చైర్మన్ అశిష్ ఖేతాన్‌లపై దాడి జరిగినట్లు సాక్ష్యాధారాలను సమర్పించినప్పటికీ చర్యలు తీసుకోవడంలేదన్నారు. అనిల్ బైజాల్ బీజేపీ ఏజెంటుగా వ్యవహరిస్తున్నారని, ఆయన రాజ్యాంగానికి విధేయుడిగా నడచుకోవడంలేదని ఆరోపించారు.




సీఎం కేజ్రీవాల్ నివాసం వద్ద పోలీసులు

> రెండు చెంప దెబ్బల ఆరోపణలకే భారీ బలగంతో వచ్చి నా(ఓ ముఖ్యమంత్రి) ఇంట్లో అంగుళం అంగుళం వెతికారు. ఇటీవల మరణించిన జస్టిస్ లోయా కేసు విషయంలో పోలీసులు అమిత్ షాను ఎప్పుడు ప్రశ్నిస్తారో?
>
> **-ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్**

మారిన వాంగ్మూలం వెనక ఒత్తిడి?

కేజ్రీవాల్ సలహాదారు వీకే జైన్ మొదట పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో సీఎస్ అన్షు ప్రకాశ్‌పై దాడి జరిగిన సమయంలో తాను బాత్రూమ్‌లో ఉన్నట్లు జైన్ చెప్పారని సంజయ్ సింగ్ తెలిపారు. గదిలో ఏంజరిగిందో తనకు తెలియదన్నారు. కానీ పోలీసులు తాజాగా చెప్తున్నదాని ప్రకారం జైన్ వాంగ్మూలం మారిందన్నారు. తాను బాత్రూమ్ నుంచి తిరిగి సమావేశపు గదిలోకి వెళ్ళేటప్పటికి సీఎస్ తన కళ్ళజోడుకోసం వెతుకుతూ ఉండటం చూశానని, ఆయనపై దాడి జరిగినట్లు తనకు అనుమానం కలిగిందని జైన్ చెప్పినట్లు పోలీసులు చెప్తున్నారన్నారు. జైన్ తన వైఖరిని ఒక రోజులోనే ఎందుకు మార్చుకున్నారని ప్రశ్నించారు. ఆయన తన స్టేట్‌మెంట్‌ను మార్చుకునేలా నిర్బంధించడం వెనుక ఎవరి ఒత్తిడి ఉందని నిలదీశారు. జైన్‌ను ఢిల్లీ పోలీసులు గురువారం ఉదయం తీసుకెళ్ళారని, ఆయన తన స్టేట్‌మెంట్‌ను మార్చుకునే విధంగా ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. మోదీ ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా సీఎంను అవమానించేందుకే పోలీసులు గుండాగిరి చేశారని మండిపడ్డారు.

నిబంధనల ప్రకారమే..

ఆప్ నేతల ఆరోపణలను ఢిల్లీ పోలీసులు తోసిపుచ్చారు. ఢిల్లీ పోలీసు విభాగం ప్రధాన అధికార ప్రతినిధి దీపేంద్ర పాఠక్ మాట్లాడుతూ తమ శాఖ కేవలం నిబంధనలు, విధానాలను మాత్రమే పాటిస్తోందని తెలిపారు. సక్రమమైన విధానాన్ని పాటిస్తూ, మొదటి స్టేట్‌మెంట్‌ను పోలీసులు నమోదు చేశారని, అనంతరం కోర్టులో స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారని తెలిపారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఐఏఎస్ సంఘం

సీఎస్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలంటూ ఐఏఎస్ అధికారుల బృందం కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. జాతి ప్రయోజనాల కోసం తమ శక్తియుక్తులను వినియోగించడానికి తామంతా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని సంఘం నేతలు తెలిపారు. ఈ క్రమంలో తమ సామర్థ్యాన్ని కేంద్రీకరించి పనులు పూర్తిచేస్తామని ఢిల్లీ ఐఏఎస్ అధికారుల సంఘం కార్యదర్శి మనీష సక్సేనా పేర్కొన్నారు. ఈ కేసు విషయంలో మంత్రి సానుకూలంగా స్పందించారని, తమకు పూర్తి మద్దతిస్తానని చెప్పారన్నారు.

అలాంటి వారిని కొట్టాల్సిందే!

- ఆప్ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: సాధారణ ప్రజల పనులను నిలిపివేసి ఇబ్బందులకు గురిచేసే అన్షు ప్రకాశ్ లాంటి అధికారులను కొట్టాల్సిందేనని ఆప్ ఎమ్మెల్యే నరేష్ బల్యాన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉత్తమ్ నగర్‌లో జరిగిన ర్యాలీలో బల్యాన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తమపై తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. అలాంటి అధికారులను కొట్టాల్సిందేనని అన్నారు. వారికి బుద్ధి చెప్పే విధానం ఇదేనని సెలవిచ్చారు. ఢిల్లీ సీఎస్‌పై దాడి ఘటనలో అరెస్టయిన ఎమ్మెల్యేలు అమానతుల్లా ఖాన్, ప్రకాశ్ జర్వాల్‌ల బెయిల్ పిటిషన్లను ఢిల్లీ కోర్టు తోసిపుచ్చింది. వారిని 14 రోజుల పాటు జ్యుడిషియల్ కస్టడీకి తరలించాలని ఆదేశించిన విషయం తెలిసిందే!



మైనర్‌కు ముద్దు.. చిక్కుల్లో సింగర్!

ముంబై, ఫిబ్రవరి 23: ప్రముఖ సింగర్ పాపోన్ చిక్కుల్లో పడ్డారు. ఓ మ్యూజిక్ రియాల్టీ షోలో న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్న అతను.. ఓ బాలికను ముద్దు పెట్టుకున్న వీడియో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. దీంతో అతనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాపోన్‌గా పేరుపొందిన మహంతా ఓ చానెల్ లో ప్రసారమవుతున్న 'వాయిస్ ఇండియా కిడ్స్' ప్రోగ్రాంలో న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్నాడు. ఈ షోకి షాన్, హిమేష్ రేష్మియాలు కూడా జడ్జిలు. మంగళవారం ప్రత్యేక ఎపిసోడ్‌ను చిత్రీకరించారు. ఈ సందర్భంగా పాపోన్ ఓ బాలిక ముఖానికి రంగు పూసి పెదాలపై ముద్దాడాడు. ఆ వ్యవహారమంతా ఫేస్‌బుక్ లైవ్‌లో టెలికాస్ట్ అయ్యింది. ఈ వీడియోపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు న్యాయవాది రునా భుయాన్.. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంఘంలో ఫిర్యాదు చేశాడు. పోక్సో యాక్ట్ కింద పాపోన్‌పై లైంగిక దాడి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఆ బాలిక తండ్రి మాత్రం సింగర్ పాపోన్‌కు అండగా నిలచాడు. సింగర్ ముద్దుపెట్టుకోవడంలో ఎలాంటి దురుద్దేశం లేదని అన్నారు.

కొట్టి చంపి.. సెల్ఫీ తీసుకున్నారు!



పాలక్కాడ్, ఫిబ్రవరి 23: అతనో మతి స్థిమితం లేని వ్యక్తి. కానీ.. దొంగ అని అనుమానించారు. పట్టుకొన్నారు. కట్టేశారు. చావబాదారు. అది చాల దన్నట్టు.. ఆ యువ కుడిని చితకబాదుతూ సెల్ఫీలు తీసుకున్నారు. ఇదీ, కేరళలోని అట్టాపాడిలోగల ముక్కాలికి సమీపంలోని ఓ గిరిజన తండాలో జరిగిన దారుణ, అమానవీయ ఘటన. గురువారం జరిగిన ఈ అమానుష, అమానవీయ దాడిలో మధు(27) అనే గిరిజన యువకుడు దుర్మరణం చెందాడు. కదుకుమ్మణలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆ యువకుడిని కొందరు స్థానిక డ్రైవర్లు పట్టుకున్నారు. అక్కడి నుంచి ఓ వాహనంలో ముక్కాలిలోని ఓ నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లారు. అక్కడే అతడిని చితకబాదారు. ఆ క్ర మంలోనే కొందరు స్థానికులు... ఆ ఘటనను ఆపాల్సింది పోయి చక్కగా సెల్ఫీలు తీసుకున్నారు.

ఉమ్మడి పోరాటం


- ఉగ్రవాదంపై భారత్, కెనడా పోరాడాలి
- సార్వభౌమత్వాన్ని సవాల్ చేస్తే సహించం
- వేర్పాటువాదులకు చోటు లేదు: మోదీ
- భారత్ మాకు సహజ భాగస్వామి: ట్రూడూ
- కీలక అంశాలపై ఇరు దేశాల ప్రధానుల చర్చ
- భారత్, కెనడా మధ్య కుదిరిన 6 ఒప్పందాలు



రాష్ట్రపతి భవన్‌లో ట్రూడూ దంపతులతో ప్రధాని నరేంద్రమోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: భారత్, కెనడా కలసి ఉగ్రవాదంపై పోరాడాలని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను ఎవరైనా సవాల్ చేస్తే సహించబోమని హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాలకు మతాన్ని దుర్వినియోగం చేసే వారికి, వేర్పాటు వాదాన్ని ప్రోత్సహించేవారికి చోటు ఉండరాదని పేర్కొన్నారు. భారత పర్యటనకు వచ్చిన కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోతో మోదీ సమావేశమై కీలక అంశాలపై రెండు గంటల పాటు సుదీర్ఘంగా చర్చించారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం నుంచి ఎదురవుతున్న సవాళ్లు, వాణిజ్య ఒప్పందాల గురించి ఇద్దరూ చర్చించారు. ఇంధన సహకారం సహా ఆరు ఒప్పందాలపై ఇరు దేశాల సంతకాలు చేశాయి. అనంతరం ఇద్దరూ సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. భారత్, కెనడా సార్వభౌమత్వాన్ని ధిక్కరించేవారిని సహించబోమని మోదీ అన్నారు. ఇరు దేశాల ద్వైపాక్షిక భాగస్వామ్యంపై సమగ్రంగా చర్చించినట్టు తెలిపారు. భారత్‌లో పలు ప్రాంతాలను కెనడా ప్రధాని సందర్శించారని, దేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని ఆయన అనుభవపూర్వకంగా గ్రహించివుంటారని మోదీ పేర్కొన్నారు. ట్రూడో మాట్లాడుతూ.. వాణిజ్య సహకారంలో భారత్ తమకు సహజ భాగస్వామి అని అభివర్ణించారు. కాగా ఇటీవల ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఖలిస్థాన్ వేర్పాటువాద ఉగ్రవాది పక్కన నిల్చుని ట్రూడో భార్య సోఫీ గ్రెగోరి ఫొటో దిగడంపై విమర్శలు వచ్చాయి. పంజాబ్ మంత్రి మల్కియత్ సింగ్ సిద్ధూపై హత్యాయత్నం కేసులో 20 ఏళ్ల శిక్ష పడ్డ నిషేధిత అంతర్జాతీ సిక్కు యువజన సమాఖ్య సభ్యుడు అత్వాల్‌ను ట్రూడో పాల్గొనాల్సిన విందుకు ఆహ్వానించడంపై దుమారం చెలరేగింది. ఈ అంశాలతో పాటు కెనడాలోని ఖలిస్థాన్ అనుకూల గ్రూపుల పట్ల సానుకూల వైఖరి అవలంభిస్తున్నారన్న విమర్శలపై ట్రూడో స్పందించారు. అత్వాల్‌ను విందుకు ఆహ్వానించలేదని, ఈ విషయం తనకు తెలియగానే ఆహ్వానాన్ని రద్దు చేశామని ట్రూడో వివరణ ఇచ్చారు. అంతకుముందు కెనడా ప్రధానితో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ సమావేశమై.. ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్చించనట్టు ఆ శాఖ ప్రతినిధి రవీశ్ కుమార్ తెలిపారు.

ధనుష్ క్షిపణి ప్రయోగం సక్సెస్



బాలాసోర్(ఒడిసా), ఫిబ్రవరి 23: అణ్వస్త్ర సామర్థ్యంగల ధనుష్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు భారత నౌకాదళం ప్రకటించింది. ఒడిసా తీరంలో ఓ యుద్ధ నౌక నుంచి ఈ క్షిపణిని ప్రయోగాత్మకంగా పరీక్షించినట్లు తెలిపింది. ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయాణించే ఈ క్షిపణి 350 కిలోమీటర్ల(నేల మీద కానీ నీటి మీద కాని) దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగలదని అధికారులు వెల్లడించారు. సుమారు 500ల కిలోల పేలోడ్‌ను మోసుకెళ్లగల సామర్థ్యం ధనుష్ మిస్సైల్ సొంతమని చెప్పారు. ప్రస్తుత ప్రయోగం భారత నావికా దళ శిక్షణలో ఒక భాగమని వివరించారు. డీఆర్‌డీవో రూపొందించిన ఐదు క్షిపణులలో ధనుష్ కూడా ఒకటి.. అయితే, ఈ క్షిపణిని గతంలోనే రక్షణ శాఖకు అప్పగించినట్లు తెలిసింది. గతంలో 2015 ఏప్రిల్ 9న ఈ క్షిపణిని చివరిసారిగా పరీక్షించి చూసినట్లు అధికారులు తెలిపారు. దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన పృథ్వి క్షిపణికి కొన్ని మార్పులు చేసి నౌకాదళ వినియోగానికి అనుకూలంగా ధనుష్‌ను తయారుచేసినట్లు సమాచారం. కాగా, శుక్రవారం ఉదయం 10:52 నిమిషాలకు పారదీప్ సమీపంలో భారత నావికా దళ అధికారులు ఈ ప్రయోగం నిర్వహించారు.

రైల్వే స్టేషన్‌లో యువతికి బలవంతంగా అగంతకుడి ముద్దు!



ముంబై, ఫిబ్రవరి 23: నవీ ముంబైలోని టర్వే రైల్వే స్టేషన్‌లో దారుణం చోటు చేసుకుంది. రైలు కోసం ఎదురు చూస్తున్న ఓ యువతి పట్ల ఓ అగంతకుడు అసభ్యకరంగా వ్యవహరించాడు. అందరూ చూస్తుండగానే ముద్దు పెట్టుకునేందుకు యత్నించాడు. గురువారం చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫోన్ మాట్లాడుతూ వెళ్తున్న ఓ యువతి వెనకాలే వెళ్లిన ఓ వ్యక్తి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. బలవంతంగా ముద్దు పెట్టేశాడు. ఇదంతా అక్కడున్న సీసీ కెమెరాల్లో నమోదు అయ్యింది. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు కాసేపటికే సదరు వ్యక్తిని అరెస్ట్ చేశారు.


నేడు లక్నో కోర్టుకు కొఠారి

- రొటొమాక్ అధినేతను హాజరుపర్చనున్న సీబీఐ
- నీరవ్ కేసులో మరో 44 కోట్ల విలువైన ఆస్తుల జప్తు
- రుణాలు 250 కోట్లను మించితే ప్రత్యేక అధికారి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: బ్యాంకుల నుంచి రూ.3,695 వేల కోట్ల రుణాలు తీసుకుని ఎగ్గొట్టిన రోటోమాక్ యజమాని విక్రమ్ కొఠారీని, ఆయన కుమారుడు రాహుల్‌ను అరెస్టు చేసిన సీబీఐ అధికారులు శుక్రవారం వారిని పాటియాల కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసుకు సంబంధించి వారిని లక్నో కోర్టులో హాజరుపర్చేందుకు సీబీఐ పెట్టుకున్న 'ట్రాన్సిట్ రిమాండ్'కు కోర్టు అంగీకరించింది. దీంతా వారిద్దరినీ శనివారం లక్నో కోర్టులో హాజరుపర్చనున్నారు. కాగా, మొ త్తం ఏడు ప్రభుత్వరంగ బ్యాంకుల (బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఓవర్సీస్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, అలహాబాద్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్) నుంచి రూ.2919 కోట్ల మేర రుణాలను విక్రమ్ కొఠారీ తీసుకున్నారని, వడ్డీతో కలిపి అది రూ.3695 కోట్లకు చేరిందని ఆ సొమ్ము చెల్లించకుండా కొఠారీ మోసం చేశారని సీబీఐ అధికారులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కొఠారీ తమ వద్ద తీసుకున్న రుణాన్ని చెల్లించడంలేదంటూ బ్యాంక్ ఆఫ్ బరోడా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. దీనిపై ప్రశ్నించేందుకు విక్రమ్ కొఠారీని, రాహుల్‌ను సీబీఐ అధికారులు ఢిల్లీలోని తమ ప్రధాన కార్యాలయానికి పిలిపించారు. విచారణలో సహకరించనందున వారిని అరెస్టు చేశామని ఒక అధికారి తెలిపారు. అరెస్టు చేసిన అనంతరం శుక్రవారం వారిని పాటియాల అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సమీర్ విశాల్ ముందు హాజరుపర్చగా.. వారికి కోర్టు ట్రాన్సిట్ రిమాండ్ విధించారు.



పాటియాల కోర్టు ఆవరణలో విక్రమ్ కొఠారి, రాహుల్ కొఠారి



నీరవ్ సంస్థలో స్వాధీనం చేసుకున్న విదేశీ గడియారాలు

నీరవ్ కేసులో 44 కోట్ల డిపాజిట్లు స్తంభన

ఎంజాబ్ నేషనల్ బ్యాంకుకు కుచ్చు టోపీ పెట్టిన నీరవ్ మోదీ గ్రూప్‌పై దర్యాప్తు వేగంగా జరుగుతోంది. నీరవ్ మోదీ గ్రూప్ బ్యాంకు డిపాజిట్లు, షేర్లను జప్తు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం ప్రకటించింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న గడియారాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. ఇప్పటి వరకు రూ.44 కోట్ల విలువైన బ్యాంకు డిపాజిట్లను స్తంభింపజేయాలని ఆదేశించినట్లు తెలిపింది. ఇకపై ఆయా సంస్థలకు బ్యాంకులు భారీ రుణాలు ఇచ్చేముందు అనుసరించాల్సిన మార్గదర్శకాలను కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదించింది. ఇకపై వాటిని తప్పనిసరిగా అనుసరించాల్సిందేనని సూచించింది.

'నీరవ్ మోదీ'కి ప్రియాంక చోప్రా గుడ్‌బై!



నీరవ్ మోదీ వజ్రాలు, బంగారు ఆభరణాల ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా గుడ్‌బై చెప్పినట్లు తెలిసింది. ఇకపై ఆ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించబోనని ఆమె తేల్చిచెప్పినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన ఒప్పందాలను రద్దు చేసినట్లుగా కూడా వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై ఎలాంటి అధికార ధ్రువీకరణ ఇంకా రాలేదు.



రజనీకాంత్ కొత్త చిత్రం

రజనీకాంత్ వంటి స్టార్‌తో సినిమా చేయడం అనేది ప్రతి దక్షిణాది దర్శకుడి కల. అయితే.. ఆ కల కొందరికే నెరవేరుతుంది. తాజాగా ఇలాంటి అవకాశం ఓ యువ దర్శకుడికి దక్కింది. అతను మరెవరో కాదు.. 'పిజ్జా' వంటి సంచలన చిత్రంతో దర్శకుడిగా తొలి అడుగులు వేసిన కార్తీక్ సుబ్బరాజ్. తర్వాత సిద్ధార్థ్‌తో 'జిగర్ తండా'.. విజయ్ సేతుపతి, ఎస్.జె.సూర్యతో 'ఇరైవి' వంటి సినిమాలు చేసిన ఈ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్.. ప్రస్తుతం ప్రభుదేవాతో 'మెర్క్యురీ' సినిమా చేస్తున్నారు. నిర్మాణం పూర్తిచేసుకున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఈ లోపు ఏకంగా రజనీతో సినిమా చేసే అవకాశాన్ని దక్కించుకున్నారు. కార్తీక్. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చింది. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.



● అదితిరావు, సుధీర్‌బాబు

నవతరం ప్రేమకథ 'సమ్మోహనం'

సుధీర్‌బాబు, అదితిరావు హైదరీ జంటగా మోహన కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తోన్న చిత్రానికి 'సమ్మోహనం' అనే పేరును ఖరారు చేశారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ ''సమ్మోహనం అంటే మంత్రముగ్ధులని చేసే ఒక అందమైన ఆకర్షణ. ఒక మ్యాజికల్ ఎట్రాక్షన్. మా చిత్రంలో హీరో హీరోయిన్ల మధ్య సమ్మోహనకరమైన రొమాన్స్ ఉండటంతో పాటు మిగతా పాత్రలకి ఉండే విభిన్నమైన ఆకర్షణలు ప్రేక్షకులను మెప్పిస్తాయి. ఓ కొత్త పోకడ ఉన్న నవతరం ప్రేమకథా చిత్రంగా ఉంటూనే ఆద్యంతం హాస్యం, సజీవమైన కుటుంబ బంధాలు, ఉద్వేగ భరిత సన్నివేశాల సమాహారంగా సినిమా ఉంటుంది'' అన్నారు. చిత్ర నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ''కథకు యాప్ట్ టైటిల్ ఇది. ఇప్పటి వరకూ మూడు షెడ్యూళ్లు పూర్తయ్యాయి. ఫిబ్రవరి 22 నుంచి మార్చి 3 వరకు నాలుగో షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతుంది. దాంతో 80 శాతం షూటింగ్ పూర్తవుతుంది. మార్చి 3వ వారం నుంచి ఏప్రిల్ 3 వరకూ హిమాచల్ ప్రదేశ్, ముంబైలో షూటింగ్ చేస్తాం. మే మూడో వారంలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.

ఈసారి అజయ్ దేవ్‌గణ్



సినిమాల నుంచి రాజకీయాల వైపు దృష్టి మళ్లించిన హీరో కమల్‌హాసన్ ఇటీవల కొత్త పార్టీతో రంగంలోకి దిగారు. అయితే కమల్ పూర్తి చెయ్యాల్సిన సినిమాలు, విడుదల కావాల్సిన సినిమాలు ఉన్నాయి. ఓ పక్క ఆ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. 'విశ్వరూపం2' చివరి దశలో ఉంది. 'శభాష్ నాయుడు' చిత్రం షూటింగ్ జరుగుతోంది. వీటన్నింటినీ మించి శంకర్ దర్శకత్వంలో 'భారతీయుడు 2' చిత్రంలో కమల్ నటించనున్నారు. ఈ సినిమాకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. నయనతార ఈ చిత్రంలో హీరోయిన్‌గా ఎంపికైంది. రజనీకాంత్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న '2.0' చిత్రంలో బాలీవుడ్ హీరో అక్షయ్‌కుమార్‌తో ఓ కీలక పాత్ర చేయించిన శంకర్, 'భారతీయుడు' చిత్రం కోసం మరో బాలీవుడ్ హీరో అజయ్ దేవ్‌గణ్‌ను సంప్రదించారు. కథ విన్న అజయ్ ఓకే చెప్పారని తెలుస్తోంది. త్వరలోనే 'భారతీయుడు 2' చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాల్ని శంకర్ వెల్లడిస్తారని తెలుస్తోంది.

కొత్తవారితో 'నమస్తే హైదరాబాద్'



పి.సి. క్రియేషన్స్ పతాకంపై మనోహర్ చిమ్మని దర్శకత్వంలో రూపొందుతున్న కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'నమస్తే హైదరాబాద్'. ఈ చిత్రం ద్వారా కొత్త గాయనీ గాయకులను పరిచయం చేయనున్నారు. ఈ నేపథ్యంలో సంగీత దర్శకుడు ప్రదీప్ చంద్ర సారథ్యంలో గురువారం ఆడిషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్ కుమారస్వామి చిలగాని, మహిళా అధ్యక్షురాలు, కోశాధికారి నిర్మల ఆడిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంపత్ కుమారస్వామి మాట్లాడుతూ ''తెలంగాణ దర్శకుడు మనోహర్ రూపొందిస్తున్న ఈ సినిమా ద్వారా నూతన నటీనటులను, గాయనీ గాయకులను పరిచయం చేయడం అభినందనీయం. ఈ సినిమా అద్భుత విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. దర్శకుడు మనోహర్ చిమ్మని మాట్లాడుతూ ''తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఒక తెలంగాణ దర్శకుడిగా నేను రూపొందిస్తున్న పక్కా తెలంగాణ యూత్ ఎంటర్‌టైనర్ ఇది. సినిమాలో అంతర్లీనంగా మంచి సందేశం కూడా ఉంటుంది. ఎంతోమందిని ప్రభావితం చేసిన చరిత్ర ఉన్న హైదరాబాద్ నగరం నేపథ్యంలో రూపొందిస్తున్న ఈ సినిమా కోసం తెలంగాణ కొంతమంది గాయనీగాయకులను పరిచయం చెయ్యాలని భావించి ఈ ఆడిషన్ నిర్వహించడం జరిగింది'' అన్నారు.




● పూజా హెగ్డే

బ్రాహ్మణ యువతిగా..

'డీజే దువ్వాడ జగన్నాథమ్' సినిమా పూజా హెగ్డే కెరీర్‌నే మార్చేసిందని చెప్పొచ్చు. ఈ మూవీలో ఈ అమ్మడి డాన్స్, అందాన్ని చూసి వరుస అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ అమ్మడు బెల్లంకొండ శ్రీనివాస్ సరసన నటిస్తున్న చిత్రం 'సాక్ష్యం'. ఈ సినిమాలో పూజ మధ్యతరగతి బ్రాహ్మణ యువతిగా కనిపించనుందని టాక్. అలాగని.. మొత్తం సాంప్రదాయబద్ధంగానే కాకుండా ఇండియన్, వెస్ట్రన్ డ్రెస్సుల్లో అందంగానే కనిపిస్తానని అంటోంది ఈ భామ. ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా పలు అవార్డులను సొంతం చేసుకున్న నీతా లుల్లా ఈ చిత్రంలో పూజా కాస్ట్యూమ్స్‌ను డిజైన్ చేశారు. మొత్తానికి 'డీజే'లో బ్రాహ్మణ కుర్రాడికి లవర్ పాత్రలో మోడరన్ అమ్మాయిగా కనిపించిన పూజ. 'సాక్ష్యం'లో మోడరన్ అబ్బాయికి లవర్ పాత్రలో బ్రాహ్మణ అమ్మాయిగా కనిపించబోతోందన్న మాట. ఇదిలా వుంటే.. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'రంగస్థలం' సినిమా కోసం పూజ ఐటెమ్ సాంగ్ చేసిన విషయం విదితమే. అంతేగాకుండా.. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మహేష్ బాబు 25వ సినిమాలో కూడా కథానాయికగా నటించబోతోంది. అలాగే.. ఎన్టీఆర్, త్రివిక్రమ్ సినిమాలో కూడా పూజ ఓ హీరోయిన్‌గా సందడి చేయనుంది. వీటిలో ఏ ఒక్కటి హిట్ అయినా పూజా సక్సెస్ ట్రాక్‌లో పడినట్టేనని ఆమె సన్నిహితులు చెబుతున్నారు.



'ఎంఎల్‌ఏ' చిత్రంలో నందమూరి కల్యాణ్‌రామ్, కాజల్ అగర్వాల్



● విజయ్ దేవరకొండ

మే 18న 'టాక్సీవాలా'

విజయ్ దేవరకొండ నటిస్తున్న కొత్త సినిమా 'టాక్సీవాలా'. జిఎ2, యు.వి. పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఎస్.కె.ఎన్. ఈ చిత్రంతో నిర్మాతగా పరిచయమవుతున్నారు. రాహుల్ సంక్రిత్యాన్ దర్శకుడు. విజయ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచిపోయే చిత్రంగా 'టాక్సీవాలా' ఉండబోతోందని నిర్మాతలు చెబుతున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. మే 18న ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ ''అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేసే విధంగా విజయ్ దేవరకొండ క్యారెక్టర్‌ను దర్శకుడు రాహుల్ తీర్చిదిద్దాడు. విజయ్ మ్యానరిజమ్స్, బాడీ లాంగ్వేజ్, క్యారెక్టరైజేషన్ ఆడియెన్స్‌ని మెస్మరైజ్ చేస్తాయి. డైరెక్టర్ రాహుల్ టేకింగ్, సుజిత్ విజువల్స్, జేక్స్ మ్యూజిక్, కృష్ణకాంత్ లిరిక్స్, జాషువా స్టంట్స్ 'టాక్సీవాలా' చిత్రంలో హైలైట్స్‌గా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. మే 18న 'టాక్సీవాలా'ను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'యమ్6'

విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరి, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బేనర్స్‌పై విశ్వనాథ్ తన్నీరు, సురేష్ ఎస్. సంయుక్తంగా నిర్మిస్తోన్న చిత్రం 'యమ్6'. మారుతి, శ్రావణి, ప్రియ హీరోహీరోయిన్లుగా నటిస్తోన్న ఈ చిత్రానికి జైరామ్‌వర్మ దర్శకుడు. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టిఎఫ్‌సిసి ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ''హారర్ అంశాలతో పాటు యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా 'యమ్6' రూపొందినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్న మారుతి భవిష్యత్‌లో మంచి హీరోగా ఎదుగుతాడు'' అన్నారు. సాయివెంకట్ మాట్లాడుతూ ''మ్యూజిక్, నటీనటుల పెర్ఫార్మెన్స్ ట్రైలర్‌లో ఆకట్టునే విధంగా ఉన్నాయి. ఈ సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. దర్శకుడు జైరామ్‌వర్మ మాట్లాడుతూ ''ఇదొక సస్పెన్స్ థ్రిలర్. కడుపుబ్బ నవ్వించే కామెడీ కూడా ఉంటుంది. అంతర్లీనంగా చిన్న సందేశం కూడా ఇచ్చే ప్రయత్నం చేశాం'' అన్నారు. నిర్మాత విశ్వనాథ్ తన్నీరు మాట్లాడుతూ ''దర్శకుడు చెప్పిన చెప్పినదాని కన్నా అద్భుతంగా తెరకెక్కించారు'' అఅన్నారు. హీరో మారుతి మాట్లాడుతూ ''ఇది నా తొలి సినిమా. నేను నటన నేర్చుకోలేదు. దర్శకుడు చెప్పినట్లు ఫాలో అయ్యాను'' అన్నారు.



తెలుగులోకి హీరోయిన్‌గా ఎంట్రీ

బాలీవుడ్ తర్వాత మన తెలుగు సినిమాలకే మార్కెట్ ఎక్కువగా ఉంటుంది. అందుకనే ఎక్కువ మంది ముంబైకి చెందిన తారలు టాలీవుడ్‌లో నటించడానికి ఆసక్తిని చూపుతుంటారు. అలాంటి వారిలో హీరా సోహల్ ఒకరు. ఈ పంజాబీ అమ్మాయి శ్రీధర్ సీపాన దర్శకత్వంలో రూపొందుతోన్న 'బృందావనమది అందరిది' సినిమాలో ఒక హీరోయిన్‌గా నటిస్తుంది. ఆల్ రెడీ ఇందులో రిచాపనయ్ కూడా నటిస్తుంది. 'నా మోడలింగ్ ఫోటోలను చూసిన దర్శకుడు ఆడిషన్‌కు పిలిచారు. ఆడిషన్‌లో సెలక్ట్ అయ్యాను. మోడ్రన్ లుక్‌లో గ్లామర్‌కు, పెర్‌ఫార్మెన్స్‌కు స్కోప్ ఉండే పాత్రలో నటిస్తున్నాను. హైదరాబాద్‌కి ఇది వరకు చాలా సార్లు వచ్చినా సినిమా షూటింగ్ కోసం ఇక్కడే ఉండటం కొత్తగా ఉందంటూ' చెప్పుకొచ్చింది హీరా సోహల్.



● హీరా సోహల్

ఈ క్షణమే మొదలైంది

జనని క్రియేషన్స్ పతాకంపై అనురాగ్‌ను హీరోగా పరిచయం చెస్తూ పోకూరి లక్ష్మణాచారి నిర్మిస్తున్న చిత్రం 'ఈ క్షణమే'. సాయిదేవ రామన్ దర్శకుడు. రామానాయుడు స్టూడియోస్‌లో శుక్రవారం ఈ సినిమా ప్రారంభమైంది. ముహూర్తపు షాట్‌కు బి.గోపాల్ క్లాప్ నివ్వగా, జడ్జి రామారావు కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ ''మా జనని బ్యానర్‌లో ఇది తొలి చిత్రం. దర్శకుడు కథే ఈ చిత్రానికి ప్రధాన బలం'' అన్నారు. హీరో అనురాగ్ మాట్లాడుతూ ''ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు. దర్శకుడు రామన్ మాట్లాడుతూ ''సింగిల్ సిట్టింగ్‌లో ఈ కథ ఓకె అయింది. జనని బేనర్‌లో తప్పకుండా ఇది మంచి సినిమా అవుతుంది'' అన్నారు. సంపూర్ణేశ్‌బాబు మాట్లాడుతూ ''తొలి సినిమా చేస్తున్న ఈ టీమ్‌కి ఆల్ ది బెస్ట్'' అన్నారు. అనురాగ్, శ్వేత జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సతీష్, నిర్మాత: లక్ష్మణాచారి, దర్శకత్వం: సాయిదేవరామన్.



● అనురాగ్, శ్వేత




ఎండలు బాబోయ్..!

ఫిబ్రవరిలోనే భానుడి ప్రతాపం.. రాష్ట్రంలో పెరిగిన ఉష్ణోగ్రతలు

పగలు ఎండ.. రాత్రి వేళ చలి.. క్రమేణా పెరగనున్న ఉష్ణోగ్రతలు

అమరావతి, ఫిబ్రవరి 23 (మనం ప్రతినిధి): వేసవి రాకముందే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఫిబ్రవరిలోనే ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలో ఒక్కసారిగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో జనం ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఇప్పుడే ఎండలు ఇలా ఉంటే.. ముందు ఎలాంటి పరిస్థితి ఉంటుందోనని ప్రజలు ఊహించుకోవడానికే హడలి పోతున్నారు. శుక్రవారం విజయవాడలో 36 డిగ్రీలు, అనంతపురంలో 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే గురువారం కర్నూలులో 36.3, విశాఖపట్నం, అనంతపురంలో 35 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. సముద్రం నుంచి గాలులు లేకపోవడంతో పగలు ఎండలు పెరిగాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే రాత్రి వేళల్లో చలి ఎక్కువగా ఉంటోంది. ఆకాశం నిర్మలంగా ఉండటంతో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. ఇక నుంచి పగటి ఉష్ణోగ్రతలు క్రమేణా పెరుగుతాయని, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

హోదా, ప్యాకేజీ రెండూ రావు




- కేంద్రంపై ఆశలు వదులుకోవాల్సిందే: ఎంపీ జేసీ

అమరావతి, ఫిబ్రవరి 23: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ప్యాకేజీ రెండూ రావని అనంతపురం టీడీపీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి ఏమీ రావని, ఆశలు వదులు కోవాల్సిందేనని అన్నారు. రాష్ట్రంలో మీడియా ప్రతినిధులు ఒత్తిడి తీసుకువస్తుండటంతో రాష్ట్రానికి అంతో ఇంతో నిధులు వస్తాయని చెప్పారు. ప్రతిపక్ష వైసీపీకి ఏ విషయంపైనా స్పష్టత లేదని విమర్శించారు. హస్తకళ సహయోగ్ శిబిరానికి జేసీ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలకు 14.50 లక్షల ముద్ర లోన్ల చెక్కులను పంపిణీ చేశారు.

హెల్త్ వర్సిటీ ఉద్యోగుల దీక్ష విరమణ

- ఫలించిన మంత్రి కామినేని చర్చలు



అమరావతి, ఫిబ్రవరి 23 (మనం ప్రతినిధి): ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉద్యోగులు దీక్ష విరమించారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఉద్యోగ సంఘ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు అశోక్ బాబు, విద్యాసాగర్‌తో పాటు హెల్త్ యూనివర్సిటీ ఉద్యోగులు తమ సమస్యలపై మంత్రితో చర్చించారు. యూనివర్సిటీ నిధుల సంరక్షణకు ప్రత్యేకంగా త్వరలో జీవో విడుదల చేయాలని, అమరావతిలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఏర్పాటుకు సీఆర్‌డీఏ ద్వారా స్థలం కేటాయించాలని, గ్రాంట్‌ను రూ. 6 కోట్ల నుంచి రూ. 15 కోట్లకు పెంచాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. యూనివర్సిటీ అడ్‌హక్ ఉద్యోగుల జీతాల పెంపుదలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రి చర్చల మేరకు సంతృప్తి చెందిన ఉద్యోగులు దీక్షను విరమించి శనివారం నుంచి విధులకు హాజరువుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇక్బాల్, జగదీష్, హెల్త్ యూనివర్సిటీ పరిరక్షణ ఉద్యోగ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

రూపాయి కూడా అవినీతి లేదు

- పారదర్శకంగా బ్రాహ్మణ కార్పొరేషన్
- అర్హులైన వారికి రుణాలు: ఆనంద్‌సూర్య

అమరావతి, ఫిబ్రవరి 23 (మనం ప్రతినిధి): రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ పారదర్శకంగా పనిచేస్తోందని చైర్మన్ వేమూరి ఆనంద్‌సూర్య అన్నారు. శుక్రవారం గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో అర్హులైన బ్రాహ్మణులకు 8 నెలల కాలంలో 51.42 కోట్ల రూపాయల మేరకు రుణాలు అందించామన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌లో ఎక్కడా రూపాయి కూడా అవినీతి జరగలేదని ఆయన పేర్కొన్నారు. అరుంధతి పథకం ద్వారా 1350 మంది బ్రాహ్మణ మహిళలకు మొత్తం రూ.2 కోట్ల రూపాయలను తక్కువ వడ్డీ 8.25 శాతం చొప్పున సూక్ష్మరుణాలు అందించామన్నారు. అదేవిధంగా ఆర్థిక పరిస్థితులు బాగోలేని అర్చక మిత్రుల పేరిట పథకాన్ని ఏర్పాటు చేశామన్నారు. దేవాదాయ శాఖలో పనిచేస్తున్న సుమారు 1300 మంది అర్చకులకు రూ.2 లక్షల మేరకు రుణాలు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

హెచ్-1బిపై మరిన్ని ఆంక్షలు

వీసా జారీ మరింత కఠినం.. పని ఉన్నన్నాళ్లే వీసా అమలు

- క్లయింట్ లొకేషన్‌లో చేస్తే కష్టం
- అక్కడ పని ఉంటేనే అనుమతి
- బెంచి మీద ఉండేవాళ్లకు నో వీసా
- అమెరికన్ల ప్రయోజనాల కోసమే
- ఎంత తక్కువ కాలమైనా ఇవ్వచ్చు
- మూడేళ్ల కాలపరిమితి క్లాజు రద్దు
- ఏడు పేజీలతో కొత్త ఉత్తర్వులు
- ప్రధానంగా భారతీయులపై ప్రభావం



వాషింగ్టన్, ఫిబ్రవరి 23: హెచ్-1బి వీసాల విషయంలో నిబంధనలను అమెరికా మరోసారి కఠినతరం చేసింది. ప్రధానంగా భారత ఐటీ కంపెనీలు, వాటిలో పనిచేసే ఉద్యోగులకు వీటివల్ల ఈ తరహా వీసాలు దొరకడం కాస్త కష్టమే అవుతుంది. ప్రధానంగా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ థర్డ్‌పార్టీ పని ప్రదేశాలలో చేసేవారి విషయంలో ఈ నిబంధనలు బాగా కఠినం కానున్నాయి. ఈ కొత్త విధానం ప్రకారం.. తమ వద్ద హెచ్-1బి వీసాపై థర్డ్‌పార్టీ పని ప్రదేశంలో పనిచేసే ఉద్యోగికి ప్రత్యేకమైన, ముందుగా ఊహించలేని పనులు ఉన్నాయని, అవన్నీ ప్రత్యేక నైపుణ్యం కలవారు మాత్రమే చేయాల్సి ఉంటుందన్న విషయాన్ని ఆ కంపెనీ రుజువు చేయాలి. ఇందుకోసం ఆయా కంపెనీలు అదనంగా కష్టపడాల్సి ఉంటుంది. హెచ్-1బి వీసా పొందాలంటే ఆ థర్డ్ పార్టీ పని ప్రదేశం కచ్చితంగా ఆమోదం పొందాలి. ఓ ప్రత్యేక విభాగంలో ఒక హెచ్-1బి వీసా గల ఉద్యోగిని నియమించుకోవాలనుకుంటే.. దానికి సంబంధించి కచ్చితమైన ఆధారాలను ఇవ్వాలి. నిపుణులైన అమెరికా ఉద్యోగులు దొరకనప్పుడు.. వారికి బదులుగా బాగా నిపుణులైన విదేశీ ఉద్యోగులను తెచ్చుకుని వారితో ఆ పనులు చేయించుకోడానికి వీలుగా వివిధ కంపెనీలకు అనుమతిస్తూ అలా వచ్చే ఉద్యోగులకు ఇచ్చే తాత్కాలిక వీసాయే హెచ్-1బి. ఈ తరహా వీసాలతో ఎక్కువగా భారతీయ ఐటీ కంపెనీలే లబ్ధి పొందుతున్నాయి. ఈ కంపెనీలలో ఎక్కువ మంది థర్డ్‌పార్టీ పని ప్రదేశాలలోనే పనిచేస్తుంటారు. అంటే, కంపెనీ తమ పేరుమీద ఉద్యోగిని తీసుకొచ్చుకున్నా.. తమ కంపెనీ ప్రాంగణంలో కాకుండా క్లయింట్ లొకేషన్‌లో ఆయా ఉద్యోగులతో పని చేయిస్తుంటుంది. చాలావరకు అమెరికాకు చెందిన బ్యాంకింగ్, రవాణా, వాణిజ్య సేవలు, బీమా సేవల కంపెనీలన్నీ ఇలా భారతదేశం నుంచి ఆన్-సైట్ ఉద్యోగులుగా వచ్చే నిపుణుల మీదే ఆధారపడుతున్నాయి. తాజాగా ట్రంప్ ప్రభుత్వం హెచ్-1బి వీసాల విషయంలో ఏడు పేజీల విధాన నిర్ణయాన్ని ప్రకటించింది. దానివల్ల థర్డ్ పార్టీ పని ప్రదేశంలో ఎన్నాళ్లు అయితే పని ఉంటుందో అంతకాలం మాత్రమే హెచ్-1బి వీసా మీద వచ్చేవాళ్లు అమెరికాలో ఉండటానికి అనుమతిస్తారు. అక్కడ పని అయిపోయిందనుకున్న వెంటనే తిరిగి స్వదేశానికి వెళ్లిపోవాల్సి ఉంటుంది. సాధారణంగా ఇలా ఒక కంపెనీ పేరుమీద ఆన్-సైట్ ఉద్యోగాలకు వచ్చినవాళ్లు అంతకంటే మెరుగైన ప్యాకేజి వస్తుందనుకుంటే వేరే కంపెనీకి అక్కడే మారిపోతుంటారు. అయినా ఇన్నాళ్లూ హెచ్-1బి వీసా అలాగే కొనసాగేది. సరిగ్గా ఈ విధానానికి ఇప్పుడు చెక్ పడుతుంది. 'బై అమెరికన్.. హైర్ అమెరికన్' అనే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో భాగంగానే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని, తద్వారా అమెరికా పౌరుల ప్రయోజనాలు కాపాడవచ్చని యూఎస్‌సీఐఎస్ పేర్కొంది. ఇప్పటి దాకా మూడేళ్ల కాలపరిమితితో హెచ్1బీ వీసాలను జారీ చేస్తున్నా.. ఇప్పుడు ఆ కాలపరిమితిపై యూఎస్‌సీఐఎస్‌దే అంతిమ నిర్ణయం. మూడేళ్లకు బదులు ఎంత తక్కువ కాలానికైనా అనుమతి ఇవ్వచ్చు. ఈ ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయి. ఇక, ఇంతకుముందే తీసుకున్న హెచ్1బీ వీసాల కాల పరిమితి పెంపు కూడా మరింత కష్టతరం కానుంది. ఓ ఉద్యోగి పని లేకుండా బెంచ్‌కే పరిమితమైతే అతడికి వీసా పొడిగింపు దాదాపు అసాధ్యమే. ఉద్యోగికి పని కల్పించకుండా బెంచ్‌పై కూర్చోబెట్టేసి జీతాలివ్వకపోవడం వ్యవస్థకే విరుద్ధమని, అందుకే ఈ నిర్ణయాన్ని తీసుకున్నామని యూఎస్‌సీఐఎస్ పేర్కొంది. ఇకపై హెచ్1బీ వీసాకు దరఖాస్తు చేసుకోవాలంటే భారీగా పేపర్ వర్క్ కూడా చేయాల్సి ఉంటుంది. ఉద్యోగ కల్పనకు సంబంధించి ఆధారాలు, సాంకేతిక పత్రాలు, మార్కెటింగ్ విశ్లేషణ, కాస్ట్ బెనిఫిట్ అనాలసిస్, బ్రోచర్లు, ఫండింగ్ డాక్యుమెంట్ వంటి వాటిని దరఖాస్తు సమయంలో పొందుపరచాలి. తాను చేయబోతున్న పని ఏంటి, అది ఎంతకాలం ఉంటుంది, అందులో తనకు ఎంత వేతనం వస్తుంది, ఎన్ని గంటలు పనిచేస్తాను, ప్రయోజనాలు.. ఇలాంటి వివరాలన్నింటినీ కూడా జతచేయాలి. దాంతో పాటు సాక్ష్యంగా పనికొచ్చే ఇతర సమాచారం ఏమైనా ఉంటే అది కూడా ఇవ్వాలని యూఎస్‌సీఐఎస్ పేర్కొంది.

పీఛే ముడ్!

మళ్లీ వైఎస్‌ఆర్‌సీపీలోకి ఎమ్మెల్యేలు?



- జంపింగ్ ఎమ్మెల్యేల్లో తీవ్ర అసంతృప్తి
- వారిలో నలుగురికే అమాత్య పదవులు
- మిగిలినవారికిచ్చిన 'హామీ' నీటిమూట
- వికటించిన 'ఆపరేషన్ ఆకర్ష్' ప్రయోగం
- పలువురికి టికెట్ దక్కడం అనుమానమే
- పార్టీ ఎందుకు మారామా అని ఆవేదన
- తిరిగి వెళ్లిపోవడానికి చాలామంది రెడీ

మనం (అమరావతి) : వైఎస్ఆర్‌సీపీ తరపున ఫ్యాన్ గుర్తు మీద పోటీ చేసి గెలిచి, ఆ తర్వాత వివిధ కారణాలతో పచ్చ కండువా కప్పుకొన్న 23 మంది ఎమ్మెల్యేలంతా ఇప్పుడు ఏం ఆలోచిస్తున్నారు? ఉన్న పార్టీలో వాళ్లంతా సంతోషంగానే ఉన్నారా? అక్కడే ఉండిపోతామన్న నమ్మకం వాళ్లలో ఎంతమందికి ఉంది? ఈ ప్రశ్నలన్నింటికీ ఇప్పుడు నకారాత్మక సమాధానమే వినిపిస్తోంది. పార్టీ నుంచి వెళ్లినవారు మళ్లీ తిరిగి వస్తామంటే తీసుకోడానికి అభ్యంతరం లేదన్న పార్టీ కీలక నేత విజయసాయి రెడ్డి ప్రకటన వాళ్లలో మరింతగా ఆశలు రేపుతోంది. వైఎస్ఆర్‌సీపీ నుంచి టీడీపీలోకి జంప్ చేసిన 23 మందిలో చాలా మంది ఇప్పుడు అసంతృప్తితో రగిలిపోతున్నారట. ఏపీలో ఉన్న ఏకైక ప్రతిపక్ష పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని బలహీనపరిచి, క్షేత్రస్థాయిలో సైతం ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వాన్ని చెల్లాచెదురు చేసి సంపూర్ణ ఆధిపత్యాన్ని చెలాయించాలనే వ్యూహంతో టీడీపీ 'ఆపరేషన్ ఆకర్ష్'కు తెరతీసింది. పలు నియోజకవర్గాల్లో బహునాయకత్వ సమస్య, సమాంతర నాయకత్వాలతో పాటు కండువా మార్చుకునేటప్పుడు టీడీపీ అధినాయకత్వం పలువురు శాసనసభ్యులకు ఇచ్చిన 'హామీ'లను నెరవేర్చలేదనే ఆగ్రహంతో టీడీపీలోని వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. భూమా అఖిలప్రియ, ఆదినారాయణ రెడ్డి, సుజయకృష్ణ రంగారావు, అమర్‌నాథ్ రెడ్డిలకు మాత్రం మంత్రిపదవులు దక్కగా.. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు నియోజకవర్గంపై పూర్తి ఆధిపత్యం లభించేలా పార్టీ నాయకత్వం ఎమ్మెల్సీ కరణం బలరాంను నియంత్రించగలిగింది. మిగిలిన ఎమ్మెల్యేలకు అందాల్సిన తాయిలాలు పూర్తిగా అందలేదని, ఇచ్చిన హామీలు నీటిమూటలా మారిపోయాయని పలువురు తీవ్ర ఆవేదనతో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే కర్నూలు జిల్లా కోడుమూరు ఎమ్మెల్యే మణిగాంధీ, కడప జిల్లా బద్వేలు ఎమ్మెల్యే జయరాములు పార్టీకి వ్యతిరేకంగా కొన్ని వ్యాఖ్యలు చేశారు కూడా. కర్నూలు జిల్లాకే చెందిన ఓ శాసనసభ్యుడైతే తనకీసారి టికెట్ వస్తుందా.. లేదా అనే అనుమానంతో సతమతవవుతున్నారు. అనంతపురంలోని ఓ నియోజకవర్గంలో టీడీపీ పరాజిత అభ్యర్థికి టికెట్ లేనట్టేనని చెబుతున్నారు. నెల్లూరు జిల్లాలో టీడీపీలో చేరిన ఓ ఎమ్మెల్యే అయితే టికెట్ గల్లంతు.. లేదా స్థానం మార్పునకు అవకాశం ఉందంటున్నారు. ప్రకాశం జిల్లాలో ఓ మాజీమంత్రి కోసం ప్రస్తుతం గెలిచిన శాసనసభ్యున్ని పక్కన పెడతారనే ప్రచారం ఉంది. పశ్చిమ ప్రకాశానికి చెందిన రెండు నియోజకవర్గాల్లో టీడీపీలో పరిస్థితి అయోమయంగా ఉండగా.. మరో నియోజకవర్గంలో విభేదాలు నిత్యం రచ్చకెక్కుతున్నాయి. గుంటూరు జిల్లాలో పరిస్థితి సాధారణంగానే ఉంది. ఇక కృష్ణాజిల్లాలో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు టికెట్ ఖరారుపై నీలిమేఘాలు కమ్ముకుంటున్నాయి. వారిలో ఒకరికి దాదాపుగా టికెట్ లేనట్టే. ఇక ఉభయగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో పార్టీ మారినవారి పరిస్థితి ఎందుకు మారామా అన్నట్లు ఉందంటున్నారు.



అన్నీ ఆన్‌లైనే

ఏపీలో ఈ-ప్రగతి అకాడమీ.. సీఎం చంద్రబాబు వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 23 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో మార్చి నాటికి అన్ని ఫైళ్లను ఆన్‌లైన్‌లో తీసుకొచ్చి ప్రజలకు మేలు జరిగేలా కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఏప్రిల్ నాటికి రాష్ట్రంలో ఈ-ప్రగతి అకాడమీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ అకాడమీ ద్వారా కిందిస్థాయి నుంచి అత్యున్నత స్థాయి ఉద్యోగి వరకు అందరికీ ఐఎస్‌బీలో శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. ప్రతి కుటుంబంలో ఒకర్ని డిజిటల్ అక్షరాస్యుడిగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. రాష్ట్రానికే కాక దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సేవలు అందించేలా ఈ-ప్రగతి ఆఫీసును సన్నద్ధం చేస్తామని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉండవల్లిలోని సీఎం నివాస ప్రాంగణంలో గల గ్రీవెన్స్‌సెల్‌లో ఏర్పాటు చేసిన ఈ-ప్రగతి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఐఎస్‌బీ నుంచి డిగ్రీ పొందడం సామాన్యమైన విషయం కాదన్నారు. 500 ఫార్చ్యూన్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ఎంతో కష్టపడి హైదరాబాద్‌లో ఐఎస్‌బీని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఐఎస్‌బీని తొలుత చెన్నై, బెంగళూరు, ముంబైలలో ఏర్పాటు చేయాలనుకున్నారని, అలాంటి సంస్థను హైదరాబాద్‌కు తీసుకొచ్చామని చెప్పారు. ఐఎస్‌బీ 51 శాఖల నుంచి 96 మంది అధికారులు సర్టిఫికెట్లు తీసుకోవడం మంచి పరిణామమన్నారు. 6 నెలల శిక్షణకాలంలో అధికారులు 90% హాజరుతో క్లాసులకు వచ్చారని తెలిపారు. ఐఎస్‌బీ ప్రొఫెసర్ దీపామణి ఈ శిక్షణ ఇవ్వడంలో మంచి చొరవ చూపించారని ప్రశంసించారు. రాష్ట్ర విభజన అనంతరం తాము అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఐటీ అడ్వైజర్‌గా మొదటి నియామకం జె.సత్యనారాయణకు ఇచ్చామని గుర్తుచేశారు. మూడున్నరేళ్లుగా రాష్ట్రంలో ఐటీ పరిశ్రమ ముందుకు వెళ్లడానికి ఎంతో కృషి చేశామని వివరించారు. ప్రపంచంలో ఏ దేశంలో ఉపయోగించని విధంగా రాష్ట్రంలో ఆధార్, బయోమెట్రిక్‌లను ఉపయోగిస్తున్నామన్నారు. ఈ-ప్రగతి ద్వారా ఫైళ్లను నిమిషాల్లో పరిష్కరించడంతో పాటు, వేగంగా పాలన చేయడానికి దోహదపడుతుందన్నారు. తమ శాఖల ఫైళ్ల పరిష్కారంలో మంత్రులు, కార్యదర్శులు పోటీపడి పనిచేస్తున్నారని తెలిపారు.

కబడ్డీ కేసీఆర్ కప్ విజేత 'శాలిగౌరారం'




కేసీఆర్ కప్ ట్రోఫీతో శాలిగౌరారం జట్టు సభ్యులు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (మనం ప్రతినిధి): సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో రెండురోజుల పాటు జరిగిన కబడ్డీ కేసీఆర్ కప్ పోటీల్లో శాలిగౌరారం జట్టు విజేతగా నిలిచింది. తుంగతుర్తి టీమ్ రెండో స్థానంలో నిలువగా.. మోత్కురు టీమ్ తృతీయ, నూతనకల్ టీమ్ నాలుగవ స్థానంలో, అడ్డగుడూర్ టీమ్ 5వ స్థానంలో నిలిచాయి. ఫైనల్స్‌లో గెలుపొందిన విన్నర్ టీమ్‌కు కేసీఆర్ కప్ ట్రోఫీతో పాటు రూ.50 వేలు, రెండో స్థానంలో నిలిచిన రన్నర్ టీంకు రూ.35 వేలు, 3వ స్థానం పొందిన మోత్కురు టీంకు రూ. 25 వేలు, నూతనకల్ టీం కు రూ.15 వేలు, 5వ బహుమతి గా రూ. 10వేలు అడ్డగుడూర్ జట్టుకు తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేడే రాజీవ్ సాగర్ అందజేశారు. ఈ పోటీలు తుంగతుర్తి నియోజకవర్గ స్థాయిలో లీగ్ పద్ధతిలో పోటీలు జరిగాయి. మండల స్థాయిలో 219 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. నియోజకవర్గంలో 9 మండలాలు ఉండగా.. మండలానికి ఒక జట్టు చొప్పున నియోజక వర్గ స్థాయిలో పోటీ పడ్డాయి. ఈ సందర్భంగా రాజీవ్ సాగర్ మాట్లాడుతూ..గ్రామీణ యువతలో కబడ్డీ క్రీడానైపుణ్యాలను వెలికితీసి వారిని ప్రోత్సహించేందుకు సీఎం కప్‌ను నిర్వహించామని వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం రోజున కబడ్డీ పోటీలను ప్రారంభించామని రాజీవ్ అన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఆశీస్సులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, మంచాల వరలక్ష్మి, రాష్ట్ర అధికార ప్రతినిధి దొనికెన కుమార స్వామి, రాష్ట్ర కార్యదర్శులు శ్రీకాంత్ గౌడ్ జవహర్, జాగృతి మహిళా విభాగం కన్వీనర్ డాక్టర్ ప్రభావతి, సాంస్కృతిక విభాగం కన్వీనర్ కోదారి శ్రీను, లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ తిరుపతి వర్మ , విద్యార్థి విభాగం కో కన్వీనర్ సాజన్, సూర్యాపేట జిల్లా కన్వీనర్ రంగినేని ఉపేందర్ రావు, జిల్లా కో కన్వీనర్ మస్తాన్ ,లతా రావు, శైలజ, మాధవి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకూ
- మొత్తం విద్యార్థులు 10.26 లక్షల మంది
- పరీక్షా కేంద్రం తెలుసుకునేందుకు యాప్
- ఈ ఏడాది నుంచి గ్రేడ్ విధానం అమలు
- ఫీజు పేరుతో హాల్ టికెట్ ఆపితే చర్యలు
- ఇంటర్ బోర్డు కమిషనర్ బి.ఉదయలక్ష్మి




అమరావతి, ఫిబ్రవరి 23 (మనం ప్రతినిధి): ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్ బోర్డు కమిషనర్ బి.ఉదయలక్ష్మి చెప్పారు. శుక్రవారం సచివాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకూ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. మొదటి, రెండో సంవత్సరం కలిపి మొత్తం 10,26,891 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ జరుగుతాయని చెప్పారు. ఒక రోజు మొదటి సంవత్సరం వారికి, తర్వాత రోజు రెండో సంవత్సరం వారికి పరీక్షలు జరుగుతాయని వివరించారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. శుక్రవారం నుంచి హాల్ టికెట్లను జ్చ్బ్చిఖియుజీ.ౖఇ.జౌరి.జీ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్‌ను సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌తో ధృవీకరించుకోవాలని, దానిని తీసుకొని పరీక్షా కేంద్రానికి వెళ్లాలని వివరించారు. ఫీజులు చెల్లించలేదన్న కారణంతో విద్యార్థుల హాల్ టికెట్లను ధృవీకరించని ప్రైవేటు కాలేజీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హత ఉన్న విద్యార్థులందరికీ హాల్ టికెట్లు ధృవీకరించాలని ఆమె చెప్పారు. విద్యార్థులు చదువుకునే కాలేజీ కాకుండా జంబ్లింగ్ విధానంలో మరో కాలేజీని పరీక్షా కేంద్రంగా నిర్ణయించినందున, పరీక్షా కేంద్రాలను తెలుసుకోవడానికి ఇబ్బందిపడకుండా ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్ సెంటర్ లొకేటర్ అనే నూతన యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. యాండ్రాయిడ్ సెల్ ఫోన్ ఉన్న వారు గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ యాప్‌ని డౌన్ లోడ్ చేసుకుంటే, కోడ్ నెంబర్ అడుగుతుందని, ఆ స్థానంలో విద్యార్థులు హాల్ టికెట్ నెంబర్ ఎంటర్ చేస్తే పరీక్షా కేంద్రాన్ని చూపుతుందని వివరించారు. యాండ్రాయిడ్ సెల్ ఫోన్ లేనివారు ఒక రోజు ముందే పరీక్షా కేంద్రాన్ని చూసుకోవడం మంచిదని సలహా ఇచ్చారు. మొత్తం 1423 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాపీయింగ్ జరుగకుండా గట్టి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కాపీ చేస్తూ పట్టుబడితే విద్యార్థిని 8 పరీక్షల వరకు డీబార్ చేస్తామని హెచ్చరించారు. అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక కేంద్రాలలో తప్పనిసరిగా ప్రతి గదిలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి పది పరీక్షా కేంద్రాలకు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ని, సమస్యాత్మక కేంద్రాల్లో ప్రతి కేంద్రానికి ఒక సిట్టింగ్ స్క్వాడ్‌ని నియమించినట్లు వివరించారు. పరీక్షా కేంద్రాల్లో ఏ ఒక్క విద్యార్థి కూడా కింద కూర్చొని పరీక్ష రాసే పరిస్థితి లేకుండా, అందరికీ కుర్చీలు గానీ, బెంచీలు గాని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి రోజూ లాటరీ పద్ధతిలో ఇన్విజిలేటర్లను ఎంపిక చేస్తారని చెప్పారు. పరీక్షలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే విజయవాడ ఇంటర్ బోర్డులోని ఫోన్ నెంబర్ 0866-2974130, ఫ్యాక్స్ నెంబర్ 0866-2970056, టోల్ ఫ్రీ నెంబర్ 18002749868కు తెలియజేయాలని ఉదయలక్ష్మి సూచించారు. పరీక్షలు సమర్థంగా నిర్వహించడం కోసం ఆయా జిల్లాల కలెక్టర్ల అధ్యక్షతన జిల్లా కోఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులు సెల్ ఫోన్ తీసుకువెళ్లకుండా నిషేధించినట్లు తెలిపారు. ఈ ఏడాది ర్యాంకింగ్‌లు ఇవ్వడం లేదని, గ్రేడ్ విధానం ప్రవేశపెడుతున్నట్లు ఆమె చెప్పారు. పరీక్షలు ముగిసిన తరువాత స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ ఉదయలక్ష్మి తెలిపారు.

సెన్సెక్స్ ఫిబ్రవరి 2018 23



పెరిగినవి	%	తగ్గినవి	%
టాటా స్టీల్	6.26	ఏసియన్ పెయింట్స్	-1.29
సన్ ఫార్మా	5.17	కోల్ ఇండియా	-0.51
యస్ బ్యాంకు	2.28	ఇన్ఫోసిస్	-0.42
డాక్టర్ రెడ్డీస్	2.26	ఎం అండ్ ఎం	-0.22
భారతీ ఎయిర్‌టెల్	2.26	హెచ్.యు.ఎల్	-0.16

నిఫ్టీ ఫిబ్రవరి 2018 23



పెరిగినవి	%	తగ్గినవి	%
టాటా స్టీల్	6.31	గెయిల్	-1.66
సన్ ఫార్మా	5.21	ఏసియన్ పెయింట్స్	-1.46
యు.పి.ఎల్	3.72	ఐషర్	-0.54
టెక్ మహీంద్రా	3.13	ఎం అండ్ ఎం	-0.46
వేదాంత	2.81	ఇన్ఫోసిస్	-0.44

టాప్ గైనర్స్ 23 ఫిబ్రవరి

34,142.15

బి.ఎస్.ఇ సెన్సెక్స్ ▲322.65

పాయింట్లు		%
677.80	టాటా స్టీల్	6.26%
570.20	సన్ ఫార్మా	5.17%
323.60	యస్ బ్యాంకు	2.28%
2169.25	డాక్టర్ రెడ్డీస్	2.26%
425.45	భారతీ ఎయిర్‌టెల్	2.26%
190.00	ఓఎన్‌జీసీ	2.04%
162.80	ఎన్‌టీపీసీ	1.43%
276.10	ఎస్‌బీఐ	1.28%
536.55	యాక్సిస్ బ్యాంకు	1.24%
3076.90	టీసీఎస్	1.20%

బులియన్ | గత 7 రోజులు



రత్నాలు, ఆభరణాల ఎగుమతులు

(మిలియన్లలో యూఎస్ డాలర్లలో)

జనవరి 2018	2513.99
డిసెంబరు	2383.21
నవంబరు	2775.57
అక్టోబరు	2702.10
సెప్టెంబరు	3338.12
ఆగస్టు	2269.11
జూలై	1894.58
జూన్	2328.22
మే	3459.22
ఏప్రిల్	3199.71
మార్చి	3054.68
ఫిబ్రవరి	3451.72
జనవరి 2017	2646.81

1000 ఆధారం: జి.జె.ఇ.పి.సి

34 వేల ఎగువన సెన్సెక్స్




ముంబయి: ప్రపంచ స్టాక్ మార్కెట్ల పెరుగుదలను స్ఫూర్తిగా తీసుకుని, దేశీయ స్టాక్ మార్కెట్లకు గీటురాళ్లుగా భావించే 'సెన్సెక్స్', 'నిఫ్టీ'లు ఒక శాతంపైగా పెరిగిన స్థితిలో ముగిశాయి. 'సెన్సెక్స్' 34,000 పాయింట్ల స్థాయిని తిరిగి కైవసం చేసుకుంది. ఇటీవలి కాలంలో పేలవమైనవిగా నిలిచిన ఫార్మా, ఫైనాన్షియల్స్ విభాగాల్లో షేర్లను మదుపరులు కొనుగోలు చేయడం పెరుగుదలకు ఊతమిచ్చింది. బొంబాయి స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బి.ఎస్.ఇ) సూచి 'సెన్సెక్స్' 322.65 పాయింట్లు లాభపడి 34,142.15 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం మొత్తంమీద సెన్సెక్స్ 0.39 శాతం పెరిగినట్లు లెక్క. నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' 108.35 పాయింట్లు పెరిగి 10,491.05 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ ఈ వారం మొత్తంమీద 0.37 శాతం లాభపడినట్లు లెక్క.

''అమెరికా బాండ్ ప్రతిఫలాలు తగ్గడంతో సెంటిమెంట్ అధికమైంది'' అని అరిహంత్ క్యాపిటల్ మార్కెట్స్ పూర్తి కాల డైరెక్టర్ అనితా గాంధీ చెప్పారు.

డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ (ఇంట్రా-డేలో) రూ. 64.76గా ఉండడం, దేశీయ మదుపు సంస్థలు మార్కెట్లలోకి స్థిరంగా నిధులు ప్రవహింపజేయడం కూడా సూచీలు లాభపడేందుకు కారణమయ్యాయి. ఆసియాల ఇతర మార్కెట్ల సానుకూల సంకేతాలు, మార్చి డెరివేటివ్‌ల సిరీస్ ప్రారంభంతో బెట్‌లు పెంపొందుతూ రావడంతో 30 షేర్ల సూచి 'సెన్సెక్స్' శుక్రవారం ఉదయం 33,832 పాయింట్ల వద్ద మొదలై 34 వేల పాయింట్ల స్థితిని కైవసం చేసుకునే విధంగా ర్యాలీ సాగించింది. 'సెన్సెక్స్' ఒక దశలో 34,167.60 పాయింట్ల గరిష్ఠ స్థితిని చూసింది. ఇంతకుముందు సెషన్‌లో 'సెన్సెక్స్' 25.36 పాయింట్లు కోల్పోయింది.

ఇటీవలి కాలంలో స్టాక్ మార్కెట్లలో జోరు తగ్గింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ. 11,400 కోట్ల మోసపూరిత భరోసా పత్రాల బాగోతం బయటపడడంతో నిరుత్సాహం ఆవహించింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని అరికట్టేందుకు ఆర్.బి.ఐ వడ్డీ రేట్లు పెంచవచ్చనే భయాలు కూడా మదుపరులను వెనక్కి లాగాయి.

పెరిగిన విదేశీ మారక ద్రవ్య నిల్వలు



ముంబయి: విదేశీ కరెన్సీ ఎసెట్లు పెరగడం వల్ల జనవరి 16తో ముగిసిన వారంలో దేశంలో విదేశీ మారక ద్రవ్య నిల్వలు 1960 బిలియన్ల డాలర్లు పెరిగి, 421.720 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. అంతకు ముందు వారంలో, ఈ నిల్వలు 2.154 బిలియన్ డాలర్లు తగ్గి 419.760 బిలియన్ డాలర్లుగా మాత్రమే ఉన్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి 9న విదేశీ మారక ద్రవ్య నిల్వలు 421.914 బిలియన్ డాలర్ల గరిష్ఠ స్థాయిని తాకాయి. అవి సెప్టెంబర్ 8తో ముగిసిన వారంలో మొదటిసారిగా 400 బిలియన్ల మైలురాయిని దాటాయికానీ, అప్పటి నుంచి నిల్వలు పెరుగుతూ, తగ్గుతూ వచ్చాయి. జనవరి 16తో ముగిసిన వారంలో, మొత్తంమీద రిజర్వులలలో మేజర్ భాగమైన విదేశీ కరెన్సీ ఎసెట్లు 1.925 బిలియన్ల డాలర్లు పెరిగి 396.572 బిలియన్ డాలర్లుగా నిలిచాయి. అమెరికన్ డాలర్లలో వ్యక్తపరచిన విదేశీ కరెన్సీ ఎసెట్లలో యూరో, పౌండ్, యెన్‌ల మారకం విలువల పెరుగుదల, తరుగుదల ప్రభావం కూడా ఇమిడి ఉంది.

పసిడి నిల్వలు మారకుండా 21.514 బిలియన్ డాలర్ల వద్ద కొనసాగుతున్నట్లు కేంద్ర బ్యాంక్ ప్రకటించింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐ.ఎం.ఎఫ్) సంస్థ నుంచి స్పెషల్ డ్రాయింగ్ హక్కులు 13 మిలియన్ డాలర్లు పెరిగి, 1.546 బిలియన్ డాలర్లుగా నిలిచాయి. ఆ ఫండ్ దగ్గరున్న దేశ రిజర్వుల స్థితి 21.7 మిలియన్ డాలర్లు పెరిగి 2.087 బిలియన్ డాలర్లకు చేరుకుంది.



కనాట్ ప్లేస్‌లో గృహ వసతి

న్యూఢిల్లీ: ఇండియన్ ఎకనామిక్ సర్వీస్ (ఐ.ఇ.ఎస్) అధికారులకు కనాట్ ప్లేస్ సమీపంలో గృహ నిర్మాణ ప్రాజెక్టు ఒడంబడికపై ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఎన్.బి.సి.సి నేడు సంతకాలు చేశాయి. దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ మార్గ్‌లో 3,519 చదరపు మీటర్ల స్థలంలో వారికి గృహ వసతి కల్పిస్తారు. ఇరవై ఏడు లేదా 28 అంతస్తులుండే ఒకే మేడలో దాదాపు 90 ఫ్లాట్లు నిర్మించనున్నట్లు ఎన్.బి.సి.సి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనూప్ కుమార్ మిత్తల్ చెప్పారు. ఈ ప్రాజెక్టునకు చెందిన అవగాహన పత్రంపై ఆర్థిక వ్యవహారాల శాఖ (డి.ఇ.ఏ), నేషనల్ బిల్డింగ్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్.బి.సి.సి) సంతకాలు చేశాయి. దీనితో నిర్మాణానికి అంకురార్పణ జరిగినట్లైందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ సందర్భంగా ప్రసంగిస్తూ చెప్పారు. ''సాధారణంగా, భూములు సహేతుకమైన దూరం లోపల అందుబాటులో ఉంటాయి. కానీ, ఇది అరుదైన కేసు. నగరం మధ్యలో భూమి అందుబాటులో ఉంది. కనాట్ ప్లేస్‌లో గృహ వసతికి భూమి అందుబాటులో ఉండడమంటే 2017లో ఊహకందని విషయం. ఎందుకంటే, ఎవరూ కూడా నివాస వసతి కల్పించుకునే విధంగా కనాట్ ప్లేస్‌ను ఊహించుకునే అవకాశమే లేదు'' అని ఆయన చెప్పారు. 'ప్రభుత్వ జనరల్ పూల్ ఎకామడేషన్' కింద, ముఖ్యంగా జూనియర్-స్థాయి అధికారులకు గృహ వసతికి తీవ్ర కొరత ఉన్న సమయంలో ఈ గృహ నిర్మాణ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ''ఢిల్లీలో ప్రభుత్వ భూములు ఇప్పటికీ చాలా ఉన్నాయనే నా దృఢ నమ్మకం. వాటిని తక్కువగా ఉపయోగించుకోవడమో లేదా అసలు ఉపయోగించుకోకపోవడమో ఉంది. భవిష్యత్తులో ప్రభుత్వ గృహ వసతికి అవే ఆలంబన అవుతాయి'' అని జైట్లీ అన్నారు.

ప్రాంతీయ విమాన సర్వీసులు మహీంద్రా-వైకింగ్‌ల మధ్య పొత్తు



ముంబయి: పరస్పరం పోటీ పడని చోట్ల విమానాల వ్యాపారంలో మద్దతు ఇచ్చి పుచ్చుకునేందుకు మహీంద్రా ఏరోస్పేస్, కెనడాకు చెందిన వైకింగ్ ఎయిర్‌తో తొలి ఒప్పందంపై సంతకాలు చేసింది. భారతదేశంలో ప్రాంతీయ నగరాల మధ్య విమాన సదుపాయ అవకాశాలు వృద్ధి చెందుతున్న దృష్ట్యా అవి ఆ రకమైన అవగాహనకు వచ్చాయి. గుర్తించిన ప్రాంతాలలో మార్కెట్లోకి చొచ్చుకుపోవడాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. నిర్దిష్ట నిర్వహణాపరమైన అవసరాలను ఆధారం చేసుకుని సామర్థ్యం కలిగిన కస్టమర్లకు బహుళ అవకాశాలు కల్పించడం కూడా ఈ ఒడంబడిక ధ్యేయమని మహీంద్రా ఏరోస్పేస్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయోజనదాయక విమాన సర్వీసులలో విక్టోరియా (కెనడా) కేంద్రంగా ఉన్న వైకింగ్ ఎయిర్ గ్లోబల్ లీడరుగా ఉంది. మొత్తం 19 మంది కూర్చోవడానికి ఉపయుక్తమైన రెండు ఇంజన్ల టర్బోప్రాప్ విమాన తయారీదారుగా అది ఖ్యాతి వహించింది. ఈ సిరీస్ 400 ట్విన్ ఓట్టర్ నీటితో సహా రకరకాల ఉపరితలాల నుంచి టేకాఫ్ కాగలదు. వ్యూహాత్మక పొత్తు కోసం ఒక అవగాహనా పత్రంపై మహీంద్రా ఏరోస్పేస్, వైకింగ్ ఎయిర్‌లు సంతకాలు చేశాయి. కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో ప్రస్తుతం భారతదేశంలో జరుపుతున్న పర్యటన సందర్భంగా ఈ ఎంఓయూపై సంతకాలు జరిగాయి. ''వైకింగ్-మహీంద్రా ఏరోస్పేస్‌లు ప్రాంతీయ విమాన రవాణా పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు పరస్పర ప్రయోజనదాయకంగా సహకారాన్ని ఇచ్చిపుచ్చుకునే విధంగా వనరులు వినియోగించుకునేందుకు భారతదేశపు వైవిధ్య భరితమైన మార్కెట్ అనేక అవకాశాలు కల్పిస్తోంది'' అని ఆ ప్రకటన పేర్కొంది. ఈ పోర్ట్‌ఫోలియో భారతదేశంలో ప్రాంతీయ కనెక్టివిటీ అవసరాలు చాలా వరకు తీర్చడంలో సహాయపడుతుంది. ఈ రకమైన విమానం స్థిరమైన పరిష్కారాన్ని అందించగలుగుతుంది. ప్రాంతీయ కనెక్టివిటీ పథకం 'ఉడాన్'కు అవసరమైన ప్రోత్సాహాన్ని ఇస్తుందని మహీంద్రా ఏరోస్పేస్ చైర్మన్ ఎస్.పి. శుక్లా చెప్పారు. మహీంద్రా ఏరోస్పేస్ 8 సీట్ల ఉపయుక్త పిస్టన్ విమానాన్ని, 10 మంది కూర్చునే టర్బోప్రాప్ యుటిలిటీ విమానం మహీంద్రా ఎయిర్‌వ్యాన్ 10ని తయారు చేస్తోంది. మున్ముందు ఇదే విమానం స్కీ, ఫ్లోట్ రకాలను అభివృద్ధి చేయడానికి అది పథకం వేస్తోంది. ''ఇండియాలో సిరీస్ 400 ట్విన్ ఓట్టర్‌కి మార్కెట్ సామర్థ్యం అపారంగా ఉందని వైకింగ్ భావిస్తోంది. ముఖ్యంగా సీప్లేన్ వేరియంట్‌కు ప్రాధాన్యం ఇస్తోంది. మహీంద్రా గ్రూప్‌తో మా పొత్తు, భారతదేశంలో సిరీస్ 400కు అర్హమైన కర్షణ శక్తిని సమకూరుస్తుందని, ఇతర ప్రాంతాల్లో కూడా సహకారానికి కొత్త అవకాశాలకు ద్వారాలు తెరుస్తుందని మేం గట్టి నమ్మకంతో ఉన్నాం'' అని వైకింగ్ ఎయిర్ అధ్యక్షుడు, ప్రధాన కార్యనిర్వహణాధికారి డేవిడ్ కర్టిస్ అన్నారు.

వాటా పెంచినందుకు ప్రయోజనం చేకూరిందా?



న్యూఢిల్లీ: కేంద్రం సౌజన్యంతో నడిచే పథకాల హేతుబద్ధీకరణతో పాటు, కేంద్రం పన్నుల్లో రాష్ట్రాల వాటాను 42 శాతానికి పెంచడం వల్ల ఆశించిన ప్రయోజనం నెరవేరిందా అనే అంశాన్ని ఒక కమిటీ పరిశీలిస్తుందని ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఎన్.కె. సింగ్ శుక్రవారం చెప్పారు. ఐ.సి.ఆర్.ఐ.ఇ.ఆర్ ఇక్కడ నిర్వహించిన ఒక కార్యక్రమం సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో విడిగా మాట్లాడారు. సిఫార్సు చేయవలసిందని 15వ ఆర్థిక సంఘాన్ని కోరిన అంశాలలో ఇతరమైన వాటితోపాటు ప్రభుత్వ ద్రవ్య వనరుల సమర్థ నిర్వహణకు రోడ్ మ్యాప్ రూపొందించడం కూడా ఒకటిగా ఉంది. ఆర్.బి.ఐ మాజీ గవర్నర్ వై.వి. రెడ్డి అధ్యక్షతన గల 14వ ఆర్థిక సంఘం కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను రికార్డు స్థాయిలో పెంచుతూ సిఫార్సు చేసింది. ఐ.ఎం.ఎఫ్ బహుముఖీన స్వరూప స్వభావాలు గత 10 ఏళ్ళలో ప్రస్ఫుటంగా వ్యక్తమయ్యాయని భారతదేశపు జీట్వంటీ షెర్పా, ప్రస్తుత ఆర్థిక సంఘ సభ్యుడు శక్తికాంత దాస్ అన్నారు. కొన్ని సందర్భాలలో, నిర్దిష్ట రాజకీయ పరిమితులను దాటి వివిధ దేశాల వ్యవహారాలలో జోక్యం చేసుకుంటున్నట్లుగా ఐ.ఎం.ఎఫ్ కనిపిస్తోందని దాస్ అన్నారు. ''అది (వ్యవస్థాపరమైన సంస్కరణలకు సంబంధించి) ప్రభుత్వాలను అతి జాగ్రత్తగా ముందుకు నెట్టవలసిన'' అవసరం ఉందని ఆయన చెప్పారు. ఐ.ఎం.ఎఫ్‌లో పాలనాపరమైన సంస్కరణలు రావలసి ఉందని కూడా ఆయన అన్నారు. ''ఇండియా వంటి కొన్ని ప్రవర్ధమాన ఆర్థిక వ్యవస్థలు పెరుగుతున్న నేటి వాస్తవాన్ని ప్రతిబింబిస్తూ, సంస్థలో పాలనా పరమైన సంస్కరణలు తీసుకురావాల్సిన బాధ్యత ఐ.ఎం.ఎఫ్‌దే''నని దాస్ అన్నారు. వివాదాస్పద క్రిప్టో కరెన్సీలను చట్ట విరుద్ధమైనవిగా ప్రకటించాలని ఆయన కోరారు.

మాజీ సీఎఫ్‌ఓపై ఇన్ఫోసిస్ ప్రతి దావా





బెంగళూరు: మాజీ ఛీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సి.ఎఫ్.ఓ) రాజీవ్ బన్సల్ చేయవలసిన పనులు పూర్తి చేయలేదని, విశ్వాస విఘాతానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఇన్ఫోసిస్ 100 కోట్ల రూపాయలకు ప్రతి దావా వేసినట్లు తెలిసింది. ఆయనకు చెల్లించవలసిన తెగతెంపుల మొత్తానికి సంబంధించిన వివాద పరిష్కారానికి ఇన్ఫోసిస్ రెండున్నర నెలల క్రితం భారతీయ సెక్యూరిటీలు, ఎక్ఛ్సేంజ్ బోర్డు (సెబి)కి ఒక దరఖాస్తు సమర్పించింది. ఈ ప్రతి దావా నగదు చెల్లించడంలో జాప్యం చేసేందుకు లేదా ఈ వ్యవహారాన్ని కోర్టు బయట పరిష్కరించుకునేందుకు చేస్తున్న విన్యాసం కావచ్చని పరిశ్రమ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ వివాదం రాజీవ్ బన్సల్‌కు చెల్లించవలసిన తెగతెంపుల మొత్తం రూ. 17.38 కోట్లకు సంబంధించినది. ఆయన 2015 డిసెంబరులో పదవి నుంచి వైదొలగిన తర్వాత, ఆ మొత్తానికి అర్హులయ్యారు. ఇన్ఫోసిస్ ఆయనకు రూ. 5 కోట్లు చెల్లించిన తర్వాత, మిగిలిన మొత్తాన్ని చెల్లించకుండా తొక్కిపెట్టింది. ఇన్ఫోసిస్ సహ స్థాపకుడు ఎన్.ఆర్. నారాయణ మూర్తి ఈ పరిహారం ''అపరిమితం''గా ఉందని వ్యాఖ్యానించారు. రాజీవ్ నోరు మూయించేందుకు మేనేజ్‌మెంట్ ''గుట్టుచప్పుడుకాకుండా ఈ ద్రవ్యాన్ని'' చెల్లించిందని ఆయన ఆరోపించారు. రాజీవ్‌తో ఒప్పందం నాన్-కంపీట్ ఆబ్లిగేషన్లతో కూడుకున్నదని, దానిలో ఇతర హక్కులు, ఆబ్లిగేషన్లు కూడా ఉన్నాయని అప్పట్లో ఇన్ఫోసిస్ ప్రకటించింది. ''అటువంటి హక్కులు, ఆబ్లిగేషన్లకు సంబంధించి కొన్ని వివరణలు పెండింగ్‌లో ఉన్నందు వల్ల ఈ ఒప్పందం కింద చెల్లించవలసిన మొత్తాల్లో కొన్నింటిని రాజీవ్‌కు సస్పెండ్ చేస్తున్నాం'' అని కంపెనీ అప్పట్లో ఒక ప్రకటనలో తెలిపింది. రాజీవ్‌కు చెల్లించవలసిన తెగతెంపుల మొత్తం పరిమాణానికి సంబంధించి ఆత్మాశ్రయత్వ అంశం ఇమిడిఉందని ఇన్ఫోసిస్ బోర్డు సభ్యులు, అప్పటి దాని సి.ఇ.ఓ విశాల్ సిక్కా అంగీకరించారు. కానీ, అప్పటి నుంచి అటువంటి పరిస్థితి మళ్ళీ తలెత్తకుండా చూసేందుకు కంపెనీ విధానాలలో మార్పు చేసినట్లు కూడా తెలియజేసింది.

సిక్కా కూడా కంపెనీ నుంచి నిష్క్రమించిన తర్వాత, 2017 ఆగస్టులో ఈ అంశం మరోసారి తలెత్తింది. డిసెంబరులో ఇన్ఫోసిస్ 'సెబి' వద్ద ''పరిష్కార దరఖాస్తు'' దాఖలు చేసింది. దర్యాప్తులో కనుగొన్న అంశాలను అది అంగీకరించనూ లేదు. ఖండించనూ లేదు.

కంపెనీలు వివాద పరిష్కారానికి అనుసరించే ప్రక్రియను ''పరిష్కార దరఖాస్తు'' అంటారు.

కంపెనీ కార్పొరేట్ పాలన నిబంధనలను ఉల్లంఘించిందని 'సెబి'కి ఎవరో ఆకాశరామన్న ఇ-మెయిల్ పంపడంతో దానికి స్పందనగా కంపెనీ ''పరిష్కార దరఖాస్తు'' దాఖలు చేసింది. చెల్లింపులు నిలిపివేయడానికి, తెగతెంపుల ఒప్పందం కింద మధ్యవర్తిత్వం చేపట్టడానికి సంబంధించి నామినేషన్ అండ్ రెమ్యూనిరేషన్ కమిటీ లేదా ఆడిట్ కమిటీల నుంచి ముందుగాగానీ, లేదా విడిగా గానీ అనుమతి పొందలేదని ఆ ఫిర్యాదుదారు ఆరోపించారు. చెల్లింపులు నిలిపివేయడంతో, ఇన్ఫోసిస్‌పై రాజీవ్ కోర్టుకెక్కారు. మిగిలిన బకాయిలు కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇన్ఫోసిస్ నుంచి తాజా విడత ప్రతి-దావాను పరిష్కార ప్రక్రియను జాప్యం చేసేందుకు అనుసరిస్తున్న ఎత్తుగడగా పరిశీలకులు భావిస్తున్నారు. ''సెబికి అభ్యర్థన సమర్పించేటప్పుడు, ప్రతి దావా వేయడానికి కంపెనీ అంతకాలం ఎందుకు తీసుకున్నట్లు?'' అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని కార్పొరేట్ న్యాయవాది ఒకరు ప్రశ్నించారు.

పప్పు ధాన్యాల దిగుమతి సుంకంపై కినుక



న్యూఢిల్లీ: పప్పు ధాన్యాల దిగుమతులపై సుంకాన్ని పెంచుతూ భారతదేశం తీసుకున్న నిర్ణయంపై కెనడా, ఆస్ట్రేలియా, యూరోపియన్ యూనియన్ (ఇ.యు), అమెరికాలతో సహా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి దేశాలు కినుక వహించాయి. ఆహార భద్రత లక్ష్యాలు సాధించినట్లు ఢిల్లీ చెప్పుకోవడంపై అవి ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఓ)లో ప్రశ్నలు లేవనెత్తాయి. టారిఫ్‌లో ఇటీవల తీసుకొచ్చిన పెంపుదల డిమాండ్-సరఫరా సమీకరణ ఆధారంగా తీసుకొచ్చినదని, అది డబ్ల్యు.టి.ఓ నిబంధనలను ఉల్లంఘించలేదని భారత్ జవాబిచ్చినట్లు జెనీవాలో ఉంటున్న ఒక ట్రేడ్ అధికారి చెప్పారు. ''పప్పు ధాన్యాలపై దిగుమతి సుంకాలు పెంచాలన్న నిర్ణయాన్ని ఆహార భద్రతతో ముడిపెట్టడం ద్వారా కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు గందరగోళాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి. తన కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి) కార్యక్రమాలను పరిమితులు విధించడానికి గురి చేయకూడదని డిమాండ్ చేయడానికి భారతదేశం ఆహార భద్రతకు సంబంధించిన ఆందోళనలను కారణంగా చూపుతున్నందున, భారతదేశ విధానాలు కొన్ని తప్పుల తడకలతో కూడుకుని ఉన్నాయని చిత్రించేందుకు కొన్ని దేశాలు ప్రయత్నిస్తున్నాయి. చర్చ తప్పుదారి పట్టడానికి మేం అనుమతించం'' అని వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు చెప్పారు.

కెనడా ఆందోళన: బఠానీలపై దిగుమతి సుంకాన్ని భారత్ 2017 నవంబరులో 50 శాతానికి తీసుకెళ్ళింది. శనగలపై, కందిపప్పుపై 2017 డిసెంబరులో 30 శాతం కస్టమ్స్ లెవీ విధించింది. బఠానీలపై దిగుమతి సుంకాలు పెంచిన అంశాన్ని కెనడా ఇప్పటికే లేవనెత్తింది. భారతదేశానికి కెనడా ప్రధాన బఠానీ సరఫరాదారుగా ఉంది. ఇండియా దిగుమతి సుంకాలుపెంచితే తన పప్పు ధాన్యాల వర్తకంపై ప్రతికూల ప్రభావం పడుతుందని కెనడా ఆందోళన చెందుతోంది. పప్పు ధాన్యాల దిగుమతి సుంకంపై ఆందోళన వ్యక్తం చేసిన ఇతర దేశాలలో రష్యా, ఉక్రేన్‌లు ఉన్నాయి. వ్యవసాయంపై డబ్ల్యు.టి.ఓ కమిటీ ఈ వారం మొదట్లో జరిపిన సమావేశ ఎజెండాలో ఈ అంశమే అగ్ర స్థానంలో నిలిచింది. వినియోగదార్లు, సరఫరాదార్ల ప్రయోజనాల మధ్య సమతూకం సాధించడమే ఈ చర్య వెనుక లక్ష్యమని ఢిల్లీ వివరించింది.

పెరిగిన దిగుబడి


భారతదేశంలో పప్పు ధాన్యాల ఉత్పత్తి 2016-17లో గణనీయంగా పెరిగింది. మిగులు ఉత్పత్తితో దేశీయ మార్కెట్ల ధరలు తగ్గిపోతున్నాయి. ఉదాహరణకు, శనగల ఉత్పత్తి సుమారు 40 శాతం పెరిగి, 2 కోట్ల 30 లక్షల టన్నులుగా నిలిచింది. దానితో దాని ధరలు ఎం.ఎస్.పికన్నా తక్కువకు పడిపోయాయి. ''రైతుల దయనీయ స్థితులను పెంచుతూ దేశీయంగా ధరలు మరింతగా పడిపోకుండా నివారించడానికే పప్పు ధాన్యాలపై దిగుమతి సుంకం విధించవలసి/పెంచవలసి వచ్చింది'' అని వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు చెప్పారు.

మనం రియల్
శనివారం, 24 ఫిబ్రవరి 2018
www.manamnews.com



చెల్లించకుంటే చిక్కులు

సొంతింటి కోసం లేదా కారు కోసం లేదా వ్యక్తిగత అవసరం కోసమో రుణం తీసుకుని తిరిగి చెల్లించలేకపోతే ఏంటి పరిస్థితి? ఈ విషయాన్ని ఎప్పుడైనా ఆలోచించారా...? బ్యాంకు ఏ విధమైన చర్యలు తీసుకుంటుంది... రుణ గ్రహీతల ముందున్న ఆప్షన్లు తదితర వివరాల గురించి తెలుసుకుందాం...



రుణం చెల్లించపోతే..?

ఆర్ బీఐ మార్గదర్శకాల ప్రకారం గృహరుణం ఈఎంఐ వరుసగా 90 రోజుల పాటు చెల్లించకుంటే ఆ రుణం మొత్తం మొండి బకాయి (ఫలితం లేని ఆస్తి) వర్గీకరణలోకి వెళుతుంది. అప్పుడు బ్యాంకు రుణ గ్రహీతకు లీగల్ నోటీసు పంపిస్తూ మొత్తం బకాయిలను ఒకేసారి చెల్లించాలని అడుగుతుంది. చెల్లించకుంటే చట్టపరమైన చర్యల్ని ప్రారంభిస్తుంది. మొదటి లీగల్ నోటీసు పంపిన రెండు నెలల తర్వాత (అంటే రుణ వాయిదా చెల్లించకుండా ఐదు నెలలు అయిన సందర్భం) మరో లీగల్ నోటీసు పంపిస్తుంది. అందులో ఇంటికి ఇంత విలువ నిర్ణయించామని, వేలం వేస్తున్నామని తెలియజేస్తుంది. ఇక్కడి నుంచి నెల రోజుల తర్వాత వేలానికి ఓ తేదీని ఖరారు చేస్తుంది.

కొత్త ఇల్లు కొన్న తర్వాత..!



కొత్తగా ఇల్లు కొన్నారా? రుణ వాయిదాలు ప్రారంభమయ్యాయా? అయితే, జీతంలో సింహభాగం.. ఈ రుణ వాయిదాకే వెళ్లి పోతోంది.. ఇప్పటి వరకూ ఉన్న మిగులు కనిపించదు.. ఆర్థికంగా ఇబ్బందికరమైన పరిస్థితులే ఎదుర్కోవాల్సి రావచ్చు. సొంతిల్లు.. సొంతంగా పెట్టుబడి పెట్టిన డబ్బు.. గృహరుణం కలిస్తేనే ఈ కల నెరవేరేది. ఇప్పటి వరకూ ఆర్జించిన మొత్తం చేతిలో నుంచి కరిగిపోవడంతోపాటు, కొత్తగా గృహరుణం రూపంలో ఓ దీర్ఘకాలిక అప్పు మన తలపైకి వచ్చి చేరుతుంది. ఇప్పటివరకూ ఏ ఇబ్బందీ లేకుండా సాగిన బడ్జెట్ జీవితం.. కాస్త ఆటుపోట్లకు గురికావడం సహజమే కదా! తాత్కాలికంగా ఏర్పడే నగదు ఇబ్బందిని క్రెడిట్ కార్డుతో అధిగమించవచ్చు. కానీ, దీర్ఘకాలంలో ఇది సాధ్యం కాదు కదా! అందుకే, ఇతర మార్గాలను అన్వేషించాలి. బంగారం తాకట్టు పెట్టి, నగదును పొందడానికి ప్రయత్నించవచ్చు. ఇతర అప్పులతో పోలిస్తే.. ఇది కాస్త తక్కువ వడ్డీకే వస్తుంది. పని చేస్తున్న సంస్థ నుంచి వేతన అడ్వాన్సు పొందేందుకు ఏదైనా అవకాశం ఉందా చూసుకోండి. సాధారణంగా దీనికి వడ్డీ ఉండదు. గృహరుణం ఈఎంఐ అధికంగా ఉందా చూసుకోండి.. దాన్ని తగ్గించుకునేందుకు అవకాశం ఉందా పరిశీలించండి. బ్యాంకును అడిగి, వ్యవధి పెంచుకోవడం చేసుకోవచ్చు. 20 ఏళ్లకు బదులు.. 25 ఏళ్లకు వ్యవధిని పెంచుకోవచ్చు. దీనివల్ల కొంత భారం తగ్గే అవకాశం ఉంటుంది. రుణ మార్పిడి చేసుకోవచ్చు. కానీ, దీనికి చాలా లెక్కలు చూసుకోవాల్సి ఉంటుంది. ఎండోమెంట్ పాలసీల్లాంటివి ఉంటే వాటిని తాకట్టు పెట్టి, రుణం తీసుకోవచ్చు.

అధిక రాబడి మార్గం!



భూములు, ఇళ్లు, ఫ్లాట్లు.. బంగారం.. చాలామంది భారతీయులకు పెట్టుబడులంటే ఇవే. సంపాదించిన మొత్తంలో ఎక్కువగా వీటికే కేటాయించేందుకు ప్రయత్నిస్తుంటారు. కానీ, ఇప్పుడిప్పుడే ఈ ధోరణి మారుతోంది. వీటికి భిన్నంగా మ్యూచువల్ ఫండ్లు, షేర్ల వంటి ఆర్థిక పెట్టుబడుల వైపు దృష్టి సారిస్తున్నారు. మదుపరుల నేపథ్యం, ఆర్థిక పరిస్థితులను బట్టి వేటిని ఎంచుకోవాలో మదుపరులు నిర్ణయించుకోవాలి. మదుపరులు బంగారం, భూములపై ఆసక్తి చూపకుండా.. మ్యూచువల్ ఫండ్లు, షేర్లపై ఆసక్తి చూపించడానికి పలు కారణాలను చెప్పుకోవచ్చు. కొంతకాలంగా బంగారం, స్థిరాస్తి పెట్టుబడులతో పోలిస్తే.. బాండ్లు, మ్యూచువల్ ఫండ్లు, షేర్లు అధిక రాబడిని ఇచ్చాయి. సాధారణంగా ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నప్పుడు స్థిరాస్తులు, పసిడి వైపు మదుపరులు దృష్టి సారిస్తుంటారు. కానీ, ఇప్పుడు ద్రవ్యోల్బణం అదుపులో ఉంది. దీంతో వీటిపై ఆసక్తి తగ్గిందనుకోవచ్చు. ద్రవ్యోల్బణం తక్కువగా ఉన్నప్పుడు వడ్డీ రేట్లు కూడా తక్కువగానే ఉంటాయి. ఇదే సమయంలో ఆర్థిక పెట్టుబడులు మంచి రాబడినిచ్చేందుకు అవకాశం ఉంటుంది. వడ్డీ రేట్లు తగ్గుతున్నప్పుడు షేర్లు, బాండ్లు, మ్యూచువల్ ఫండ్లు మంచి అధిక రాబడిని అందిస్తాయి. మ్యూచువల్ ఫండ్లు, షేర్లు, 5ఏళ్ల పన్ను ఆదా బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో మదుపు చేసినప్పుడు పన్ను పరమైన ప్రయోజనాలు కూడా లభిస్తాయి. ఇది కూడా మదుపరులకు కలిసొచ్చే అంశమే. దీంతో చాలామంది ఆస్తుల కొనుగోలుకన్నా.. ఇలాంటి పెట్టుబడులకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

సొంతిల్లు అన్నది దాదాపు ప్రతి సగటు వ్యక్తి కల, ఆకాంక్ష. గతంతో పోలిస్తే నేడు రుణంతో ఈ కలను సులభంగా సాకారం చేసుకునే అవకాశాలు వచ్చేశాయి. ఇలా మొదటి సారిగా ఇల్లు సమకూర్చుకుంటున్నప్పుడు తమ దగ్గరున్న పొదుపునంతా బయటకు తీస్తారు. అలాగే, రుణం కూడా అవకాశం ఉన్నంత మేర తీసుకుని మంచి ఇల్లు సమకూర్చుకునేందుకే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు.

మరి ఇంత కష్టపడి ఓ ఇంటి వారైన తర్వాత రుణంపై ఈఎంఐ భారంగా మారితే ఎలా...?. ఇక ఉన్నట్టుండి ఇదే సమయంలో ఉద్యోగం కోల్పోతే, దీర్ఘకాలిక అనారోగ్యం పాలైతే పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించండి. ఆర్థిక పరిస్థితులు ఒక్కసారిగా తల్లకిందులు అవుతాయి. తీసుకున్న రుణాన్ని చెల్లించలేని పరిస్థితి ఎదురవుతుంది. మరి ఈ సమయంలో ఏంటి తరుణోపాయం అన్నది తెలుసుకోవడం అవసరమే.

బ్యాంకు ఏం చేయగలదు...?

రుణమిచ్చిన సంస్థల ప్రయోజనాల పరిరక్షణకు గాను సర్ఫేసి అనే చట్టాన్ని 2002లో పార్లమెంటు ఆమోదించింది. దీని ప్రకారం రుణం చెల్లించడంలో విఫలమైతే బ్యాంకు



తాకట్టులో ఉన్న ఇంటిని జప్తు చేసి తర్వాత విక్రయిస్తుంది. దీంతో తమ బకాయిలను రాబట్టుకుంటుంది. అయితే, దీని కంటే ముందు బ్యాంకులు పలు ప్రత్యామ్నాయాలను కూడా పరిశీలిస్తాయి. సాధ్యమైనంత వరకు రుణ బకాయిలను రాబట్టుకోవడమే వాటి పని. ఇక లాభం లేదనుకున్నప్పుడే ఈ ఆప్షన్‌కు వెళతాయి. ఎందుకంటే బ్యాంకుల ప్రధాన వ్యాపారం రుణాలివ్వడం, ఇచ్చిన వాటిని వసూలు చేసుకోవడమే.

కానీ, ఒకవేళ బ్యాంకు ఇల్లును జప్తు చేసి విక్రయిస్తే అంతటితో తలనొప్పి తీరినట్టు కాదు. ఇల్లును విక్రయించడం వల్ల రుణ బకాయిలకు మించి ఆదాయం వస్తే మిగిలినదంతా బ్యాంకు తన ఖాతాదారుడికే స్వాధీనం చేస్తుంది. ఒకవేళ రుణ బకాయిల మొత్తానికంటే ఇల్లు విక్రయం ద్వారా వచ్చిన ఆదాయం తక్కువ అయితే మిగిలిన బకాయి మొత్తాన్నిరుణ గ్రహీత చెల్లించాల్సి ఉంటుంది.

ఒకవేళ ఆ ఇంటిని విక్రయించడం వల్ల వచ్చిన లాభాలపై మూలధన లాభాల పన్ను కూడా చెల్లించాల్సి రావచ్చు. కొన్న తేదీ నుంచి 36 నెలల లోపు విక్రయించి, దానిపై లాభం పొందితే (నికర పెట్టుబడి తీసివేయగా వచ్చేది) స్వల్ప కాలిక మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఈ లాభాన్ని తమ వార్షిక ఆదాయంలో చూపించి పన్ను వర్తించే ఆదాయంలో ఉంటేనే పన్ను చెల్లించాలి. కొన్న తేదీ నుంచి మూడేళ్లు నిండిన తర్వాత విక్రయించినట్టయితే వచ్చిన లాభం నుంచి ద్రవ్యోల్బణ ప్రభావాన్ని మినహాయించుకోవచ్చు. దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను భారం లేకుండా కేంద్ర ప్రభుత్వ పన్ను ఆదా బాండ్లలో ఇన్వెస్ట్ చేస్తే సరిపోతుంది. లేదా వచ్చిన మొత్తంతో ఆరు నెలల లోపు తిరిగి మరో ఇల్లు కొన్నా సరే.

ఇల్లు ఐదేళ్లలోపు అమ్మితే పన్ను?

గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఇల్లు కొన్న తేదీ నుంచి ఐదేళ్లలోపు విక్రయిస్తే గనుక అప్పటి వరకు ఇంటి రుణంపై సెక్షన్ 80సీ కింద పొందిన పన్ను మినహాయింపు ప్రయోజనాలను కోల్పోతారు. తీసుకున్న రుణాన్ని చెల్లించని యెడల బ్యాంకు ఇంటిని వేలంలో విక్రయిస్తుందని తెలిసిందే.

క్రెడిట్ స్కోరుపై ప్రభావం

క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీస్ యాక్ట్ 2005 ప్రకారం అన్ని ఆర్థిక సంస్థలు రుణాలకు సంబంధించి అన్ని లావాదేవీల వివరాలను, చెల్లింపుల్లో వైఫల్యాల గురించి తప్పనిసరిగా రుణ సమాచార సంస్థలైన సిబిల్ తదితర వాటికి విధిగా తెలియజేయాలి. అందుకే తీసుకున్న రుణం చెల్లింపులో విఫలమైతే ఆ సమాచారం మీ క్రెడిట్ స్కోరుపై ప్రభావం చూపుతుంది. స్కోరు తగ్గుతుంది.

రుణ గ్రహీతలకు కొన్ని హక్కులు

రుణ బకాయి పడినప్పటికీ అప్పు తీసుకున్న వారికి ఉన్న హక్కులను వదులుకోవాల్సిన అవసరం లేదు. బకాయి పడిన వారి ఆస్తులను విక్రయించే ముందు బ్యాంకులు రుణ గ్రహీతలకు తగినంత సమయం ఇవ్వాల్సి ఉంటుంది. 90 రోజులుగా బకాయిలు చెల్లించని కేసులను బ్యాంకులు పనితీరు చూపని ఆస్తి (ఎన్ పీఏ)గా పరిగణిస్తాయి. అప్పుడు బ్యాంకు తప్పనిసరిగా 60 రోజుల కాల వ్యవధితో నోటీసు ఇవ్వాలి. అంటే రెండు నెలల వరకు చెల్లించేందుకు అవకాశం ఇచ్చినట్టు. ఈ కాలంలో చెల్లించకుంటే వేలం వేస్తున్నట్టు తెలియజేస్తూ మరో 30 రోజుల కాల వ్యవధితో నోటీసు జారీ చేయాల్సి ఉంటుంది.



బకాయిలు తీర్చేందుకు గాను రుణమిచ్చిన సంస్థ ఆస్తిని వేలం వేసేందుకు నిర్ణయిస్తే, దాని విలువ ఎంతన్నది బ్యాంకు వ్యాల్యూయర్లతో మదింపు వేయిస్తుంది. దీంతోపాటు వేలానికి రిజర్వ్ ధర, ఏ తేదీ, ఏ సమయంలో ఎక్కడ వేలం అన్నది నోటీసులో పేర్కొనాల్సి ఉంటుంది. ఒకవేళ బ్యాంకు నిర్ణయించిన ధర సరిగా లేదని అనిపిస్తే రుణం తీసుకున్న వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేయవచ్చు. దీనిపై బ్యాంకు ఏడు రోజుల్లోపు స్పందించాలి. మెరుగైన ఆఫర్‌ను చూపించితే అప్పుడు బ్యాంకు ఓ నిర్ణయం తీసుకుంటుంది.

పర్సనల్ లోన్ అయితే ఇలా...

ఒకవేళ తీసుకున్నది పర్సనల్ లోన్ అయితే నెల వాయిదా నిర్ణీత తేదీలోపు చెల్లించకుంటే ఒత్తిళ్లు పెరిగిపోతాయి. దీని గురించి ఓ ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి ప్రీతిగార్గ్ ఇలా వివరిస్తున్నారు. ఈఎంఐ చెల్లించే గడువు దాటిన దగ్గర్నుంచీ బ్యాంకు వసూళ్ల టీమ్ నుంచి బకాయి దారులకు నిత్యం కాల్స్ వస్తుంటాయి. అంతే కాదు, ఆఫీసు, కార్యాలయానికి కూడా విచ్చేస్తారు. సమాధానం చెప్పి పంపితే సమస్య ఆగినట్టు కాదు. అది ఆ రోజుకే పరిమితం. మరుసటి రోజు మళ్లీ అదే సీన్ పునరావృతం అవుతుంది. చెల్లించకుండా 30 రోజులు దాటిపోతే ఈ న్యూసెన్స్ మరింత ఉద్ధతమవుతుంది. మర్యాదగానే అడుగుతూ నానా రకాలుగా ఒత్తిడి తెస్తారు. ఇక బకాయిపడి 60 రోజులు దాటితే పరిస్థితి మరింత తీవ్రతరం అవుతుంది. ఎందుకంటే 90 రోజులు దాటితే దాన్ని పనితీరు చూపని ఆస్తిగా గుర్తించి ఆర్బీఐకి తెలియజేయాల్సి ఉంటుంది. అందుకే పనితీరు చూపని ఆస్తిగా మారకుండా చూసేందుకు చివరి 30 రోజుల్లో ఒత్తిడిని మరింత పెంచేస్తాయి. అప్పటి వరకు ఎవరో ఒకరే కాల్ చేస్తే, 60 రోజుల తర్వాత నుంచి ఎవరు పడితే వారు కాల్ చేసి బకాయి తీర్చాలని అడుగుతుంటారు. ఈ కాల్స్ రాత్రి, పగలు తేడా లేకుండా వస్తాయి. ఒకవేళ ఈ రుణాన్ని బ్యాంకు నుంచి కాకుండా ఎన్ బీఎఫ్ సీ సంస్థ నుంచి తీసుకుంటే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. కలెక్షన్ ఉద్యోగులు ఇల్లు, ఆఫీసుల చుట్టూ తిరుగుతారు. సామాజిక మాధ్యమాల్లోకీ ఎక్కిస్తారు. 90 రోజులు దాటి అది పనితీరు చూపని ఆస్తి కిందకు మారిపోతే అప్పుడు ఆయా కేసుల్లో వసూళ్ల బాధ్యతను ప్రత్యేక ఏజెన్సీలకు అప్పగిస్తాయి. ఈ ఏజెన్సీలు మానసికంగా, సామాజికంగా ఒత్తిడి తెచ్చే చర్యలకు దిగుతాయి.



రుణాన్ని తీర్చలేకపోవడం



ఇంటి రుణాన్ని తీర్చలేకపోవడం అన్నది సాధారణంగా ఎక్కువ కేసుల్లో ఎదురుకాదు. మరి ఈ పరిస్థితి ఏర్పడిందంటే అందుకు ఉన్నట్టుండి ఉద్యోగం కోల్పోవడమా, అనారోగ్యమా? లేక కారణం ఏంటన్నది పరిశీలించుకోవాలి. ఒకవేళ ఇటువంటి స్వల్ప కాలిక ఆటంకాలే అయితే స్వయంగా బ్యాంకుకు వెళ్లి ఆధారాలు చూపించి పరిస్థితి వివరించాలి. సాధ్యమైనంత వెంటనే తాను బకాయిలు తీర్చేస్తానని చెప్పాలి. గతంలో ఏవైనా రుణాలు తీసుకుని పూర్తి చేసి ఉంటే ఆ వివరాలు చూపించడం ద్వారా తమ రుణ బకాయిల చెల్లింపుల చరిత్ర తెలియజేయాలి. వీటి పట్ల బ్యాంకు అధికారి సానుకూలంగా ఉంటే రుణాన్ని పునరుద్ధరిస్తారు.

ఎలా ఎదుర్కోవడం?



ఇంటి రుణ వాయిదా చెల్లించడంలో విఫలమైతే బ్యాంకులు ఇంటిని జప్తు చేసి విక్రయించే పనిని మొదలు పెడతాయి. కనుక ఈ సమయంలో బ్యాంకు సిబ్బంది లేదా ప్రతినిధితో గొడవ పడడం సరికాదు. పరిస్థితిని వివరించి వారితో గౌరవంగా వ్యవహరిస్తే సాధ్యమైనంత వరకు సామరస్య పూర్వక ఒప్పందం కుదిరే అవకాశాలుంటాయి. వడ్డీ రేట్లు పెరిగితే చెల్లించాల్సిన ఈఎంఐ కూడా పెరుగుతుంది. మరి అదే సమయంలో మీ ఆదాయంలో పెరుగుదల లేకపోవచ్చు లేదా తగ్గొచ్చు. ఇటువంటప్పుడు రుణ కాల వ్యవధి పెంచాలని బ్యాంకులను కోరడానికి అవకాశం ఉంది. దీనివల్ల నెలవారీ చెల్లించాల్సిన ఈఎంఐ తగ్గుతుంది. ఒకవేళ అప్పటికే రుణ కాల వ్యవధిని పెంచి ఉండి, అది రిటైర్మెంట్ వయసు వరకు ఉంటే మరోసారి కాల వ్యవధి పెంపు ఉండబోదు.

బ్యాంకు కుదరదంటే?



ఒకవేళ రుణ కాల వ్యవధి పెంచేందుకు, రుణాన్ని పునరుద్ధరించేందుకు బ్యాంకు నిరాకరిస్తే వేరే బ్యాంకును సంప్రదించే అవకాశాన్ని పరిశీలించొచ్చు. తక్కువ రేటుకు వేరే బ్యాంకు రుణమిచ్చేందుకు ముందుకు వస్తే దాంతో బకాయి పడిన రుణం మొత్తాన్ని తీర్చేయవచ్చు. ఒకవైపు బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీలలో పెట్టుబడులు ఉండి కూడా, మరోవైపు తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించలేక ఇబ్బందులు పడుతుంటే, అప్పుడు పెట్టుబడుల్లో కొంత మేర నగదుగా మార్చుకుని రుణాన్ని చెల్లించడం సరైన నిర్ణయం అవుతుంది. దీనివల్ల సొంతిల్లు పరాధీనం కాకుండా ఉంటుంది.

చివరికి ఇంటిని వదులుకోవడమే

సొంతిల్లు, కలల రూపాన్ని కాపాడుకోవడానికి ఏ అవకాశం లేకపోతే అప్పుడు దాన్ని విక్రయించక తప్పదు. అయితే ఆ పని బ్యాంకు కాకుండా మీరే స్వయంగా చేసుకోవడం ప్రయోజనకరం. ఎందుకంటే మీరైతే సరైన విలువకు కొనుగోలు చేసే పార్టీని వెతుక్కునే అవకాశం ఉంటుంది. మంచి విలువకు ఇంటిని విక్రయించి బ్యాంకు బకాయి తీర్చగా ఎంత మిగిలిందో చూసుకోవాలి. మిగిలిన మొత్తంతో నగర శివార్లలో ఇల్లు సమకూర్చుకునే అవకాశం ఉన్నా దాన్ని మిస్ కాకూడదు.

మనం స్పోర్ట్స్
శనివారం 24 ఫిబ్రవరి 2018
www.manamnews.com

లాస్ట్ ఛాన్స్

ఒక అరుదైన, చరిత్రలో నిలిచిపోయే ఘటనను సొంతం చేసుకునేందుకు ఇది చివరి అవకాశం. డబుల్ సిరీస్‌ను సొంతం చేసుకునేందుకు భారత పురుషులు, మహిళల జట్లు సిద్ధమయ్యాయి. మొన్నటి మాదిరిగానే ఒకే వేదిక. రెండు మ్యాచ్‌లు. తొలుత మహిళల జట్లు సౌతాఫ్రికా మహిళల జటుతో, తర్వాత పురుషుల జట్లు తలపడనున్నాయి. బుధవారం నాటి మ్యాచ్‌ను భారత ఇరు జట్లనూ వరుణుడు అడ్డుకున్నాడు. వర్షం కారణంగా సౌతాఫ్రికా ఇన్నింగ్స్ తర్వాత మహిళల మ్యాచ్ రద్ద యింది. అయితే నిరంతరం కురిసిన జల్లుల కారణంగా భారత పురుషుల జట్టు ఓటమి పాలైంది. పరిస్థితులు ఎలా ఉన్నా.. కారణాలు ఏవైనా ఓ అరుదైన రికార్డును సొంతం చేసుకునేందుకు ఇదే చివరి అవకాశం.





సిరీస్‌పై

ఇటు.. అమ్మాయిలు

అటు.. అబ్బాయిలు

నేడు ఇండియా, సౌతాఫ్రికా మహిళల మధ్య ఐదో టీ20

కేప్‌టౌన్: ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ను 2-1తో భారత మహిళల జట్టు కైవసం చేసుకుంది. ఈ ఆధిక్యాన్ని పెంచుకునేందుకు మరోసారి హర్మన్‌ప్రీత్ సేన గట్టిగా కృషి చేయనుంది. శనివారమిక్కడ ఇండియా, సౌతాఫ్రికా మహిళల జట్లు చివరి, ఐదో టీ20లో తలపడనున్నాయి. వర్షం కారణంగా నాలుగో మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ తర్వాత రద్దయింది. దీంతో చివరి మ్యాచ్‌లో గెలిచి ఈ పర్యట నను గెలుపుతో ముగించాలని భారత జట్టు ఆశిస్తోంది. తొలి రెండు టీ20ల్లో భారత జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి సౌకర్యవంతమైన విజయాలను సాధిం చింది. తొలి మ్యాచ్‌లో 7 వికెట్లతో, రెండో మ్యాచ్‌లో 9 వికెట్లతో గెలిచింది. కానీ మూడో మ్యాచ్‌లో సౌతాఫ్రికా జట్టు 5 వికెట్లతో గెలిచి సరీస్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. నాలుగో టీ20లో భారత జట్టు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పటికీ వరుణుడు ఆ అవకాశాలను దెబ్బ తీశాడు. సౌతాఫ్రికా జట్టు 15.3 ఓవర్లో 3 వికెట్ల నష్టానికి 130 పరుగుల వద్ద వర్షం కురిసింది. ఎంతకీ తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. శనివారం నాటి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన గెలిస్తే ఒకే టూర్‌లో రెండు సిరీస్‌లు గెలిచిన ఘనత దక్కుతుంది. తొలి రెండు టీ20ల్లో అసా ధారణ ప్రతిభ కనబరిచిన భారత జట్టును మూడో మ్యాచ్‌లో సౌతాఫ్రికా జట్టు దెబ్బ తీసింది. అయితే ఈ చివరి మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంటామని హర్మన్‌ప్రీత్ సేన గట్టిగా నమ్ముతోంది. సీనియర్ ప్లేయర్ మిథాలీ రాజ్ తొలి రెండు టీ20 మ్యాచ్‌ల్లో వరుస అర్ధ సెంచరీలతో (54, 76) అదరగొట్టింది. కానీ మూడో టీ20లో మిథాలీ (0) విఫలమైంది. ఆమె ఓపెనింగ్ భాగస్వామి స్మృతి మంధన (28, 57, 37) కూడా జట్టుకు తనవంతు సహకారం అందిం చింది. అయితే ఓటమిపాలైన మూడో టీ20 మ్యాచ్‌లో మిడిలార్డర్ కుప్పకూల డంతో హర్మన్‌ప్రీత్ ఒక్కతే (48 బంతుల్లో 30) పోరాడింది. దీంతో 17.5 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌటైంది. వేద కృష్ణమూర్తి తొలి రెండు టీ20 మ్యాచ్‌ల్లో 37, 23 పరుగులతో జట్టుకు అండగా నిలిచేందుకు ప్రయత్నించి విఫలమైంది. అయితే శనివారం నాటి మ్యాచ్‌లో టాపార్డర్ మిథాలీ రాజ్, మంధన, హర్మన్‌ప్రీత్ కీలకపాత్ర పోషించాల్సి ఉంటుంది. బౌలింగ్ విభాగంలో ఆఫ్ స్పిన్నర్ అనుజ పాటిల్ తొలి మూడు మ్యాచ్‌ల్లో వికెట్లను తీసుకుని అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచింది. మూడో టీ20లో నాలుగు ఓవర్లలో 44 పరుగులిచ్చింది. దాని నుంచి పూర్తిగా కోలుకుని కేప్‌టౌన్‌లో సత్తా చాటేందుకు పాటిల్ సిద్ధమైంది. స్పిన్నర్ పూనమ్ యాదవ్, యువ పేసర్ పూజ వస్త్రాకర్ చెరి నాలుగు వికెట్లు తీసి సత్తా చాటారు. ముఖ్యంగా పూజ గాయపడిన వెటరన్ పేస్ బౌలర్ ఝులన్ గోస్వామిని మరిపి స్తోంది. 18 ఏళ్ల బౌలర్ పూజ అద్భుతమైన బౌలింగ్ ప్రతిభను కనబరుస్తోంది. అయితే ఆమె న్యూ బాల్ పార్ట్‌నర్ శిఖా పాండే (2 వికెట్లు) మాత్రం ఆశించిన మేరకు సత్తా చాటడం లేదు. మూడో టీ20లో పాండే 3 ఓవర్లలో 30 ఓవర్లు సమర్పించుకుంది. మరోవైపు నిర్ణీత ఓవర్ల క్రికెట్‌లో భారత మహిళలను అడ్డుకోవడంలో సౌతాఫ్రికా మహిళలు పూర్తిగా విఫలమయ్యారు. అయితే కెప్టెన్ డి వాన్ కెర్క్‌కు మూడో టీ20లో మాత్రమే సహచరుల నుంచి మద్దతు లభించింది. పేస్ బౌలర్ శబ్నిమ్ ఇస్మాయిల్ అద్భుత ప్రతిభ కనబరించింది. మూడో టీ20లో ఆమె ఐదు వికెట్లు తీసింది. దీంతో సౌతాఫ్రికా సిరీస్ ఆశలు సజీవంగా నిలిచాయి. ఇతర బౌలర్లలో ఎం. డానియెల్స్, క్లాస్ మూడు, రెండు వికెట్లు తీశారు. ఇన్నింగ్స్‌ను ప్రారంభించే కెప్టెన్ డి వాన్ నీకెర్క్ కొంత వరకు ఉపయోగకరమైన సహాయ సహకారాలను జట్టుకు అందించింది. కానీ అద్భుతమైన ఆరంభాన్ని భారీ స్కోర్లుగా మార్చడంలో విఫలమైంది. నాలుగో టీ20లో ఈమెతో పాటు మరో ఓపెనర్ లిజెల్లీ లీ విధ్వంసకర బ్యాటింగ్‌తో అర్ధ సెంచరీలు చేశారు. దీంతో 103 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. వీరిద్దరూ శనివారం నాటి ఐదో టీ20లోనూ అదరగొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.





రాత్రి 9-30 నుంచి సోనీ టెన్-1లో ప్రత్యక్ష ప్రసారం

పుజారాకు పుత్రికోత్సాహం

శుక్రవారం ఆడపిల్లకు జన్మనిచ్చిన పూజ



రాజ్‌కోట్: భారత క్రికెట్ టెస్టు బ్యాట్స్ మన్ చెటేశ్వర్ పుజారా తండ్రి అయ్యాడు. శుక్ర వారం పుజారా భార్య పూజ ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఈ సందర్భంగా పుజారా తన కుటుం బం ఫొటోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. అంతేకా కుండా 'చిన్నారికి స్వాగతం. మా జీవి తంలో చేపట్టబోతున్న కొత్త బాధ్యతలపై ఉద్విగ్నం గా, సంతోషంగా ఉంది. మేము కోరుకు న్నదే మాకు దక్కింది' అని ఆ ఫొటోకు పుజా రా క్యాప్షన్ పెట్టాడు. ఈ ఏడాది ఐపీఎల్‌కు అమ్ము డుపోని పుజారా ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్నాడు. ఇతని సౌరా ష్ట్ర జట్టు గురువారం బరోడాను 3 వికెట్లతో చిత్తు చేసి సెమీఫైనల్‌కు చేరుకుంది. 'ఈ ఏడాది మా జీవి తంలో ఎనలేని ఆనందం రాబో తోంది' అని జనవరి 1వ తేదీన పుజారా ఇన్ స్టాగ్రామ్‌లో మెసేజ్ పెట్టాడు. టీమిండియా ఇంగ్లండ్ టూర్‌కు పుజారా సిద్ధమయ్యాడు. ఇటీవలే కౌంటీల్లో యార్క్‌షైర్ జట్టుకు ఆడివచ్చాడు.


నేడు ఇండియా, సౌతాఫ్రికా మధ్య చివరి మూడో టీ20

కేప్‌టౌన్: ఒడుదుడుకుల సౌతాఫ్రికా పర్యటనకు ఖచ్చితమైన ముగింపు ఇవ్వాలని టీమిండియా భావి స్తోంది. అరుదైన రికార్డును సొంతం చేసుకునేందుకు సౌతాఫ్రి కాతో నేడు టీమిండియా చివరి, మూడో టీ20 ఆడనుంది. గత మ్యాచ్‌లో దెబ్బతిన్న కోహ్లీ సేన కోలుకుని ఎనిమిది వారాల సుదీర్ఘ పర్యటనను గెలుపుతో ముగిం చాలని భావిస్తోంది. జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన తొలి టీ20లో మెన్ ఇన్ బ్లూ 28 పరుగులతో గెలిచారు. కానీ సెంచూరియన్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో సౌతాఫ్రికా పుంజుకుని 6 వికెట్లతో టీమిండియాను ఓడించింది. దీంతో మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్ ప్రస్తుతం 1-1తో సమంగా ఉంది. తొలిసారి సౌతాఫ్రికా జట్టు సొంత గడ్డపై సామర్థ్యం కంటే తక్కువ ప్రతిభ కనబరిచింది. 8 టీ20 మ్యాచ్‌లకు గాను ఐదింటిలో సౌతాఫ్రికా ఓటమిపాలైంది. 2007 వరల్డ్ టీ20లో రెండు మ్యాచ్‌లు గెలిచిన సౌతాఫ్రికా కేప్‌టౌన్‌లో ఇప్పటి వరకు ఒక్క ద్వైపాక్షిక టీ20 మ్యాచ్ గెలవలేదు. ఈ సిరీస్ ఆరంభం నుంచి భారత బ్యాట్స్‌మన్, బౌలర్ల కోసం పక్కా ప్రణాళిక రూపొందించామని.. కానీ దాన్ని అమలు చేయడంలో విఫలమయ్యామని తాత్కాలిక కెప్టెన్ జేపీ డుమిని అంటున్నాడు. సెంచూరియన్‌లో జరిగిన టీ20 మ్యాచ్‌లో బౌలింగ్ ప్లాన్‌ను మార్చింది. తర్వాత భారత బౌలర్లపై సౌతాఫ్రికా జట్టు విరుచుకు పడింది. మార్పులేని జట్టుతో గత మ్యాచ్‌లో డుమిని బరిలోకి దిగాడు. మరి ఈ నిర్ణయాత్మక మ్యాచ్‌లోనూ రాణించేందుకు ఆదే జట్టుతో బరిలోకి దిగే అవకాశముంది. విధ్వంసకర బ్యాటింగ్ చేయగల జాన్-జాన్ స్మట్స్ గత మ్యాచ్‌లో సత్తా చాటలేకపోయాడు. ఇక డేవిడ్ మిల్లర్ పేలవమైన ఆట వన్డే సిరీస్ నుంచి కొనసాగుతోంది. అయినప్పటికీ డేవిడ్ మిల్లర్ పట్ల టీమ్ మేనేజ్‌మెంట్ విశ్వాసం కనబరుస్తోంది. ఈ కీలకమైన మ్యాచ్‌లో రాణిస్తాడని భావిస్తోంది. కడుపు నొప్పి కారణంగా జస్‌ప్రీత్ బుమ్రా గత మ్యాచ్‌కు దూరం కావడంతో జట్టులో మార్పు చేయాలని టీమిండియా భావించింది. ఈ ఫైనల్ మ్యాచ్‌లోనూ ఒకట్రెండు మార్పులు చోటు చేసుకునే అవకాశముంది. బుమ్రా ఫిట్‌నెస్‌పై ఇంకా అనుమానాలు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ మూడు గంటల వ్యవధి గల ఈ మ్యాచ్‌లో బుమ్రాను ఆడించే సాహసం చేస్తుందో లేదో చూడాలి. నిజం చెప్పాలంటే శ్రీలంకలో ముక్కోణపు సిరీస్‌కు రెండు వారాల విశ్రాంతి లభిస్తుంది కాబట్టి చివరి టీ20లో బుమ్రాను ఆడించే అవకాశముంది. బౌలింగ్ కాంబినేషన్‌పై కూడా టీమిండియా మేనేజ్ మెంట్ దృష్టి పెట్టింది. మ్యాచ్‌లో ఎడమ చేతి బౌలర్ ఉండాలన్న కారణంగా రెండో టీ20లో జైదేవ్ ఉనద్కట్‌ను తీసుకున్నారు.



కానీ అతను 2 వికెట్లు తీసుకున్నప్పటికీ ఓవర్‌కు 9.75 చొప్పున 75 పరుగులు సమర్పించుకున్నాడు. యజ్వేంద్ర చాహల్ బౌలింగ్‌ను సౌతాఫ్రికా విధ్వంస కర బ్యాట్స్‌మన్ హెన్రిచ్ క్లాసెన్ చితగ్గొట్టాడు. మరోసారి తన విశ్వరూపాన్ని చూపేందుకు సిద్ధమయ్యాడు. ఈ నేపథ్యంలోనే బౌలింగ్ కాంబినేషన్‌ను మార్చాలని టీమిండియా భావిస్తోంది. ఒకవేళ బుమ్రాకు తుది జట్టులో చోటు కల్పిస్తే ఉనద్కట్ తన స్థానాన్ని త్యాగం చేయాల్సివుంటుంది. షార్దూల్ ఠాకూర్ చాలా తెలివిగా తన పేస్‌లో మార్పులు చేసుకుని సెంచూరియన్‌లో 4 ఓవర్లలో 31 పరుగులిచ్చి 1 వికెట్ తీశాడు. వన్డే సిరీస్‌లో సూపర్‌స్పోర్ట్స్ పార్క్‌లాగా ఈ న్యూలాండ్స్ పిచ్ స్లోగా బిహేవ్ చేసింది. చివరి టీ20 పిచ్‌ను కూడా స్లో పిచ్‌గానే తయారు చేశారు.

బీసీసీఐపై నిప్పులు చెరిగిన సీఓఏ



ముంబై: బీసీసీఐకి, సుప్రీం కోర్టు నియమిత కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీఓఏ)కు లోలోపల రగులుతున్న గొడవ ఒక్కసారిగా బద్దలైంది. బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు అమితాబ్ చౌదరిపై సీఓఏ చీఫ్ వినోద్ రాయ్ నిప్పులు చెరిగారు. బీసీసీఐ తమతో సంప్ర దించకుండా ఏక పక్షంగా నిర్ణయాలు తీసుకుం టోందని సీఓఏ చీఫ్ విమర్శించారు. భారత్‌లో డే/నైట్ టెస్టు నిర్వహణపై తమకు (డయానా ఎడుల్జీ, ఇతర ఇద్దరు సభ్యులకు) తెలియకుండా చర్చించడాన్ని రాయ్ తీవ్రంగా తప్పుపట్టారు. బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, కోశాధికారి అనిరుధ్ చౌదరి, చివరికి ప్లేయర్స్‌కు కూడా తెలియకుండా చర్చించడంపై వినోద్ రాయ్ చిందులేసినట్టు ఓ ఆంగ్ల దినపత్రిక పేర్కొంది. ఈ ఏడాది అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో డే/నైట్ టెస్టు మ్యాచ్ నిర్వహించాలని చౌదరి ప్రతిపాదిం చారు. ఈ విషయాన్ని టీమిండియా ప్రధాన కోచ్ రవిశాస్త్రితో టెలిఫోన్లో, బీసీసీఐ సీఈఓ రాహుల్ జొహ్రీ, జనరల్ మేనేజర్ (క్రికెట్ ఆపరేషన్స్) సబా కరీంతో చౌదరీ చర్చించారు. సిద్ధాంత పరమైన నిర్ణయాలను బీసీసీఐ ఈ విధంగా తీసుకోవడంపై సీఓఏ చీఫ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. 'క్రికెట్‌పై నాకు మీకున్నంత నాలెడ్జ్ లేకపోవచ్చు. (మీకంటే ఎక్కువ నాలెడ్జ్ ఉన్న డయానాను ఇందులోనుంచి మినహాయిస్తు న్నాను). కానీ నేను ప్రజల ప్రతినిధిగా పనిచే స్తున్నాను. వాళ్లు మీకు అతి పెద్ద భాగస్వా ములు. మీరు ఇష్టారాజ్యంగా తీసుకునే నిర్ణయాలు ప్రజలపై ప్రభావం చూపిస్తాయన్న విషయం కూడా మీకు తెలీదా?' అని బీసీసీఐకి రాయ్ ఈ-మెయిల్ ద్వారా సమాధానమిచ్చారు. అయితే డే/నైట్ మ్యాచ్‌ను మధ్యాహ్నం నుంచి పెట్టాలని.. తద్వారా సూర్యాస్తమయం తర్వాత కూడా మ్యాచ్ కొనసాగు తుందని రవిశాస్త్రి అభిప్రాయపడ్డారు. అయితే చౌదరీ నిర్ణయా న్ని రాయ్ పక్కన పెట్టారు. క్రికెటర్లతో పాటు అందరితో చర్చించిన తర్వాత డే/నైట్ టెస్టుపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

కొరియా పర్యటన జట్టులో రజనీకి చోటు

- రాణి రాంపాల్‌కు పగ్గాలు
- మహిళల హాకీ జట్టు ఎంపిక



న్యూఢిల్లీ: కొరియా పర్యటనకు వెళ్లనున్న భారత మహిళల హాకీ జట్టులో తెలుగు తేజం రజనీ ఎతిమరపుకు చోటు దక్కింది. ఈమెతో పాటు అరంగేట్ర ప్లేయర్ స్వాతి ఈ పర్యటనలో గోల్ కీపర్లుగా వ్యవహరించనున్నారు. అయితే ప్రముఖ గోల్‌కీపర్ సవితకు విశ్రాంతి నిచ్చారు. ఈ జట్టుకు రాణి రాంపాల్ నేతృత్వం వహించనుంది. ఈ ఏడాది సీజన్ తొలి విదేశీ పర్యటనకు 20 మంది సభ్యుల పటిష్టమైన జట్టును సెలెక్టర్లు శుక్రవారం ఎంపిక చేశారు. వచ్చే నెల 3వ తేదీన కొరియా పర్యటనకు వెళ్ల ఈ జట్టు ఐదు మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ పర్యటనలో డిఫెండర్ సునీత లక్రా వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుంది.

సెమీస్‌లో వికాస్, గౌరవ్

స్ట్రాండ్జా మెమోరియల్ బాక్సింగ్

సోఫియా (బల్గేరియా): ఆసియా గేమ్స్ స్వర్ణ పతక మాజీ విజేత వికాస్ కృష్ణన్ (75 కిలోల కేటగిరి), ఎదురులేని గౌరవ్ సోలంకి (52 కిలోలు) స్ట్రాండ్జా మెమోరియల్ పురుషులు, మహిళల బాక్సింగ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్నారు. గురువారం రాత్రి ఇక్కడ జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో గౌరవ్ కిర్గిస్థాన్‌కు చెందిన అజాత్ ఉసేనలీవ్‌ను చిత్తు చేయగా.. వికాస్ కజకిస్థాన్‌కు చెందిన టర్సిన్బే కలఖ్‌మెట్‌పై గెలుపొందాడు. చేతి గాయం నుంచి కోలుకుని రింగ్‌లోకి దిగిన వికాస్‌కు ఇది చాలా ముఖ్యమైన గెలుపు. గాయం కారణంగా వికాస్ జాతీయ చాంపియన్‌షిప్‌కు, ఇండియా ఓపెన్‌కు దూరమయ్యాడు. క్వార్టర్ ఫైనల్ పోరులో వికాస్, గౌరవ్ గెలవడంతో పురుషుల విభాగంలో మొత్తం నలుగురు భారతీయులు సెమీఫైనల్‌కు చేరుకున్నట్టయింది. ఇంతకుముందు అమిత్ పంఘాల్ (48 కిలోలు), మహ్మద్ హుసముద్దీన్ (56 కిలోలు) సెమీస్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. అలాగే మహిళల విభాగంలో ఎంసీ మేరీకోమ్ (48 కిలోలు), ఎల్. సరితా దేవి (60 కిలోలు), సీమ పూనియా (+81 కిలోలు), స్వీటి బూర (75 కిలోలు), మీనా కుమారి దేవి (54 కిలోలు), భాగ్యవతి కచరి (81 కిలోలు) సెమీస్‌కు చేరుకున్నారు.

టీ20 లేకపోతే క్రికెట్‌కు మనుగడ లేదు

మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ



కోయంబత్తూరు: టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ట్వంటీ20 క్రికెట్‌కు అండగా నిలిచాడు. టీ20 లేకపోతే క్రికెట్‌కు మనుగడే లేదన్నారు. ఆలిండియా ఆప్తాల్మాలజీ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న గంగూలీ మీడియాతో మాట్లాడారు. క్రికెటర్లు ఎడతెరిపిలేని మ్యాచ్‌లు ఆడుతున్న దానిపై అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. 'క్రికెట్‌కు టీ20 తప్పనిసరి. అది లేకపోతే క్రికెట్ జీవించలేదు' అని అన్నారు. సౌతాఫ్రికా పర్యటనలో కోహ్లీ సేన ప్రతిభపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ. చాలా బాగా కొనసాగుతోందన్నారు. వన్డేల్లో అద్భుతంగా ఆడారని చెప్పారు. 'శనివారం జరిగే చివరి టీ20లో టీమిండియా గెలుస్తుందని భావిస్తున్నాను' అని ఆయన అన్నారు. అప్పటికి ఇప్పటికీ సెలెక్షన్స్‌లో మార్పులపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. ఇప్పుడున్నది అత్యుత్తమమైన సెలెక్షన్ పాలసీ అని చెప్పారు. కోచ్‌ల పదవీ కాలాన్ని దారుణంగా తగ్గించడంపై ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తుల్లో అలాంటివి జరగకూడదని భావిస్తున్నట్టు తెలిపారు. భారత క్రికెట్‌లో యువకులకు ఆవకాశంపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. చాలా మంది యువకులు దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. 'ప్రస్తుత టీమిండియాలో మనీష్ పాండే, హార్దిక్ పాండ్యా ఆడుతున్నారు. వీళ్ల వీరేంద్ర సెహ్వాగ్, హర్భజన్ సింగ్ అంతటి వారవ్వాలంటే తగినంత సమయం ఇవ్వాలి. సెహ్వాగ్, హర్భజన్‌లు కూడా కొద్ది కాలం తర్వాత మెరుగైన ప్రతిభ కనబరిచారు' అని గంగూలీ చెప్పారు. మహేంద్ర సింగ్ ధోనీ గురించి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. 'వన్డేలు, టీ20ల్లో ధోనీ చక్కని ప్రతిభ కనబరుస్తున్నాడు. అతడిని దాటి వెళ్లడం చాలా కష్టం' అని పేర్కొన్నారు. క్రికెట్‌కు ధోనీ సహాయ సహకారాలను గౌరవించాలని చెప్పారు. కోహ్లీ సేన ఫిట్‌నెస్‌పై గంగూలీ స్పందిస్తూ.. అంతర్జాతీయ క్రికెటర్లకంటే మెరుగ్గా ఉన్నారని తెలిపారు. పురుషులు, మహిళల జట్లకు మధ్య పోలికపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'పురుషుల జట్టు చాలా ఉత్తమమైంది. మహిళల క్రికెట్ జట్టు కూడా అసాధారణ ప్రతిభ కనబరుస్తోంది. హర్మన్‌ప్రీత్ కంటే భారీ సిక్సర్ ఎవరైనా కొట్టడం మీరు చూశారా? ఏది ఏమైనా పురుషుల జట్టు మెరుగైంది' అని అన్నారు.

బంగ్లా కూడా బలమైన జట్టే

మాజీ బ్యాట్స్‌మన్, కామెంటేటర్ మంజ్రేకర్



న్యూఢిల్లీ: నిడహాస్ ట్రోఫీ ముక్కోణపు వన్డే సిరీస్ వచ్చే నెల శ్రీలంకలో జరగనుంది. ఈ టోర్నీలో ఆతిథ్య శ్రీలంకతో పాటు ఇండియా, బంగ్లాదేశ్ జట్లు పాల్గొననున్నాయి. ఈ టోర్నీలో ఇండియా తర్వాత బంగ్లాదేశ్ రెండో బలమైన జట్టని భారత మాజీ బ్యాట్స్‌మన్, క్రికెట్ కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ అన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో అభివృద్ధి చెందేందుకు బంగ్లాదేశ్‌కు ఇది మరో మంచి అవకాశమన్నారు. 'ప్రపంచ క్రికెట్‌లో అతి పెద్ద సంఖ్యలో అభిమానులున్న ఇండియా ప్రేక్షకులకు తమ సత్తా చూపేందుకు బంగ్లాదేశ్‌కు నిడహాస్ ట్రోఫీ మరో మంచి అవకాశమిచ్చింది. సంవత్సరాలు గడిచే కొద్ది బంగ్లాదేశ్ నెమ్మదిగా బలమైన జట్టుగా ఎదుగుతోంది. కండ బలంతో, ఫిట్‌నెస్‌తో, స్వీయ ఆత్మవిశ్వాసంతో ఏదైనా చేయగలదన్నట్టు కనిపిస్తోంది. విదేశీ పర్యటనలకు వెళ్లేంతా ఇంకా చాలా దూరం ప్రయాణం చేయాల్సి వుంది. ఈ ముక్కోణపు సిరీస్‌లో ఇండియా తర్వాత బంగ్లాదేశ్ రెండో బలమైన జట్టుగా నాకు అనిపిస్తోంది. షకీబ్, ముస్తాఫిజుర్ ఇద్దరూ ప్రపంచ శ్రేణి ఆటగాళ్లు. ఫలితాన్ని మార్చివేయగల సత్తా ఉన్న వాళ్లు. వాళ్లు మాత్రమే కాదు.. సందర్భాన్ని బట్టి తమీమ్ ఇక్బాల్ కూడా జట్టుకు అండగా నిలవగలడు.' అని మంజ్రేకర్ అన్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.